RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:245 హైదరాబాద్, బుధవారం, 30 ఏప్రిల్ 2025 పేజీలు: 12 వెల: 1.00

# దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉంది: ప్రధాని



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: దేశ భవిష్యత్తు కోసం యువతను సిద్ధం చేయడంలో విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ విద్యా వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ శతాబ్దానికి అనుగుణంగా విద్య వ్యవస్థను అధునీకరించే దిశగా తమ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకొంటుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో వైయూజీఎం సదస్సులో ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. ప్రపంచ విద్యా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని దీనిని రూపొందించామన్నారు. ఈ విద్య విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత.. జాతీయ పాఠ్యాంశాల్లోనే కాకుండా.. అభ్యస, బోధనా విధానంలో పలు మార్పులు చూస్తున్నామని పేర్కొన్నారు. వన్ నేషన్ వన్ ఎడ్యుకేషన్ కింద ఏఐ (కృతిమ మేధ) అధారిత మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. దీనిని సైతం విస్తరించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని చెప్పారు. 21వ శతాబ్దపు డిమాండ్లను తీర్చడానికి దేశ విద్య వ్యవస్థను ఆధునికరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ క్రమంలో భవిష్యత్తులో ప్రతి సాంకేతిక పరిజ్ఞానంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమంగా మార్చడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా యువతకు ఆయన పిలుపు నిచ్చారు. 2013-14లో పరిశోధనాభివృద్ధికి స్థూల వ్యయంలో కేవలం రూ. 60 వేల కోట్లు మాత్రమే కేటాయించారని.. కానీ నేడు అది 1.25 లక్షల కోట్లకు పెరిగిందన్నారు.

## హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు.. ఏర్పాట్లపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్: మిస్‌వరల్డ్ - 2025 పోటీల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న ఏర్పాట్లను అధికారులు సీఎంకు వివరించారు. మే 10న పోటీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అతిథులకు, పోటీల్లో పాల్గొంటున్నవారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎయిర్‌పోర్టు, హోటళ్లు, చారిత్రక కట్టడాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉండాలన్నారు. అతిథులు పర్యాటక ప్రాంతాలు సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నగర సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.



## డీజీపీ రేసులో ఆ ఎనిమిది మంది

హైదరాబాద్, ఏప్రిల్ 29: తెలంగాణ డీజీపీ డా. జితేందర్ మరికొన్ని నెలల్లో రిటైర్ అవనున్నారు. ఈ నేపథ్యం కొత్త పోలీస్ బాస్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. డీజీపీ రేసులో ఎనిమిది మంది సీనియర్ ఐపీఎస్‌లు ఉన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఎనిమిది మంది పేర్లను సర్కార్ పంపించింది. రాష్ట్ర ప్రభుత్వం అర్హతల ఆధారంగా జాబితా నుంచి ముగ్గురి పేర్లను సూచిస్తూ తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి యూపీఎస్సీ పంపించనుంది. ప్రస్తుతం డీజీపీగా




కొనసాగుతున్న డా.జితేందర్ ఈ ఏడాది సెప్టెంబర్ 6న పదవీ విరమణ చేయనున్నారు.

ఈ క్రమంలో ఎనిమిది మంది సీనీయర్ ఐపీఎస్‌ల పేర్లను యూపీఎస్సీకి సర్కార్ పంపించింది. రవి గుప్తా, సీవీ ఆనంద్, డా. జితేందర్ , ఆప్టే వినాయక్ ప్రభాకర్, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి. బి. శివధర్ రెడ్డి డా. సౌమ్య మిశ్రా శిఖా గోయల్ పేర్లను రాష్ట్ర ప్రభుత్వం పంపించింది. వీరిలో తెలంగాణ పోలీస్ శాఖ కొత్త బాస్ ఎవరో మరికొద్దిరోజుల్లో తెలియనుంది. ఈ ఎనిమిది మంది ఐపీఎస్ ఆఫీసర్లతో అర్హతల ఆధారంగా ముగ్గురి పేర్లను సూచిస్తూ సర్కార్‌కు తిరిగి పంపించనుంది యూపీఎస్సీ. వారిలో ఒకరిని ప్రభుత్వం డీజీపీగా నియమించనుంది.

## భూదాన్ లాండ్ స్కాం.. ఈడీ సంచలన ప్రకటన

భూదాన్ భూముల వ్యవహారంపై ఈడీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మనీలాండరింగ్ వ్యవహారంలో హైదరాబాద్ లోని ఐదు చోట్ల సోదాలు నిర్వహించినట్లు తెలిపింది. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేయడంపై విచారణ చేస్తున్నామని స్పష్టం చేసింది. ఆ ప్రకటనలో.. ‘ నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించడంపై ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వ అధికారులపై .. తెలంగాణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు జరుపుతున్నాం.మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో ఉన్న భూములు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించాము. ఖాదర్ ఉన్నిసా పూర్వీకుల ఆస్తిగా చెప్పి రెవెన్యూ రికార్డులను మోసపూరితంగా మార్చేశారు. కొంత మంది దళారులతో కలిసి భూమిని వివిధ సంస్థలకు విక్రయించారు.




భారత శక్తి
VOICE OF INDIAN

## పీఓకే నుంచి పరార్

పహల్గాం ఉగ్రదాడితో భారత్- పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత్ ధీటైన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో.. దేనికైనా సిద్ధం, యుద్ధానికి రెడీ అంటూ పైకి మేకపోతు గాంభీర్యాలు ప్రదర్శిస్తున్నా.. పాకిస్థాన్ లోలోపల వణికిపోతుంది. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నామని ఆధారాలతో తెలిస్తే.. అంతర్జాతీయంగా పాక్ ఒంటరి అవుతుందని తెలిసి ముందస్తు చర్యలు ప్రారంభించింది. పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి.జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత భారత్ ప్రతీకారం తీర్చుకుంటామనే భయంతో.. పాకిస్తాన్ సైన్యం పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె) అంతటా అనేక ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ఖాళీ చేయడం ప్రారంభించిందని నిఘా వర్గాలు సోమవారం వెల్లడించాయి.. భారత దాడులను నివారించడానికి ఉగ్రవాదులను ఆర్మీ షెల్టర్లు, భూగర్భ బంకర్లలోకి మారుస్తున్నారని నిఘా వర్గాలు తెలిపాయి..పీఓకే ప్రాంతం అంతటా చాలా లాంచ్ ప్యాడ్‌లు ఉన్నట్లు భారత భద్రతా సంస్థలు గుర్తించిన కొంతసేపటికే.. పాకిస్తాన్ ఈ చర్య తీసుకుంది.. కెల్, సర్ది, దుధ్నియల్, అత్మకం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుటా, కోట్లి, ఖుయిరట్టా, మంధర్, నికైల్, చమన్‌కోట్, జంకోట్ నుండి ఉగ్రవాదులను తరలించినట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి..ఈ లాంచ్ ప్యాడ్‌లు చాలా కాలంగా ఉగ్రవాదులను నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) దాటి జమ్మూ కాశ్మీర్‌లోకి ప్రవేవేశించడానికి..అలాగే.. ఉగ్రవాదులను సమీకరించే కీలక కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. భారత నిఘా, ముందస్తు చర్యల నుంచి తన ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కాపాడుకోవడానికి పాకిస్తాన్ ప్రయత్నాలు చేస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఎల్‌ఓసి వెంబడి ఉద్రిక్తతలు తీవ్రంగా పెరిగాయి.. ఈ ఉగ్రదాడిలో 26 మంది మరణించారు.గత వారం, భారత భద్రతా దళాలు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ అంతటా పనిచేస్తున్న కనీసం 42 ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లు, శిక్షణా కేంద్రాలపై నిఘా పెట్టాయి. నిఘా నివేదికల ప్రకారం, 150 నుండి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ప్రస్తుతం వివిధ శిబిరాల్లో ఉండి, చొరబాటు ప్రయత్నాలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. భారత్ వద్ద ప్రస్తుతం రెండు విమాన వాహక నౌకలు ఉన్నాయి. ఒకటి విక్రమాదిత్య, మరొకటి విక్రాంత్. ఈ నౌకలను హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో భద్రతా ప్రయోజనాల కోసం వినియోగిస్తారు” అని యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో డిఫెన్స్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న తిరునావుక్కరసు చెప్పారు.“ఇది చాలా ఉద్రిక్త పరిస్థితి. పహల్గాం దాడి వెనుక నిజంగా పాకిస్తాన్ హస్తం ఉండి, యుద్ధానికి అవకాశం ఉంటే గుజరాత్, ముంబయిలను ఆ దేశం సులభంగా లక్ష్యంగా చేసుకుంటుంది. అందుకే ఆ ప్రదేశాల్లో ఎలాంటి దాడులనైనా తిప్పికొట్టేందుకు ఈ నౌకను నిర్మించారు” అని తిరునావుక్కరసు అన్నారు.శ్రీనగర్ లేదా దిల్లీ వైమానిక స్థావరాల నుంచి విమానాలను నడపడం, ఇతర ప్రాంతాల నుంచి దాడులు చేయడం కంటే, ఈ వైమానిక స్థావరం పైనుంచి దాడిని మరింత సులభంగా, వేగంగా చేయవచ్చు. పాకిస్తాన్‌కు అలాంటి విమాన వాహక నౌక లేకపోవడం ఇండియాకు అనుకూలమైన విషయం” అని అన్నారాయన.యుద్ధనౌకకు పూర్తిగా ఇంధనం నింపితే మాటిమాటికి తీరానికి రావాల్సిన పనిలేకుండా సుదీర్ఘకాలం సముద్రంలోనే పనిచేయగలదన్నారు.మధ్య యుద్ధం జరుగుతుందో లేదో ఎవరూ ఊహించలేరు. ఇప్పుడు జరుగుతున్నదంతా భారతదేశపు సంసిద్ధతను తెలియజేయడానికే” అని మాజీ లెఫ్టినెంట్ కల్నల్ త్యాగరాజన్ అన్నారు.భారత సైన్యం తన యుద్ధనౌకలు, విమానాలు, సైనిక దళాలను అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వద్ద ఉన్న స్థావరాలలో మోహరిస్తోంది. శత్రుదళాలు ఏదైనా దాడికి సిద్ధమైతే భారత్ ముందుగానే ఎదుర్కోగలుగుతుంది.ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రస్తుతం కార్వార్ నుంచి ముందుకు వెళ్తోందంటే అది కూడా ఒక కారణమే. శత్రువుల ఇంధన ఉత్పత్తి కేంద్రాలు, భూ, సముద్ర, వైమానిక స్థావరాలు, సమాచార కేంద్రాలు, ఆయుధ డిపోలు, చమురు డిపోలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేందుకు అవకాశం ఉంటుంది.’1971 యుద్ధం సమయంలో ఐఎన్ఎస్ విక్రాంత్ తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)పై సైనిక చర్యలు, నౌకాదళ దాడులు నిర్వహించింది. ప్రస్తుత కార్యకలాపాలు 1971 యుద్ధ వ్యూహాన్నిఅనుసరిస్తూ జరిగి ఉండొచ్చు” అని త్యాగరాజన్ అన్నారు.రెండో ప్రపంచ యుద్ధం ముగిశాక ఈ నౌక నిర్మాణ పనులు ఆగిపోయాయి. అప్పుడు బ్రిటీష్ ప్రభుత్వం ఆ అసంపూర్ణ నౌకను అమ్మేస్తామని ప్రకటించింది. 1957లో భారత్ ఈ నౌకను కొనుగోలు చేసింది. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత 1961లో దానిని జాతికి అంకితం చేశారు.సముద్ర మార్గం ద్వారా పాక్ సైనికుల దాడులను అడ్డుకుని, శత్రు లక్ష్యాలను ధ్వంసం చేసిందని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పేర్కొంది.భారత నౌకాదళంలో 36 ఏళ్లపాటు సేవలందించిన తరువాత 1997లో విక్రాంత్‌కు విశ్రాంతిని ఇచ్చారు. దీనిని పూర్తిగా ధ్వంసం చేయడానికి ముందు 15 ఏళ్లపాటు మ్యూజియంగానూ ఉపయోగించారు.హిజ్బుల్ ముజాహిదీన్, జైష్-ఎ-మొహమ్మద్ , లష్కరే-ఎ-తోయిబా నుండి దాదాపు 60 మంది విదేశీ ఉగ్రవాదులు జమ్మూ కాశ్మీర్‌లో చురుగ్గా ఉన్నారని, 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారని నిఘా వర్గాలు నివేదించాయి..

# గురు, శిష్యుల ఎదురు చూపులు

గుంటూరు, ఏప్రిల్ 29,

టీడీపీలో సీనియర్ నేతలకు చోటు దక్కే అవకాశం లేదు. ఇకపై అందరూ యువకులే ముందుండి పాలిటిక్స్ ను నడపాలని సైకిల్ పార్టీ అధినాయకత్వం భావిస్తుంది. అందుకే చాలా మంది సీనియర్లు టీడీపీలో పదవులు రాక కేవలం పార్టీ పదవులకే పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాంటిది పార్టీలు మారి వచ్చిన వాళ్లని అసలు ఎందుకు నమ్ముతారు? ఎందుకు చేరదీస్తారు? వాళ్లేమీ స్వతహాగా ఓటు బ్యాంకు ఉన్న నేతలు కాదు. అలాగే స్వయంప్రకాశిత నేతలు కూడా కాదు. అలాంటి వారిని ఎందుకు కేర్ చేస్తారు. అలాంటిది వయసుడిగిపోయి, పార్టీలు మారి.. మారి వచ్చిన వాళ్లను టీడీపీ నాయకత్వం ఎందుకు దగ్గరకు తీసుకుంటుంది.సీనియర్ నేతకు కష్టాలే... ఆంధ్రప్రదేశ్ లో సీనియర్ నేత డొక్కా మాణిక్యవరప్రసాద్ రాజకీయ పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. ఉన్న సీనియర్ నేతలకే చోటు చిక్కడం లేదు. పట్టు లేదు. ఇప్పుడు పార్టీలు మారి వచ్చిన డొక్కా మాణిక్యవరప్రసాద్ ను అసలు టీడీపీ అధినాయకత్వం ఎందుకు కేర్ చేస్తుంది? అవును.. అసలు ఆయన ఏ నియోజకవర్గంలోనూ ప్రభావం చేయగల నేత కాదు అని అందరికీ తెలుసు. ఏదో గాలి వాటున, సామాజికవర్గం కోణంలో పదవులు పొందారే తప్ప ఆయనకు పట్టున్న ప్రాంతం కూడా ఏదీ లేదు. ఆ విషయం తెలిసిన టీడీపీ నాయకత్వం ఇప్పుడు మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ ను దూరం పెట్టినట్లు తెలిసింది. ఆయన ఎంత గింజుకున్నా పదవి దక్కే అవకాశం లేదంటునారు. గుంటూరు జిల్లాలో ఒకప్పుడు రాయపాటి సాంబశివరావు హవా నడిచేది. రాయపాటి సాంబశివరావు శిష్యుడిగా డొక్కా మాణిక్యవరప్రసాద్ రాజకీయంగా ఎదిగారు. కాంగ్రెస్ హయాంలో మంత్రి పదవిని కూడా దక్కించుకున్నారు. 20024, 2009 లో వరసగా తాడికొండ నియోజకవర్గం నుంచి వరసగా గెలిచారు. అది కూడా నాటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హవాలోనే డొక్కా మాణిక్యవరప్రసాద్ గెలిచారన్నది అక్షర సత్యం. అదే సమయంలో 2009లో మంత్రి పదవి కూడా దక్కించుకున్నారు. రాష్ట్ర విభజన ఆయన కొంపముంచిందనే చెప్పాలి. పోటీ చేయడానికి నియోజకవర్గమే దొరకలేదు. కాంగ్రెస్ లో కొంత కాలం ఉండి తర్వాత టీడీపీలో చేరారు. 2019లో టీడీపీ పత్తిపాడు టికెట్ దక్కించుకున్నా నాటి జగన్ హవాలో ఓటమిని మూటగట్టుకున్నారు. వైసీపీ అధికారంలోకి రావడంతో టీడీపీని వీడి వైసీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. ఎప్పుడైనా జరగొచ్చుట ఎటు అధికారం ఉంటే అటు... అంతటితో ఊరుకున్నారా? అంటే లేదు. 2024లో మళ్లీ అధికారం టీడీపీకి రావడంతో వైసీపీలో ఎమ్మెల్సీగా ఉన్న డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిపోయారు. దీంతో ఆయన పొలిటికల్ గ్రాఫ్ చిన్న పిల్లాడికి కూడా అర్థమయింది. ఎటు అధికారం ఉంటే అటు అడుగులు వేసే డొక్కా మాణిక్యవరప్రసాద్ ను ఇప్పుడు ఎటు కాకుండా పోయారు. టీడీపీలో చేరినా ఆయనకు ప్రయారిటీ లేదు. పైగా ఉన్న సీనియర్ నేతలను పక్కన పెడుతున్న టీడీపీ నాయకత్వం ఇంతోటి నేతకు ఎందుకు ప్రయారిటీ ఇస్తుంది? అందుకే డొక్కా మాణిక్య వరప్రసాద్ రెండు ఎన్నికల్లో విజయంతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఆయన రాజకీయంగా రాయపాటి తో పిచ్చాపాటి మాట్లాడుకోవడం మినహా ప్రస్తుతమున్న పరిస్థితుల్లో చేయగలిగిందేమీ లేదు. భవిష్యత్ కూడా కనుచూపు మేరల్లో కనిపించడం లేదు.

# ఇప్పుడు సజ్జలే టార్గెట్టా...

విజయవాడ, ఏప్రిల్ 29,



ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరసగా అరెస్ట్ లు జరుగుతున్నాయి. ఐపీఎస్ లతో పాటు రాజకీయ నేతలు కూడా ఇప్పటికే జైలుకు వెళుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తమను ఇబ్బందులు పెట్టిన వారిపై పాత కేసులు తోడి మరీ లోపలికి పంపుతున్నారు. వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళి, నందిగం సురేష్ తో పాటు తాజాగా ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులు ఇలా ఒక్కొక్కరు కీలక నేతలు జైలుకు వెళ్లి వస్తున్నారు. వీరిలో కొందరు జైలుకు వెళ్లి బెయిల్ పై బయటకు రాగా, మరికొందరు జైళ్లలోనే మగ్గుతున్నారు. అయినా సరే.. గతంలో కీలకంగా మారిన వారందరిపైనా వరస కేసులు నమోదవుతుండటంతో ఇప్పుడు అందరి వేళ్లూ సజ్జల రామకృష్ణారెడ్డి వైపు చూపుతున్నాయి.. సజ్జల రామకృష్ణారెడ్డి గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. ఆయనకు అప్పటి విపక్షాలు సకల శాఖ మంత్రిగా కూడా పేరు పెట్టారు. ప్రధానంగా హోం శాఖను ఆయన చెప్పుచేతల్లో ఉంచుకుని మరీ నాడు టీడీపీ నేతలను, కార్యకర్తలపై కేసులు పెట్టడమే కాకుండా, సాక్షాత్తూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు యాభై మూడు రోజుల పాటు రాజమండ్రి జైల్లో ఉండటానికి కూడా సజ్జల డైరెక్షన్ అని టీడీపీ నేతలు బలంగా నమ్ముతున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ స్కిల్ డెవలెప్ మెంట్ స్కామ్ ను బయటకు తీసుకు వచ్చి నాడు సీఐడీ, ఇతర పోలీసు అధికారులతో మాట్లాడి చంద్రబాబు అరెస్ట్ వెనక సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారని టీడీపీ అగ్రనేతలే భావిస్తున్నారు కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటి వరకూ సజ్జల రామకృష్ణారెడ్డి పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియాలో తెలుగు తమ్ముళ్లే నిరసనను వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ప్రభుత్వ పెద్దలకు కూడా సజ్జల రామకృష్ణారెడ్డి విషయంలో ఏమీ చేయలేకపోతున్నామన్న బాధ కనిపిస్తుంది. అయితే చట్టప్రకారంగా, అన్ని ఆధారాలను సేకరించిన తర్వాతనే ముందుకు వెళితేనే న్యాయస్థానాల్లో కూడా సజ్జలకు వెసులుబాటు లభించదన్న అంచనాలతో అధికారులు చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి కూటమి పార్టీలకు కొరకరాని కొయ్యగా మారిన తరుణంలో ఆయన అరెస్ట్ ఎప్పుడు అన్నది ప్రతి రోజూ సోషల్ మీడియాలో టాపిక్ గానే మారింది. కొసరు నేతలకు కోరి పదవులు ఇస్తారా ఏంది? బలమైన చట్టం ఉన్న... అదే సమయంలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై నమోదవుతాయన్న కేసుల విషయంలో ముందస్తు బెయిల్ ను న్యాయస్థానం నుంచి తెచ్చుకుని కొంత ఊరట చెందుతున్నారు. అయితే తాజాగా సజ్జల రామకృష్ణారెడ్డి చుట్టూ ఉచ్చు బిగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అటవీ భూముల ఆక్రమణలో సజ్జల కుటుంబం ప్రమేయం ఉందని అధికారులు దాదాపు నిర్ధారణకు వచ్చారు. అటవీ శాఖ చట్టాలు చాలా బలంగా ఉంటాయి. అందుకే సజ్జల రామకృష్ణారెడ్డిని ఈ కేసులో అరెస్ట్ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగు రిజర్వు ఫారెస్ట్ లో అడవిని నరికి అడ్డంగా సజ్జల ఫ్యామిలీ దున్నేసిందన్న ఆరోపణలున్నాయి. అరవై ఎకరాల ఫారెస్ట్ భూమి ఆక్రమించారంటూ అటవీ, రెవెన్యూ శాఖల నివేదిక కూడా ఇవ్వడంతో ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డిని ఎప్పుడైనా అరెస్ట్ చేసే అవకాశముందన్న వార్తలు వస్తున్నాయి. యాభై ఎకరాలు ఆక్రమణకు గురైందని అటవీశాఖ చెప్పడంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు లోతుగా సర్వే చేసి పూర్తి స్థాయిలో కేసులు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

# కౌన్సిలర్ నుంచి పెద్దల సభ వరకు...

ఏలూరు, ఏప్రిల్ 29,

ఆంధ్రప్రదేశ్ లో ఖాళీగా ఉన్న ఒక్క రాజ్యసభ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పాకా వెంకట సత్యనారాయణ పేరు ఖరారు చేశారు. ప్రస్తుతం ఆయన ఏపీ బీజేపీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ గా ఉన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన పేరు కూడా తెరపైకి వచ్చింది. అయితే అనూహ్యంగా ఆ స్థానం సోము వీర్రాజు దక్కించుకున్నారు. ఇప్పుడు అదే ప్రాంతానికి చెందిన నేతకు రాజ్యసభ సీటు కేటాయించారు.వైసీపీ రాజ్యసభ సభ్యుడిగా ఉన్న విజయసాయిరెడ్డి రాజీనామా చేయడంతో ఈ ఉపఎన్నిక వచ్చింది. మరో నాలుగేళ్ల వరకూ పదవి కాలం ఉన్న స్థానం కావడంతో ఎవరికి లభిస్తుందో అన్న చర్చ ప్రారంభమయింది. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డికి అవకాశం కల్పిస్తారని అనుకున్నారు. అయితే రాను రాను ఆయన పేరు వెనుకబడిపోయింది. తమిళనాడు రాజకీయ పరిణామాల రీత్యా.. అన్నామలైను ఏపీ నుంచి రాజ్యసభకు పంపి.. కేంద్ర మంత్రిని చేస్తారని అనుకున్నారు . అలాగే స్మృతి ఇరానీ పేరు కూడా పరిశీలనకు వచ్చింది. కానీ .. చివరికి స్థానిక నేత అయిన పాకా వెంకట సత్యనారాయణకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. వర్గాలకు పార్టీ అవకాశం కల్పించిందని ఆ పార్టీ నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పదవులన్నీ ఒకే ప్రాంతానికి కేటాయిస్తూ ఉండటంతో బీజేపీలోని ఇతర ప్రాంత నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. విజయసాయిరెడ్డి రాజీనామాతో ఏర్పడిన ఖాళీపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు ఆశలు పెట్టుకున్నారు. అయితే బీజేపీ కోటా నుంచి భర్తీ అని తేలటంతో వారు ఆశలు వదులుకున్నారు. ఈ స్థానం నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేరును ఇటీవల అమిత్ షా కు సీఎం చంద్రబాబు సిఫార్సు చేసినట్లుగా తెలిసింది. ఇక, రేసులో అన్నామలై, స్మృతి ఇరానీ పేర్లూ వినిపించాయి. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు పోటీ చేస్తారని ప్రచారం జరిగినా.. అనూహ్యంగా పాక వెంకట సత్యనారాయణ పేరు కూటమి అభ్యర్థిగా ఖరారైంది.కేంద్రమంత్రి కూడా గోదావరి జిల్లాలకు చెందిన వారే. కూటమిలో భాగంగా వచ్చిన ఎమ్మెల్సీ, రాజ్యసభ కూడా అదే ప్రాంతానికి ఇచ్చారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు కూడా సాంకేతికంగా అదే ప్రాంతానికి చెందినట్లు .రాయలసీమ నేతల్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి ఆ ప్రాంతానికి ఇచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురందేశ్వరి ఉన్నారు. ఆమె స్థానంలో ఇతరుల్ని నియమిస్తారన్న ప్రచారం జరుగుతోంది.

# పవన్ ట్యూన్ అయిపోయారే..

విజయవాడ, ఏప్రిల్ 29, (

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం కానీ అసలు విషయం బోధపడలేదు. అంతకు ముందు పాలనతో పాటు సంక్షేమ పథకాలపైనే మాత్రం కాకుండా శాంతి భద్రతలు వంటి అంశాలపై కూడా ఊగిపోతూ ప్రసంగాలు చేసిన జనసేనానికి అధికారంలో ఉంటే తప్ప అర్థం కావడం లేదు. పరిమితులు, చట్టప్రకారం తీసుకోవాల్సిన చర్యలతో పాటు తాను సులువుగా చేయాలని భావించిన సమస్యలను పరిష్కరించడం అంత తేలిక కాదని గుర్తించారు. అందుకే ఆయన ఈ మధ్య కాలంలో అంటే దాదాపు పదినెలల నుంచి మౌనంగానే ఎక్కువగా ఉంటున్నారు. ఈ పరిస్థితి పవన్ కల్యాణ్ పై పెట్టుకున్న ఆశలు, ఎన్నికలకు ముందు ఉన్న ఇమేజ్ చాలా వరకూ తగ్గినట్లయింది సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే ఖజానాలో డబ్బులు కావు. డబ్బులు ఊరికే రావని అర్థమయింది. అలాగే అప్పులు కూడా అంత తేలిగ్గా పుట్టవని కూడా తెలిసింది. అధికారంలోకి వస్తే అది చేస్తాం, ఇది చేస్తామని చెప్పినా తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం అంత సులువు కాదని అర్థం కావడం వల్లనే పవన్ కల్యాణ్ ఎక్కువగా మౌనాన్ని ఆశ్రయించారంటున్నారు. పవన్ కల్యాణ్ జనసేన పార్టీని పెట్టి పదేళ్లు దాటి పోయినా ఆయనకు మొన్నటి వరకూ ఒక క్లీన్ ఇమేజ్ ఉండేది. పవన్ కల్యాణ్ అధికారంలోకి వస్తే ఏదో చేస్తారన్న నమ్మకం ఇటు కాపు సామాజికవర్గంలోనూ, అటు పార్టీ క్యాడర్ లోనూ బలంగా ఉండేది. ఇచ్చిన మాట ఖచ్చితంగా అమలు చేస్తారని, పవన్ మాట తప్పరని భావించేవారు కానీ ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ బాధ్యతలను చేపట్టిన తర్వాత కూడా ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతున్నారన్న బాధ ఎక్కువగా ఉంది. అదే సమయంలో టీడీపీ నుంచి పదవులను రాబట్టుకోవడంలోనూ కొంత వెనకబడి ఉన్నారని జనసేన నేతలు అంటున్నారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీదే పై చేయి అయినప్పటికీ పట్టుబట్టి సాధించుకునే తత్వాన్ని పవన్ కల్యాణ్ కోల్పోయినట్లు కనిపిస్తుందని సొంత పార్టీ నేతలే అంటున్నారు. అందుకే పది నెలలు దాటుతున్నా ఇప్పటి వరకూ ముఖ్య నేతలకు నామినేటెడ్ పదవులు కానీ, మరో కీలకమైన పదవులు కానీ లభించడం లేదని వాపోతున్నారు. ఇలాగే కొనసాగితే తాము నమ్ముకుని పార్టీలో ఉన్నందుకు పవన్ కల్యాణ్ ఇలా రాజీపడి తమను ఇబ్బంది పెడితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడైనా జరగొచ్చుట అధికారంలోకి వచ్చిన తర్వాతే... అయితే పవన్ కల్యాణ్ కు అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మొత్తం అర్థమయిందని, ఆయన అంతా తెలుసుకున్న తర్వాత మాత్రమే అనుభం కలిగిన నేత చంద్రబాబు డైరెక్షన్ లోనే వెళ్లడం మంచిదని ఆయన భావిస్తున్నారని జనసేన ముఖ్యనేతలు కొందరు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించగలిగేది చంద్రబాబు మాత్రమేనని గట్టిగా నమ్మిన పవన్ కల్యాణ్ అందుకు అనుగుణంగా ట్యూన్ అయిపోయారని, మనం ఇబ్బంది పెట్టినా ప్రయోజనం లేదని గ్రహించిన తర్వాతనే మౌనంగా ఉంటున్నారని చెబుతున్నారు. అయితే బయట ఉన్న వారికి మాత్రం పవన్ కల్యాణ్ పూర్తిగా ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయారని అంటున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ కు అధికారంలోకి వచ్చిన తర్వాత కానీ అసలు విషయం అర్థం కాలేదన్నది మాత్రం వాస్తవం.

# గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ గంగాధరరావు

విజయవాడరక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్డీవో) ఆధ్వర్యంలో నాగాయలంక మండలం గుల్లలమోద గ్రామంలో అత్యాధునికంగా నిర్మించిన క్షిపణి పరిశోధన కేంద్రాన్ని మే 2 తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ గా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ చేపట్టవలసిన బందోబస్తు కార్యక్రమాలు ఇతర ఏర్పాట్లను గూర్చి జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు జిల్లా కలెక్టర్ డీ.కే. బాలాజీ తో కలిసి సమీక్షించారు.వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నప్పటికీ ప్రముఖ వ్యక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే నేపథ్యంలో ఇక్కడే భద్రత ఏర్పాట్లు గూర్చి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు.

# ఉగ్రవాదులకు 10 మంది కశ్మీర్ లు సాయం

శ్రీనగర్, ఏప్రిల్ 29,

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఉగ్రదాడికి తెగబడ్డ ఉగ్రవాదులు.. పర్యాటకులను వారి మతం అడిగి మరీ కాల్చిచంపారు. అయితే.. ఈ ఘటనపై విచారణకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ)ను ఆదేశించింది. అయితే తాజాగా ఉగ్రవాద దాడిపై జరిపిన దర్యాప్తులో దాడి జరిగిన సమయంలో 10 మందికి పైగా కశ్మీరీ ఓవర్ గ్రౌండ్ వర్కర్‌లు దాడి చేసిన వారితో ప్రత్యక్ష సంబంధంలో ఉన్నారని తేలింది.

ఈ వాఉచిలు చాట్ చేయడానికి, ఉగ్రవాదులలో సమన్వయం చేయడానికి ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ అప్లికేషన్‌లను ఉపయోగించి, ఉగ్రవాదులతో రియల్ టైమ్ కమ్యూనికేషన్‌ను కొనసాగించినట్లు సమాచారం. ఏప్రిల్ 23 నుండి పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన ప్రదేశంలో ఉన్న జాతీయ దర్యాప్తు సంస్థ బృందాలు ఆధారాల కోసం అన్వేషణను ముమ్మరం చేశాయి. ఉగ్రవాద నిరోధక సంస్థకు చెందిన ఎఉ, ఆఎఉ, ఽాఖ నేతృత్వంలోని బృందాలు ఏప్రిల్ 22న జరిగిన దాడిని గమనించిన ప్రత్యక్ష సాక్షులను ఇప్పటికే ప్రశ్నించాయిఉగ్రవాదుల కార్యనిర్వహణ విధానాల ఆధారాల కోసం దర్యాప్తు చేస్తున్న ఔఎం బృందాలు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను నిశితంగా పరిశీలిస్తున్నాయి. దేశాన్నిగ్భ్రాంతికి గురిచేసిన ఈ భయంకరమైన దాడి వెనుక ఉన్న ఉగ్రవాద కుట్రను వెలికితీసేందుకు ఆధారాల కోసం ఫోరెన్సిక్, ఇతర నిపుణులు మొత్తం ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అలాగే, పహల్గామ్‌లో జరిగిన దాడి తర్వాత ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి భారత సైన్యం అనేక శోధన కార్యకలాపాలను ప్రారంభించి, అప్రమత్తంగా ఉంది.

## మోడీ సభను విజయవంతం చేయాలి

మైలవరం ఇబ్రహీంపట్నం లోని ఎమ్. వి. ఆర్ హాల్ లో మైలవరం నియోజకవర్గం ఎన్. డి. యే కూటమి నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులకి వస్తున్నన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ ను విజయవంతం చేయాలని తీర్మానం చేసారు.

కృష్ణ నది పై నూతనంగా నిర్మించిన గొల్లపూడి వంతెన పై మే 2వ తేదీ వాహనాలకు ప్రత్యేక అనుమతి ఇస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. అమరావతి ప్రాంతానికి సమీపంలో ఉన్న మైలవరం నియోజకవర్గం నుంచి ప్రజలు ప్రధాన మంత్రి మోడీ కి స్వాగతం పలికెందుకు స్వచ్ఛందంగా వేలాదిగా రానున్న ప్రజలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ వెల్లడించారు.



గత ఐదేళ్లలో జగన్ అమరావతి రాజధాని నిర్మాణ పనులు ఆపివేసి రాష్ట్ర అభివృద్ధి అడ్డుకున్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ముఖ్య మంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి కి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారం తో రాష్ట్ర అభివృద్ధి దిశగా పయనిస్తుందని అయన అన్నారు.

## రీల్స్ కోసం వచ్చి నీటి క్వారీలో పడి యువకుడు మృతి

మేడ్చల్

జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కారం అటవీ ప్రాంతంలో గల నీటి క్వారీలో పడి తరుణ్ (17) మృతి చెందాడు. మేడ్చల్ జిల్లా, కౌకూర్ భరత్ నగర్ కాలనీకి చెందిన ఆరుగురు యువకులు రిల్స్ చేయడానికి అని కెమెరా తీసుకొని జవహర్ నగర్ లోని అడవి ప్రాంతంలో గల ఒక క్వారీకి చేరారు. ఫోటోషూట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటి క్వారీలో తరుణ్ పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు.

## జ్ఞానాపురం చర్చిలో 11 ఏళ్ల బాలిక మృతి ఘటన

## బాలిక తల్లి, అమ్మమ్మ ఆత్మహత్య

విశాఖపట్నం

జ్ఞానాపురం చర్చిలో 11 ఏళ్ల బాలిక మృతి ఘటనలో ట్విస్ట్ నెలకొంది. బాలిక తల్లి, అమ్మమ్మ ఇద్దరూ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల విచారణకు భయపడి ఆత్మహత్య చేసుకున్ఆరు. ఏప్రిల్ 25న గాలి సోకిందని జ్ఞానాపురం చర్చికి బాలికను తల్లి, అమ్మమ్మ తీసుకువచ్చారు. బాలిక పిచ్చి పట్టినట్లు కరుస్తుందని నోట్లో గుడ్డ కుక్కి, మూతికి బట్ట చుట్టారు. దాంతో ఊపిరి ఆడక బాలిక మృతి చెందిన విషయం తెలిసిందే. ...

## అంగరంగ వైభవంగా నడివీధి గంగమ్మ జాతర ఉత్సవాలు

## నడివీధి గంగమ్మకు సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్న తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష దంపతులు.

తిరుపతి

తిరుపతి 27వ డివిజన్ పరిధిలోని మల్లయ్య గుంట కట్ట నడివీధి గంగమ్మ తల్లి జాతర మూడవ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి యేటా జరిగే మల్లయ్య గుంటకట్ట నడివీధి గంగమ్మ జాతర ఆనవాయితీగా గ్రామ పెద్దలు నిర్వహించడం



జరుగుతుందని గ్రామ పెద్దలు తెలియజేశారు. తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష దంపతులు వైష్ణవి హాస్పిటల్ అధినేత డాక్టర్ మునిశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, తాతయ్య గుంట గంగమ్మ గుడి ఆవరణం నుండి మేళతాళాలతో సారె అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రతి యేటా గంగ జాతర మూడో వారం ముందు జరిగే నడివీధి గంగమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ తో పాటు డాక్టర్ మునిశేఖర్, భరణి యాదవ్, తులసి యాదవ్, హేమంత్ కుమార్, చింతా రమేష్, మునిశేఖర్ రెడ్డి, భాష, సంధ్య, కృష్ణ, గజేంద్ర, శివ,బాలాజీ, గంగమ్మ భక్తులు పాల్గొన్నారు.

# కారులో వచ్చి మరీ దొంగతనాలు

కాకినాడ, ఏప్రిల్ 29,

వేసవి కాలంలో పిల్లలకు సెలవులు కావడంతో చాలా మంది విహార యాత్రలకు వెళ్తుంటారు. లేదా చుట్టాల ఇళ్లకు వెళ్తుంటారు. సరిగ్గా ఇదే సమయం కోసం ఎదురు చూస్తారు.. పక్కా ప్లానింగ్‌తో రెక్కీ నిర్వహిస్తారు.. తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తారు.. తాళాలు పగుల కొట్టడం, తాళం తీయకుండానే బోల్టులు విప్పడం, అంతా ఇంట్లో నిద్రిస్తున్న సమమంలోనే లోపలకు వెళ్లకుండానే కిటికీల గూండా గుట్టు చప్పుడు కాకుండా తళుపులు తీయడం లో సిద్ధ హస్తులు.. పని ముగించుకున్నాక వారు వేసుకొచ్చిన కారు ఎక్కడ పార్కింగ్ చేశారో అక్కడకు వెళ్లి దోచుకున్న నగలు, నగదుతో జారుకుంటారు.. ఇలా అనేక ఇళ్లకు కన్నం వేసి అంతరాష్ట్ర ముఠా ఒకటి అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీసులకు చిక్కింది.. తెలుగు రాష్ట్రాల్లో 32 చోరీలు చేసిన అంతర్రాష్ట్ర దొంగలు ముఠాను కోనసీమ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు.. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా అమలాపురం పట్టణంలో 2023, 2024, 2025 సంవత్సరాల్లో చోరీలు చేసిన ముగ్గురు దొంగలను అమలాపురం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 40 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశారు. అమలాపురం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బి. కృష్ణారావు విలేకర్ల సమావేశంలో చోరీల చిట్టాను వివరించారు. వీరి నుంచి రూ.40 లక్షల విలువైన 400 గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి వస్తువులు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో తాము దొంగిలించిన సొత్తును నగుదుగా మార్చుతున్న సమయంలో అమలాపురం పట్టణ పోలీసులు ఆదివారం ఉదయం అరెస్ట్ చేశారు. జిల్లా ఏఎస్పీ ఏవీఆర్పీబీ ప్రసాద్, అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి. వీరబాబుతో కలసి ఎస్పీ కృష్ణారావు ఈ చోరీల వివరాలను వెల్లడించారు.పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు. అదే జిల్లా రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా శ్రీరామ నగర్‌కు చెందిన కాట్ల కిషోర్ బాబు ఓ ముఠాగా ఏర్పడ్డారు.. గత అయిదేళ్లుగా వీరు తెలుగు రాష్ట్రాల్లో అనేక చోరీలు చేసినట్లు పోలీసులు తెలిపారు. విలాస వంతమైన జీవితానికి అలవాటుపడ్డ వీరు ముగ్గురు కారులో తిరుగుతూ సమీపంలోని లాడ్జీల్లో దిగి ఆపై కారుపై రాత్రివేళల్లో బయలుదేరి దొంగతనాలు చేస్తుంటారని పోలీసులు తెలిపారు. పగటి పూట వీళ్లు టార్గెట్ చేసుకున్న ప్రాంతంలో రెక్కీ నిర్వహించి ఆపై కారులోనే తిరుగుతారు. లేదా సమీపంలో ఎక్కడైనా పార్కింగ్‌చేసి ఆపై నడుచుకుంటూ తిరిగి రెక్కీ నిర్వహించి టార్గెట్‌ను నిర్ణయించుకుంటారు. ఆపై అక్కడి నుంచి వెళ్లిపోయి తిరిగి కారులోనే తిరిగి వచ్చి సమీపంలోనే ఎక్కడైనా పార్కింగ్‌చేస్తారు. ఆపై తాళాలు గుట్టుచప్పుడు కాకుండా తీసి ఆపై దోచుకుని వారు వచ్చిన కారులోనే వెళ్లిపోతారు. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ, నల్గొండ తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డ వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 17 చోరీలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 15 చోరీలకు పాల్పడ్డారు. మొత్తం 32 చోరీ కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారు. అమలాపురం పట్టణం గాంధీనగర్ 2023 ఏప్రిల్లో మొదటి చోరీ, కురసాలవారివీధిలో 2024 ఆగస్టులో రెండో చోరీ, ఈ సంవత్సరం జనవరిలో మూడో చోరీ చేశారు. ఈ మూడు చోరీలకు సంబంధించి రూ.40 లక్షల సొత్తును రికవరీ చేశారు. నరసరావుపేటలో క్రికెట్ ఆటలో ఈ ముగ్గురికి పరిచయం ఏర్పడింది. కేసును ఛేదించిన పోలీసులకు నగదు రివార్డులు ఈ మూడు చోరీ కేసులను చాకచక్యంగా ఛేదించిన పోలీసు అధికారులు, క్రైమ్ పార్టీ సిబ్బందిని ఎస్పీ కృ ష్ణారావు అభినందించారు. వారికి నగదు రివార్డులు అందజేశారు. పట్టణ సీఐ పి. వీరబాబు, క్రైమ్ సీఐ ఎం గజేంద్రకుమార్, పట్టణ ఎస్ ఎన్‌ఆర్ కిషోర్బాబు, క్రైమ్ ఎస్సై రాంబాబు, ఏఎస్సై అయితాబత్తుల బాల కృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు ఎంఎస్ రాజు, రమణ, కాని సాయి, శుభాకర్, ప్రసాద్, శ్రీనివాస్, అర్జున్, హరి, చిన్న ప్రసాద్ కు ఎప్పీ కృష్ణారావు నగదు రివార్డులు అందజేసి అభినందించారు.

# మరోసారి సేకరణ తప్పదా

విజయవాడ, ఏప్రిల్ 29

నవ్యాంధ్ర రాజధానిని నభూతో న భవిష్యత్ అన్న రేంజ్‌లో నిర్మిస్తామంటోంది కూటమి ప్రభుత్వం. ప్రధాని మోదీతో అమరావతి రీ లాంచ్‌కు ప్లాన్ చేసిన ఏపీ సర్కార్ రూ.77వేల కోట్ల పనులు ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే రాజధానిలో రెండో విడత భూసేకరణకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. భూ సమీకరణ విధానంలో భూములు ఇచ్చేందుకు సిద్ధమైన గ్రామాల్లో సభలు నిర్వహిస్తుంది. మరో పది వేల ఎకరాలను మలి విడతలో సమీకరించుకునేందుకు ఆయా గ్రామాల్లో ప్రాథమిక సమావేశాలను పూర్తి చేసింది. అమరావతి మండలంలోని మూడు గ్రామాల సభల్లో భూములు ఇచ్చేందుకు సిద్ధమే అంటూనే పలు సమస్యలను ప్రభుత్వం ముందుంచారు. అత్యధికులు అభిప్రాయం ప్రకారమే ముందడగు వేస్తామని రాష్ట్ర ప్రభుత్వం అంటుంది.అమరావతి రాజధాని నిర్మాణం కోసం గతంలో ముప్పై నాలుగు వేల ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఆ భూముల్లో అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఊపందుకున్నాయి. ఇదే సమయంలో రాజధానిలో రైల్వే లైన్ ఏర్పాటు, ఇన్నర్ రింగ్ రోడ్డు, పోలవరం, బనకచర్ల ప్రాజెక్టుల కోసం అమరావతి మండలంలోని పలు గ్రామాల్లో భూసేకరణ చేయాల్సి ఉంది.అమరావతి మండలంలోని వైకుంఠపురం, యండ్రాయి, పెద మద్దూరు, కర్లపూడి గ్రామాల్లో రైతులు భూములిచ్చేందుకు ముందుకొచ్చారు. ఈ క్రమంలోనే రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించింది. ఈ నాలుగు గ్రామాల్లో కలిసి పది వేల ఎకరాల భూమి ఉంది. వీటిల్లో వైకుంఠపురం, యండ్రాయి, పెద మద్దూరు గ్రామాల్లో గ్రామ సభలు పూర్తయ్యాయి. అత్యధిక శాతం మంది రైతులు భూములిచ్చేందుకు సిద్ధంగానే ఉన్నట్లు చెప్పారు. ఈ గ్రామ సభల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తో పాటు సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్ రెడ్డి పాల్గొన్నారు. భూసేకరణ విధానంలో భూములిస్తే రైతులు నష్టపోతారని భూ సమీకరణ విధానంలో పొలాలు అప్పగిస్తే మేలు జరుగుతుందన్న అభిప్రాయాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వ్యక్తం చేశారు.రాజధాని అవసరాల కోసం భూములిచ్చేందుకు తాము సిద్దంగానే ఉన్నామని, తమ డిమాండ్స్ కూడా ప్రభుత్వం విని పరిష్కారం చూపాలని రైతులు అధికారులతో చెప్పారు. గ్రామ కంఠం నుండి 500 మీటర్ల వెలుపలనే భూ సమీకరణ చేయాలన్నారు. రోడ్డు వెంట భూముల అధిక విలువైనవని వాటికి రాజధానిలో ఇచ్చిన జరీబు భూముల ప్యాకేజ్ ఇవ్వాలన్నారు. తమకు కోర్ క్యాపిటల్లోనే భూ కేటాయింపులు ఉండేలా చూడాలన్నారు. వైకుంఠపురంలో ఇనాం భూముల సమస్యను ముందుగా పరిష్కరించి ఆ తర్వాతే భూ సమీకరణ చేయాలని కొంతమంది సూచించారు.మొత్తం మీద రైతుల నుండి సానుకూలత వ్యక్తం కావడంతో ప్రభుత్వం ముందడుగు వేయనుంది. ఈ నాలుగు గ్రామాల ద్వారానే దాదాపు పదివేల ఎకరాల భూమి ప్రభుత్వానికి సమకూరనుంది. అయితే రెండో విడతలో భాగంగా ఏకంగా నాలుగు వేల ఎకరాలు సేకరించాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్నట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో రానున్న రోజుల్లో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఆయా గ్రామాల రైతులు ఇప్పటి నుండే చర్చించుకుంటున్నారు.

# సింగిల్ టైమ్ సెటిల్ మెంట్ లే ఔట్లు

కర్నూలు, ఏప్రిల్ 29,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అనుమతులు లేని పాత లేఅవుట్లకు అనుమతులు పునరుద్ధరించాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయం ద్వారా వివిధ పట్టణాభివృద్ధి సంస్థల నుంచి 15 నుంచి 20 ఏళ్ల క్రితం అనుమతులు తీసుకుని, గడువులోగా పనులు పూర్తిచేయని 870 లేఅవుట్లకు అనుమతులు మంజూరు చేయనున్నారు. ఇందులో అమరావతి పరిధిలోనే ఎక్కువ లేఅవుట్లు ఉన్నాయి. సీఆర్డీఏ పరిధిలో 624 లేఅవుట్లు, వీఎంఆర్డీఏ పరిధిలో 182 లేఅవుట్లు ఉన్నాయి.అలాగే కర్నూలు, తిరుపతి, శ్రీకాకుళం, పుట్టపర్తి వంటి చోట్ల మిగతా లేఅవుట్లు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయంతో ఈ లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన సుమారుగా 85 వేల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. ఇంటి నిర్మాణం కోసం గతంలో స్థలాలు కొనుగోలు చేసినప్పటికీ.. లేఅవుట్లకు పర్మిషన్లు లేకపోవటంతో అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అలాంటి వారికి ప్రయోజనం కలగనుంది.లేఅవుట్ల అభివృద్ధి కోసం అనుమతులు తీసుకున్న తర్వాత.. మూడేళ్లలోగా నిర్దేశించిన పనులు పూర్తి చేయాలి. లేఅవుట్లలో రోడ్డు, కాలువల నిర్మాణంతో పాటుగా లైట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. ఈ సదుపాయాలన్నీ కల్పించిన తర్వాతే.. మార్టగేజ్ పెట్టిన ప్లాట్లను పట్టణాభివృద్ధి సంస్థలు విడుదల చేస్తాయి. అయితే ఏపీలో 870 లేఅవుట్లకు పర్మిషన్లు తీసుకున్నా కూడా.. గడువులోగా పనులు పూర్తి చేయలేదు. ఈ 870 లేఅవుట్లలో 85 వేల వరకూ ప్లాట్లు ఉన్నాయి. అయితే పనులు పూర్తి చేయకపోవటంతో మూడేళ్ల తర్వాత ఈ లేఅవుట్ల పర్మిషన్లు రద్దు అయ్యాయి. అయితే మరోసారి ఫీజులు కట్టి పర్మి?షన్లు పునరుద్ధరించుకునే అవకాశం ఉన్నప్పటికీ.. భారీగా ఫీజులు, డెవలప్‌మెంట్ ఛార్జీలు సైతం చెల్లించాల్సి ఉండటంతో వ్యాపారులు ముందుకురాలేదు. దీంతో ఈ లేఅవుట్లలోని 85 వేల ప్లాట్లను కొన్న కుటుంబాలు ఇబ్బందులకు గురయ్యా.యి.అనుమతిలేని ప్లాట్లలో ఇళ్లు కట్టుకోవడానికి అధికారులు అనుమతించలేదు. అలాగే బ్యాంకుల్లో రుణం తీసుకోవటానికి ఎల్‌పీ నంబర్ లేకపోవటంతో.. బ్యాంకు అధికారులు ఒప్పుకోలేదు. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద అనుమతులు పునరుద్ధరించుకునే అవకాశం కల్పించింది. అలాగే డెవలప్‌మెంట్ ఛార్జీలను సైతం మినహాయించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రభుత్వ అధికారులు సూచిస్తున్నారు.

## పేహల్గాం మృతులకు నివాళులర్పించిన మణుగూరు ఏరియా అఖిలపక్ష కార్మిక సంఘాలు

## చరిత్రలో చీకటి రోజు ఆవేదన వ్యక్తం చేసిన నాయకులు

మణుగూరు

పేహల్గాం ఉగ్ర దాడి పాశావీక, అనాగరికమైన చర్య అని చరిత్రలో చీకటి రోజు అని ఇలాంటి దుశ్చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని మణుగూరు సింగరేణి ఏరియా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఏరియా ఓసీ-2లో జరిగిన పెహల్గాం మృతుల సంతాప సభ నిర్వహించారు.మృతుల సంతాప



సూచకంగా నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. పేహల్గాం అమరులకు జోహార్లు అంటూ సామూహికంగా నినదించారు అనంతరం జరిగిన సంతాప సభలో నాయకులు మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ లోని పేహల్గాంలో టెర్రరిస్టులు అత్యంత క్రూరంగా దాడి చేసి ఇరవయి ఆరుగురు భారత పౌరులను చంపేయడం అత్యంత కిరాతకమైన చర్య అని ఇలాంటి దుశ్చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని వారు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాధారణ పర్యాటకులే లక్ష్యంగా ఆర్మీ యూనిఫాంలో వచ్చి దొరికిన వాళ్లను దొరికినట్లు పిట్టలను కాల్చినట్టు కాల్చి రక్తశక్తం చేసి మరణహోమం చేసిన మత ఉన్మాదుల చర్యలను పిరికిపంద చర్యగా వారు అభివర్ణించారు. భూలోక స్వర్గం కాశ్మీరును నరకప్రాయంగా మార్చిన సంఘటన పట్ల వారు తీవ్రగ్భ్రాంతి ప్రకటించారు. ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారిలో తెలుగు రాష్ట్ర యువకులు కూడా ఉన్నారనీ మృతులకు సంతాపం తెలియజేయడంతో పాటు వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. టెర్రరిస్టుల దాడిని కులమతాలకు అతీతంగా యావత్ భారత్ ముక్తకంఠంతో ఖండిస్తోందన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రతిష్టమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు ఐ ఎఫ్ టియు నాయకులు యస్ డి నా సర్ పాషా అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు వై రాంగోపాల్, శనిగరపు కుమారస్వామి, ఏరియా ప్రాతినిధ్య సంఘం ఐ ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజు, మల్లికార్జున్, సిఐటియు నాయకులు మంద నరసింహారావు, వల్లూరి వెంకటరత్నం, సత్ర పల్లి సాంబశివరావు, కోడిసాల రాములు వివిధ కార్మిక సంఘాల నాయకులు లక్ష్మణరావు, ఇందూరి శంకర్, జానీ, వి సుదర్శన్ రావు, రామారావు, అంజయ్య ఎం శ్రీనివాస్, ప్రవీణ్, మాజీ సైనికులు పెరుమాళ్, రాధాకృష్ణ అధికారులు సూపర్వైజర్లు సింగరేణి కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నార్త్ రాజుపాలెం లో జాతీయ రహదారిపై ప్రమాదం, ఇద్దరు యువకులు మృతి

నెల్లూరు

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం జాతీయరహదరిపై ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలోఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. స్థానిక ఐస్ ఫ్యాక్టరీ నుండి హైవే పైకి వస్తున్న లారీని వెనక వైపు ప్రమాదవశాత్తు నెల్లూరు నుండి బిట్రగుంటకు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బోగులు మండలం రామస్వామి పాలెం కు చెందిన ప్రవీణ్, ఇబ్రహీంపట్నం కు చెందిన మన్సూర్ ఇద్దరు స్నేహితులు మృతి చెందారు. సమాచారం అందుకున్న కోవూరు సీఐ సుధాకర్ రెడ్డి ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు . మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మరీ ఇంత అధ్వాన్నంగానా...

## వందేళ్ల పండుగ

విశాఖపట్టణం, ఏప్రిల్ 29,

దేశంలో అత్యంత పురాతన విశ్వవిద్యాలయం.. ఆంధ్ర విశ్వకళా పరిషత్ వందేళ్ల పండుగ జరుపుకుంటోంది. ఎంతోమంది మహనీయులు ఈ విశ్వవిద్యాలయంలో చదివారు. ఎంతోమంది మహానుభావులు వైస్ ఛాన్స్ లర్లుగా వ్యవహరించారు. జాతీయస్థాయిలో కీలక స్థానాలకు చేరుకున్నారు. రాజ్యాంగబద్ధమైన పదవులు సైతం పొందారు. అటువంటి గొప్పతనం ఆంధ్ర యూనివర్సిటీది. 1926 ఏప్రిల్ 26న ఏర్పాటయింది ఆంధ్ర విశ్వ కళాపరిషత్. వందేళ్ల చరిత్రను పూర్తి చేసుకుంది. శతవసంత వేడుకలు జరుపుకుంటుంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 26 వరకు వేడుకలు కొనసాగించాలని నిర్ణయించింది. అయితే ప్రారంభోత్సవ వేడుకలు కళ తప్పాయి.ఆంధ్ర యూనివర్సిటీకి తొలి ఉపాధ్యక్షుడిగా కట్టమంచి రామలింగారెడ్డి పనిచేశారు. రెండో విసిగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వ్యవహరించారు. ఈ ఇద్దరు ఏయూ పురోభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డారు. అటు తరువాత వచ్చిన వీసీలు సైతం తమదైన ముద్ర చాటుకున్నారు. ఏయూలో ఎంతోమంది చదువుకొని ఉన్నత రంగాల్లో స్థిరపడ్డారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, మాజీ స్పీకర్ జీవీఎంసీ బాలయోగి, కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రంనాయుడు తో పాటు చాలామంది ఇక్కడ చదివి ఉన్నత స్థానాలకు వెళ్లారు. అటువంటి ఏయూ వందేళ్ల పండుగ జరుపుకుంటుంది అంటే ఎలా ఉండాలి. కానీ కనీసం ఆ సందడి లేకుండా పోయింది. ఎవరు రాకుండానే ఏయూ శతాబ్ది ఉత్సవాలు పేలవంగా ప్రారంభం అయ్యాయి. విశాఖ బీచ్ రోడ్లో వాక్ థాన్ నిర్వహించారు. కానీ ఉత్సాహం అయితే పెద్దగా కనిపించలేదు.ఏయూ శతాబ్ది ప్రారంభ ఉత్సవాలకు సీఎం చంద్రబాబు వచ్చి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. కనీసం విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ హాజరైన పర్వాలేదనిపించేది. కనీసం ఇక్కడ చదువుకున్న ప్రముఖులు వచ్చినా కొంత కళ వచ్చేది. కానీ ఎవరు హాజరు కాకపోవడంతో తూతూ మంత్రంగా ప్రారంభించారు. ఏయూకి జాతీయస్థాయిలో మంచి గుర్తింపు ఉంది. ఇప్పటికీ ఆంధ్ర యూనివర్సిటీ కి విదేశీ విద్యార్థులు వస్తూనే ఉన్నారు. నాక్ గ్రేడింగ్ లో నంబర్ వన్ స్థానంలో కొనసాగుతోంది. కనీసం యూనివర్సిటీ ఖ్యాతిని చాటి చెప్పేందుకే నైనా వేడుకగా ఈ ప్రారంభోత్సవాన్ని జరిపించాల్సి ఉంది. కానీ ఏదో తూతూ మంత్రంగా మామ అనిపించేశారు.ఎ

# ఉక్రెయిన్ తో యుద్ధానికి బ్రేక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29

రష్యా ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఉక్రెయిన్‌పై మూడు రోజుల పాటు యుద్ధం ఆపివేస్తున్నట్టు ప్రకటించాడు. మే8 నుంచి మే11 వరకూ సీజ్ ఫైర్ ప్రకటించాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్ నాజీ జర్మనీపై సాధించిన విజయానికి 80వ వార్షికోత్సవం సందర్భంగా పుతిన్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నాడు.దాదాపు మూడేళ్ల నుంచి ఉక్రెయిన్ రష్యా మధ్య ఈ యుద్ధం కొనసాగుతోంది. ఈ యుద్ధంలో ఇప్పటికే వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు చాలా దేశాల అధ్యక్షులు ప్రయత్నిస్తున్నప్పటికీ యుద్ధం మాత్రం ఆగడంలేదు. ఇలాంటి యుద్ధంలో పుతిన్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు సంచలనంగా మారింది.

# సైన్యం పేరుతో సైబర్ నేరగాళ్ల టోపి

హైదరాబాద్,ఏప్రిల్ 29,

సైబర్ మోసగాళ్లకు అన్నీ అవకాశాలే. ఏ సందర్భం వచ్చినా బ్యాంక్ ఖాతాలు ఇచ్చి డబ్బులు జమ చేయమని ఫోర్స్ చేస్తూ ఉంటారు. ఇప్పుడు భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులను అలాగే క్యాష్ చేసుకోవాలని అనుకుంటున్నారు. ఇందు కోసం వాట్సాప్ ను వినియోగించుకుంటున్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత భారతదేశం , పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని వాట్సాప్‌లో ఒక సందేశం వైరల్ అవుతోంది. కేంద్ర ప్రభుత్వం భారత సైన్యం కోసం బ్యాంకు ఖాతాను తెరిచిందని, సైన్యానికి సహాయం చేయడానికి ప్రజల నుండి ఆర్థిక సహాయం కోరిందని ఆ వాట్సాప్ సందేశం సారాంశం. ఫేస్‌బుక్, వాట్సాప్ ,మఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ అవుతున్న సందేశంలో కనీసం ఒక్క రూపాయి అయినా జమ చేసి దేశభక్తిని చాటుకోవాలని సూచిస్తోంది. ఈ డబ్బుతో ఆయుధాలు కూడా కొనుగోలు చేస్తామని అందులో పేర్కొన్నారు. ఈ అంశం కేంద్రం దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించింది. అది సైబర్ నేరగాళ్ల కుట్ర అని.. మొత్తం ఫేక్ అని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ప్రకటించింది. ఖఎః తన అధికారిక వెబ్‌సైట్ ద్వారా వైరల్ పోస్టుల గురించి ఖండించింది. వాట్సాప్‌లో తప్పుదారి పట్టించే సందేశం వైరల్ అవుతోందని, అందులో భారత సైన్యాన్ని ఆధునీకరించడం, యుద్ధంలో గాయపడిన లేదా అమరవీరులైన సైనికుల కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతాలో ఆర్థిక విరాళాలు ఇవ్వడం గురించి చర్చ జరుగుతోందని పిఐబి తెలిపింది. అలాంటి పోస్టులను నమ్మవద్దని తెలిపింది. నటుడు అక్షయ్ కుమార్ పేరు కూడా ఈ వాట్సాప్ మెసెజ్‌లో ఉపయోగించారు. ఈ ప్రతిపాదనకు అక్షయ్ కుమార్ ప్రధాన ప్రమోటర్‌గా ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారని.. అది కూడా పచ్చి అబద్ధమని స్పష్టం చేసింది. తెలంగాణ పోలీసులు కూడా ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రకటన చేశారు.

# విద్యార్థి వేదాన్షిత్ రెడ్డి ప్రపంచ రికార్డు....

కొడిమ్యాల,

కరీంనగర్ చాక్లెట్ కిడ్స్ స్కూల్ లో మూడో తరగతి చదువుతున్న కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామానికి చెందిన మందల మందల కార్తీక్ రెడ్డి కుమారుడు వేదాన్షిత్ రెడ్డి తన అద్భుత మేధాశక్తితో ప్రపంచ రికార్డు సాధించాడు . మల్టీ టాలెంటెడ్ చైల్డ్ ప్రాడిజి గా గుర్తింపు పొందడమే కాకుండా నేషనల్ సూపర్ మెమరీ చాంప్ అవార్డు సైతం కైవసం చేసుకున్నారు. కంప్యూటర్ కోడింగ్ అయిన బైనరీ డిజిట్స్ 10011... సిరీస్ ను 100 సంఖ్య గల నంబర్లను ఒకసారి చూసి పూర్తిగా జ్ఞాపకం ఉంచుకొని ప్రదర్శించారు. దీంతోపాటు శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి వికటకవి తెనాలి రామకృష్ణుడు సృష్టించినటువంటి తోక మేక మేక తోక... అనే టంగ్ ట్విస్టర్ పదజాలాన్ని 100 సార్లు చెప్పినప్పుడు వాటిని రాయడానికి 15 నిమిషాలు పడితే తను కేవలం 100 సెకన్లలోనే గుర్తుంచుకొని ప్రపంచ రికార్డు సాధించారు. ఎంతో అద్భుత మేధస్సు ఉన్నటువంటి ఈ చిన్నారి బాలుడు భారత రాజ్యాంగనీ జీకే, స్టేట్స్ క్యాపిటల్స్ తో పాటు భగవద్గీత మరియు ఇతర శ్లోకాలు సైతం చెప్పి అందరిని అబ్బురపరిచారు. తన టాలెంట్ను గుర్తించినటువంటి చేంజ్ మెమరీ అకాడమీ డైరెక్టర్ ప్రముఖ మెమరీ ట్రైనర్ డాక్టర్ వేణు కుమార్ ఈ బాలుడికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్లో ఫోల్డర్స్ క్రియేట్ చేసినట్టుగా మన మైండ్ లో కూడా హోల్డర్స్ క్రియేట్ చేయవచ్చని, ఈ పద్ధతిని మెమరీ ఫైలింగ్ అంటారని తెలిపారు. ఈ బాలునికి మెమరీ టెక్నిక్స్ నేర్పించి రికార్డు సాధించడం ఎంతో గర్వంగా ఉందని ఆయన తెలిపారు. కరీంనగర్ జిల్లా నుండి వేదాన్షిత్ చిన్న ప్రాయంలోనే చేసినటువంటి ఈ రికార్డు ఎంతోమంది చిన్నారులకు ఆదర్శంగా ఉంటుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. చిన్నారుల ప్రతిభను వెలికి తీయడంలో తామెప్పుడు ముందు ఉంటామని తెలిపారు. తల్లిదండ్రులు పావని నాగలక్ష్మి, కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ వేదన్షిత్ ఇవాళ రికార్డు సాధించి తమకెంతో సంతోషాన్ని కలిగించాడని వారు హర్షం వ్యక్తం చేశారు. తమ బాలుని అద్భుత మైన టాలెంట్ కు తగిన గుర్తింపుని ఇచ్చిన శిక్షకులకు మరియు చేంజ్ మెమరీ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. అలయన్స్ క్లబ్ గవర్నర్ పోలు సత్యనారాయణ, సౌత్ మల్టిపుల్ వైస్ చైర్మన్ మోర అంజయ్య, చాక్లెట్స్ ప్రిన్సిపల్ శ్రీవిద్య, ట్రైనర్స్ తిరుపతి, అశోక్ సామ్రాట్, సదానందం బంధుమిత్రులు,సభ్యులు పాల్గొన్నారు.

# ఇంకా అదే విశ్వాసమా...

తిరుపతి, ఏప్రిల్ 28,

వై నాట్ కుప్పం.. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో వినిపించిన మాట ఇది. కుప్పంలో చంద్రబాబును సైతం 2024లో ఓడిస్తామని గంటాపథంగా చెప్పారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. దానికి కారణం లేకపోలేదు. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తెలుగుదేశం పార్టీని ఒక వ్యూహాత్మకంగా దెబ్బతీసింది. అప్పటినుంచి కుప్పం తో పాటు వై నాట్ 175 అన్న నినాదాన్ని కూడా బలంగా తీసుకెళ్లింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే స్థానిక సంస్థల గెలుపు కాదు.. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ఆలోచన సరళి మారుతుందని అంచనా వేయలేకపోయింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. విశ్వాసం, అతి విశ్వాసానికి మించి.. మరింత అతి చేసింది. దానికి మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు అదే కుప్పం టిడిపికి దాసోహం అవుతోంది. కుప్పంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం నీటి బుడగగా తేలిపోయిందిమున్సిపల్ చైర్మన్ ఉప ఎన్నికల్లో టిడిపి గెలిచింది కుప్పంలో గత ఏడాది కుప్పం మున్సిపల్ చైర్మన్ గా ఉన్న సుధీర్ రాజీనామా చేశారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. 2021 లో జరిగిన కుప్పం మున్సిపల్ తొలి ఎన్నికల్లో వైసిపి విజయం సాధించింది. 2019లో మేజర్ పంచాయితీగా ఉన్న కుప్పంను మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. మొత్తం 25 వార్డులకు గాను 19 చోట్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దీంతో వై నాట్ 175 అన్న నినాదం తెరపైకి వచ్చింది.కుప్పం నియోజకవర్గం నుంచి వరుసగా గెలుస్తూ వస్తున్నారు చంద్రబాబుఎప్పుడు భారీ మెజారిటీ నమోదు అవుతూ వస్తోంది. అటువంటిది 2019 ఎన్నికల్లో జగన్ ప్రభంజనంతో అమాంతం మెజారిటీ పడిపోయింది. పైగా చంద్రబాబును నిర్వీర్యం చేయడం ద్వారా రాజకీయంగా దెబ్బతీయవచ్చని జగన్మోహన్ రెడ్డి భావించారు. ఆ బాధ్యతను సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అప్పగించారు. దీంతో తన పుంగనూరు నియోజకవర్గాన్ని వదిలి ఎక్కువగా కుప్పంపై దృష్టి పెట్టారు పెద్దిరెడ్డి. అన్ని రకాల ప్రయోగాలు చేశారు. దీంతో నియోజకవర్గంలోని అన్ని పంచాయితీల్లో వైసిపి పాగా వేసింది. అంతటితో ఆగకుండా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని ప్రాదేశిక ఎన్నికల్లో కూడా వైసిపి సత్తా చాటింది. తొలిసారిగా మున్సిపాలిటీగా అవతరించిన కుప్పంను కైవసం చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.అయితే 2024 సాధారణ ఎన్నికలకువచ్చేసరికి ప్రజల మూడ్ మారింది. అప్పటివరకు ఉన్న పరిస్థితుల్లో పూర్తిగా మార్పు కనిపించింది. అప్పటివరకు తమ చేతుల్లో ఎన్నికలు నిర్వహిస్తూ ప్రలోభాల పర్వం నడిచింది. కానీ సాధారణ ఎన్నికల్లో తిరిగి చంద్రబాబు నాయకత్వాన్ని కుప్పం నియోజకవర్గ ప్రజలు కోరుకున్నారు. అయితే వై నాట్ కుప్పం అని సౌండ్ చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సార్వత్రిక ఎన్నికల్లో దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ చేసేలా తీర్పు ఇచ్చారు కుప్పం ప్రజలు. అటు స్థానిక సంస్థల ప్రతినిధులు సైతం స్వచ్ఛందంగా టిడిపికి సరెండర్ అయ్యారు. దీంతో క్రమేపి స్థానిక సంస్థలు కూడా టిడిపి ఆధీనంలోకి వచ్చాయి.

# రాయలసీమ ఎక్స్ప్రెస్లో భారీ దోపిడీ

అనంతపురం

నిజామాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న రాయలసీమ ఎక్స్ప్రెస్లో భారీ దోపిడీ జరిగింది. అనంతపురం జిల్లాలోని గుత్తి వద్ద మంగళవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అమరావతి ఎక్స్ప్రెస్కు లైన్ క్లియర్ చేసేందుకు గుత్తి శివారులో రాయలసీమ ఎక్స్ప్రెస్ను నిలిపారు. అప్పటికే అక్కడ మాటువేసిన ఐదుగురు దుండగులు రైలులోకి చొరబడ్డారు. మొత్తం పది బోగీల్లో దోపిడీకి పాల్పడ్డారు. ప్రయాణికుల బంగారం, నగదుతోపాటు విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితులు తిరుపతి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# మేడే రోజున కానుకగా కాంట్రాక్ట్ కార్మికుల జీతం పెంపుపై ముఖ్యమంత్రి ప్రకటన చేయాలి

మణుగూరు

మణుగూరు,సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30 న కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ నందు కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలని దీక్ష,మరియు మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం కే సి ఎస్ పి వద్ద కాంట్రాక్టు కార్మికులతో మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్ లో జేఏసీ నాయకులు గద్దల శ్రీనివాస్, ఆర్. మధుసూదన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మేడే ఒకటి కార్మికుల దినోత్సవం సందర్భంగా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి



కార్మికుల జీతాలపై పెంపు ప్రకటన చేయాలని డిమాండ్. ఈనెల 30 న కాంట్రాక్టు కార్మికులు ఒకరోజు నిరసన దీక్ష, మహా ధర్నా కార్యక్రమం ద్వారా ఈ రాష్ట్ర ప్రభుత్వం పై సింగరేణి యాజమాన్యం పై ఒత్తిడి పెంచుతామని అన్నారు. ఈసందర్భంగా

వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటుంది అని కోల్ ఇండియా ఒప్పందాలు సైతం అమలు చేయకుండా కాంట్రాక్ట్ కార్మికులను వెట్టిచాకిరికీ గురిచేస్తున్నారని, గతసమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం లేబర్ కమిషనర్ సమక్షంలో చేసుకున్న అగ్రిమెంటు సైతం అమలు చేయడం లేదు అని అన్నారు. ఈ స్థితిలో సింగరేణి వ్యాప్తంగా మళ్లీ పోరాటం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది అని, మేడే రోజున వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

# తెలుగు రాష్ట్రాల్లో వింత వాతావరణం

హైదరాబాద్, ఏప్రిల్ 29

తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి.. ఓ వైపు ఎండలు దారెత్తిస్తుండగా.. మరోవు వర్షాలు కురుస్తున్నాయి.. ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. వచ్చే నాలుగు రోజులు కూడా భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని.. అక్కడకక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. మంగళవారం, బుధవారం తెలంగాణలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలున్నాయి.. రాగల రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే స్వల్పంగా తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ రోజు తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ రోజు గరిష్టంగా ఆదిలాబాద్ లో 42.3, కనిష్టంగా హైదరాబాద్ లో 37.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. సోమవారం మెదక్, నల్లగొండ, ఆదిలాబాద్, నిజామాబాద్, భద్రాచలం, ఖమ్మం, లలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.తెలంగాణ లోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడ గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో నాలుగు రోజులపాటు భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయి.. కొన్నిచోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉంది.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేసింది.

ఏపీలో వర్షాలు..

మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది.బుధవారం శ్రీకాకుళంలో రెండు మూడు చోట్ల భారీ వర్షాలు, విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, ఎన్టీఆర్, పల్నాడు, శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది.అలాగే నేడు విజయనగరం జిల్లా బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, గుర్ల, కొత్తవలస మండలాలు, పార్వతీపురంమన్యం జిల్లా బలిజిపేట, గరుగుబిల్లి,సీతానగరం మండలాల్లో వడగాలులు(08) ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఉష్ణోగ్రతలు 40-42శీఅ మధ్య రికార్డు అయ్యే అవకాశం.

సోమవారం వైఎస్సార్ జిల్లా సిద్ధవటంలో 41.1శీఅ, ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో 41శీఅ, నంద్యాల జిల్లా రుద్రవరంలో 40.6శీఅ, తిరుపతి జిల్లా సూళ్లూరుపేట 40.5శీఅ, విజయనగరం కొత్తవలస, పల్నాడు జిల్లా నరసారావుపేటలో 40.3శీఅ చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# ఆపరేషన్ కగార్ పై పెరుగుతున్న వ్యతిరేకత

హైదరాబాద్, ఏప్రిల్ 29,

2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజం అనేది లేకుండా చేయాలని కేంద్రం భావిస్తోంది. ఈ క్రమంలో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల వేట కొనసాగిస్తోంది. గడిచిన నాలుగు నెలలల్లో వందల మందిని ఎన్‌కౌంటర్ చేయించింది. ఈ నేపథ్యంలో ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న హత్యాకాండపై వ్యతిరేకత పెరుగుతోంది. మావోయిస్టులు చర్చలకు వస్తామని ప్రకటించినా.. కేంద్రం ఆపరేషన్ కొనసాగించడంపై ఇప్పుడు చర్చ జరుగుతోంది.తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఎల్కతుర్తి సభ వేదికగా పిలుపునిచ్చారు. మరుసటి రోజే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆపరేషన్ కగార్‌పై కీలక సమావేశం నిర్వహించారు. మాజీ హోం మంత్రి జానారెడ్డితో సమావేశమై ఆపరేషన్ కగార్ అంశంపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. తెలంగాణ?ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో మావోయిస్టుల టార్గెట్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లోని కర్రెగుట్టలో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై దాడులు చేస్తోంది. ఈ ఆపరేషన్‌లో బాంబు దాడుల ద్వారా వందలాది మంది మావోయిస్టులు మరణిస్తున్నట్లు సమాచారం. ఈ చర్యలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు పలు పౌర హక్కుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ ఆపరేషన్ మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తోందని, సామాజిక సమస్యలను సైనిక చర్యలతో పరిష్కరించలేమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఈ క్రమంలో తెలంగాణ సీఎం మీడియాతో మాట్లాడుతూ నక్సలిజం సమస్యను సామాజిక కోణంలో పరిశీలించాలని, కేవలం శాంతి భద్రతల సమస్యగా చూడకూడదని స్పష్టం చేశారు. "మావోయిస్టుల భావజాలాన్ని చంపడం సరైన పరిష్కారం కాదు. ఈ అంశంపై జాతీయ స్థాయిలో సమగ్ర చర్చ జరగాలి," అని ఆయన అన్నారు. శాంతి చర్చల కమిటీ సమావేశంలో కూడా ఈ విషయాన్ని ఆయన ఉద్ఘాటించారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, ఈ విషయంపై మంత్రులతో చర్చించిన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని రేవంత్ తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఈ అంశంపై అంతర్గతంగా చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం తమ అధికారిక విధానాన్ని ప్రకటిస్తుందని సీఎం స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని సీనియర్ నాయకులు, సలహాదారులతో సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ చర్చలు రాష్ట్రంలో నక్సలిజం సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా ఒక ముందడుగుగా భావిస్తున్నారు.ఆపరేషన్ కగార్‌లో అమాయక పౌరులు, గిరిజనులు కూడా బలవుతున్నారని పౌర హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలని, సామాజిక?ఆర్థిక సమస్యలను పరిష్కరించడం ద్వారా మావోయిస్టు ఉద్యమాన్ని నియంత్రించాలని వారు కోరుతున్నారు. ఈ డిమాండ్‌కు మద్దతుగా రాష్ట్రంలోని పలు సామాజిక సంస్థలు, రాజకీయ నాయకులు కూడా గళం విప్పుతున్నారు.

శాంతి చర్చలు: నక్సలిజం సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు శాంతి చర్చల కమిటీ ద్వారా చర్చలు కొనసాగించాలని సీఎం సూచించారు.

సామాజిక సంస్కరణలు: గిరిజన, బడుగు వర్గాల ఆర్థిక?సామాజిక సమస్యలను పరిష్కరించడం ద్వారా మావోయిస్టు ఉద్యమానికి మూల కారణాలను తొలగించాలని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

కేంద్రంతో సంప్రదింపులు: ఆపరేషన్ కగార్ నిలిపివేయడానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

ఆపరేషన్ కగార్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న వైఖరి, నక్సలిజం సమస్యను సామాజిక కోణంలో పరిష్కరించాలనే ఆలోచన రాష్ట్రంలో కొత్త చర్చకు దారితీసింది. జాతీయ స్థాయిలో ఈ అంశంపై చర్చ జరిగితే, శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు రాబోయే రోజుల్లో ఆసక్తికరంగా ఉండనున్నాయి.

# పకడ్బందీగా పారదర్శకంగా భూ భారతి చట్టం అమలు

## రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదు: మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని పకడ్బందీగా పారదర్శకంగా అమలు చేస్తామని, రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదని, గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను అలోపేతం చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

సైదాపూర్ మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘం కళ్యాణమండపంలో, చిగురుమామిడి మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులకు మంత్రి హాజరయ్యారు.మొదటగా సైదాపూర్ మండల కేంద్రంలో విశాల సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని, కళ్యాణమంటపాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం ఇదే మండపంలో ఏర్పాటు చేసిన భూభారతి నూతన రెవిన్యూ చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. భూమి ఒక గౌరవంగా భావించే రైతుకు ధరణి వచ్చిన తర్వాత మనశ్శాంతి లేకుండా పోయిందని అన్నారు. ధరణి తెచ్చిన భూ వివాదాల కారణంగా రైతుల ఆవేదన, ఆక్రోశం తహసిల్దార్ పై దాడి చేసే వరకు వెళ్లిందని అన్నారు. ధరణి వ్యవస్థ వల్ల రైతు తన భూమిని తాను అమ్ముకునే పరిస్థితి లేదని అన్నారు. అధికారులను గత ప్రభుత్వం దొంగలుగా చిత్రీకరించి రాత్రికి రాత్రి వందల ఎకరాల భూములను వారి పేరు పైకి బదిలాయించుకున్నారని తెలిపారు. 30 సంవత్సరాల కింద ఉన్న భూములు విక్రయించి వెళ్లిపోయిన వారి పేర్లు ధరణిలో వచ్చాయని, దీనివల్ల అసలైన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని సంకల్పంతో, భవిష్యత్తులో ఎలాంటి భూ సమస్యలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం భూ భారతి నూతన రెవిన్యూ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని తెలిపారు. జూన్ 2 నుండి ఈ చట్టం ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఈ చట్టం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి భూమికి భూధార్ సంఖ్య కేటాయిస్తామని తెలిపారు.

భూమికు సంబంధించిన రికార్డులన్నీ ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న రికార్డు చేయడం జరుగుతుందని వెల్లడించారు. చెప్పిన పని చేయలేదని సాకుతో విఆర్ఓ వ్యవస్థను రద్దు చేశారని, భూముల హక్కులను కాపాడేందుకు గ్రామీణ రెవిన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు.

# రేవంత్ ను లైట్ తీసుకున్న కేసీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 29,

సంబరం అంబరాన్ని అంటింది.. ఉత్సాహం తారస్థాయికి చేరింది.. మొత్తంగా గులాబీ పార్టీ.25 ఏళ్ల వేడుక ఎల్కతుర్తి లో అంగరంగ వైభవంగా సాగింది.. ఒకరకంగా అనధికారిక దర్పంగా ఈ కార్యక్రమం సాగింది. ఇంతటి వేడుకలో పార్టీ నాయకులకు మాట్లాడే అవకాశం రాలేదు. కేవలం ఒకే ఒక్క వ్యక్తికి మాత్రమే ప్రసంగించే అవకాశం లభించింది.సిల్వర్ జూబ్లీ వేడుకలో కల్వకుంట్ల చంద్రశేఖర రావు పార్టీ అధ్యక్షుడి హోదాలో మాట్లాడారు. దాదాపు గంట వరకు కేసీఆర్ ప్రసంగం సాగింది. తెలంగాణ రాష్ట్రంలో గడచిన 10 సంవత్సరాల కాలంలో ఏం చేశామో ఆయన చెప్పుకొచ్చారు? కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం వల్ల తెలంగాణ రాష్ట్రం వెనుకబడిపోయిందని ఆరోపించారు? తాము స్కీములు పెట్టి ప్రజలను బాగు చేస్తే.. కాంగ్రెస్ నాయకులు స్కామ్ లతో రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. గంటసేపు సాగిన మాజీ ముఖ్యమంత్రి ప్రసంగంలో కొత్తదనం కనిపించలేదు. పైగా ఆయన విమర్శలకు.. ఆరోపణలకు.. 10 సంవత్సరాల తన పరిపాలన వరకే పరిమితమయ్యారు. అంతేకాదు తెలంగాణకు మొదటి నుంచి కూడా కాంగ్రెస్ పార్టీ శత్రువు అని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు కాకుండా నాడు, నేడు కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నదని వివరించారు. మొత్తంగా కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఇన్ని రోజుల పాటు మౌనంగా ఉండి.. ఇప్పుడు బయటికి రావడం.. సభను భారీగా నిర్వహించడంతో.. కీలక వ్యాఖ్యలు చేస్తారని అందరూ అనుకున్నారు. కానీ దానికి తగ్గట్టుగా ఆయన మాట్లాడకపోవడం ఒకరకంగా భారత రాష్ట్ర సమితి శ్రేణులను నిరాశకు గురి చేసిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. గంటసేపు సాగిన కెసిఆర్ ప్రసంగంలో ఎక్కడా కూడా రేవంత్ పేరు వినిపించలేదు. కనీసం రేవంత్ పేరును ప్రస్తావించడానికి కూడా కేసీఆర్ ఇష్టపడలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించిన ఃఖీూ అధినేత కేసీఆర్..ఎక్కడా సీఎం రేవంత్ రెడ్డి పేరును ప్రస్తావించలేదు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు బోల్తా పడ్డారని..ప్రభుత్వంలో ఉన్న నాయకులు..నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.బీఆర్ఎస్, కేసీఆర్ మీద నిందలు వేస్తున్న కాంగ్రెస్ పాలకులు మంచిగా ఉన్న తెలంగాణను ఆగమాగం చేశారని ఫైర్ అయ్యారు. కేసీఆర్ శాసనసభకు ఎందుకు రారని ప్రశ్నించేవారికి చెబుతున్నానంటూ.. అసెంబ్లీలో తమ పార్టీ నాయకులు ప్రశ్నిస్తేనే ఈ ప్రభుత్వానికి సమాధానం చెప్పే దిక్కులేదని?అలాంటప్పుడు వాళ్లకు నేనెందుకంటూ సీఎం రేవంత్ పేరును ప్రస్తావించకుండానే కౌంటర్ ఇచ్చారు.

ఇలా కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు అంశాల్లో ఆగ్రహం వ్యక్తం చేసిన కేసీఆర్..ఎక్కడా సీఎం రేవంత్ రెడ్డి పేరును ఎత్తలేదు. కనీసం ముఖ్యమంత్రి అనిగాని, సీఎం అనిగాని ప్రస్థావించలేదు. ఒకటి రెండు సందర్భాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేరును ప్రస్తావించకుండానే ఆర్థిక మంత్రి అని మాట్లాడారు. కేసీఆర్ సుధీర్ఘ ప్రసంగంలో ఒక్కసారి కూడా సీఎం రేవంత్ రెడ్డి పేరును పలకకపోవడంపై తెలంగాణ రాజకీయవర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్షంలో భారత రాష్ట్ర సమితి.. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నాయి. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత భారత రాష్ట్ర సమితిపై ఉంది. ప్రజలకు మెరుగైన పాలన అందించే బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉంది. ఈ సమయంలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం పరిపాటి. ఎందుకంటే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్న మనదేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతుంటాయి. పరస్పరం విమర్శలు కొనసాగుతుంటాయి. అయితే విచిత్రంగా భారత రాష్ట్ర సమితి 25 సంవత్సరాల వేడుకలో కల్వకుంట్ల చంద్రశేఖర రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు పలకకపోవడం వెనక పెద్ద కారణమే ఉందని భారత రాష్ట్ర సమితి నాయకులు అంటున్నారు. ఇక ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూడా గట్టిగా కౌంటర్ ఇస్తున్నాయి. తన పేరు కూడా పలకడానికి భయపడే పరిస్థితిని కల్వకుంట్ల చంద్రశేఖర రావు కు రేవంత్ రెడ్డి కల్పించారని వ్యాఖ్యానిస్తున్నాయి. ఇంతవరకు అసెంబ్లీకి ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే వచ్చారని.. అప్పుడు యుద్ధం చేస్తానని పెద్దపెద్ద ప్రకటనలు చేశారని.. యుద్ధం కాదు కదా కనీసం బయటికి కూడా రాలేని పరిస్థితిని మాజీ ముఖ్యమంత్రి కి రేవంత్ రెడ్డి కల్పించారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.. 2023 ఎన్నికల్లో ఓటమి తర్వాత మాజీ ముఖ్యమంత్రి అసెంబ్లీకి రెండు సందర్భాల్లో మాత్రమే వచ్చారు. శాసన సభ్యుల ప్రమాణ స్వీకార సమయంలో మాజీ ముఖ్యమంత్రి కాలు జారిపడి.. ఆస్పత్రి పాలయ్యారు. ఆ సమయంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ను రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఆ తర్వాత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆరోగ్యం కుదురుకున్న తర్వాత శాసనసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఇక ఆ మధ్య బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఒకసారి అసెంబ్లీకి వచ్చారు. ఇప్పుడు తన వ్యవసాయ క్షేత్రానికి మాత్రమే కెసిఆర్ పరిమితమవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ.. భారత రాష్ట్ర సమితి ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. బహుశా ఆ పార్టీ చరిత్రలో ఇది అత్యంత దారుణమైన ఓటమి. ఇక దీని కవర్ చేయడానికి భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియాను ప్రధాన అస్త్రంగా వాడుకుంటున్నది. అయితే సోషల్ మీడియా ప్రచారం వేరు.. వాస్తవ పరిస్థితి వేరని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. భారత రాష్ట్ర సమితి నాయకులు సోషల్ మీడియాలో బలంగా ఉన్నారని.. తమ ప్రజల్లో బలంగా ఉన్నామని.. ప్రజల్లో బలంగా ఉన్న వారే గెలుస్తారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు..

# భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే -నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

దాదాసాహెబ్ పాల్కే అసలు పేరు ధుండీరాజ్ గోవింద్ ఫాల్కే ఈయన ఒక భారతీయ సినీ నిర్మాత, దర్శకుడు, స్క్రీన్‌ప్లే-రచయిత, భారతీయ సినిమా కు ఇతను పితామహుడు. ఇతడి ప్రథమ సినిమా రాజా హరిశ్చంద్ర (భారతీయ మొదటి సినిమా) 1913. ఇతడు తన జీవితంలో 95 ఫీచర్ ఫిల్మ్ లు, నిర్మించాడు. బొంబాయిలో భారతీయ సినిమా జూబ్లీ ఉత్సవాల సందర్భంగా 1939 లో ఫాల్కేకు అయిదువేల రూపాయలు పర్సు బహూకరించారు. 1966 లో ఇతని పేరు మీద దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, భారత ప్రభుత్వంచే స్థాపించబడింది. దాదాసాహెబ్ ఫాల్కే సంస్కృత పండితుని కుమారుడు. ఏప్రిల్ 30 1870లో నాసిక్‌లోని త్రయంబకేశ్వర్‌లో జన్మించారు. బొంబాయిలోని జెజె కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో, బరోడాలోని కళాభవన్ విద్యార్థి. మంచి చిత్రకారుడు, నాటకాల్లో మేకప్ వేశారు. మంచి మెజీషియన్ కూడా... ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. ఆ కాలంలోనే ప్రింటింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం జర్మనీ వెళ్లాలనుకున్నారు. సినిమాకు సంబంధించిన వార్త ఒకటి పత్రికలో వచ్చింది. తనను ఆ వార్త బాగా ఆలోచింపజేసింది. మన దేశంలో కూడా సినిమాను ఎందుకు తీయకూడదు అనే ఆలోచన అతన్ని కుదురుగా ఉండనివ్వలేదు. తన వద్ద ఉన్న డబ్బు, మిత్రుల నుంచి తీసుకున్న అప్పు, జీవిత బీమా డబ్బు మొత్తం తీసుకొని సినిమా నిర్మాణానికి సంబంధించిన పరికరాలు కొనడానికి 1912లో ఇంగ్లాండ్ వెళ్లారు. అయితే ఫాల్కేకు తాను చరిత్ర సృష్టించబోతున్నానని తెలియదు, అదే తన





జీవితాన్ని పేదరికంలోకి నెట్టివేస్తుందనీ ఊహించలేదు. ఫాల్కే 1913లో రాజా హరిశ్చంద్ర, ఆదే సంవత్సరం మోహినీ భస్మాసుర, సత్యవాన్ సావిత్రి (1914) శ్రీకృష్ణ జననం (1918) కాళీయ మర్దన్ (1919) నిర్మించారు. ఆ తరువాత సినిమా రంగంలో క్రమంగా వ్యాపార ధోరణి మొదలైంది. దాంతో పాల్కే పక్కకు తప్పుకున్నారు. సినిమా ప్రేమ ఆయన్ని నిలువనివ్వలేదు. తన పలుకుబడి, పరిచయాలు ఉపయోగించి నిధులు సమీకరించి 1937లో గంగావతరణ సినిమా తీశారు. నిండా మునిగిపోయారు. సినిమాను వ్యాపారంగా చూసి ఉంటే ఆయన పరిస్థితి బాగానే ఉండేది. సినిమాను విపరీతంగా ప్రేమించి దెబ్బతిన్నారు. తన వారసులను పేదరికంలోకి నెట్టేశారు. ఆయన దేశానికి తీసుకు వచ్చిన సినిమాతో సినీ వ్యాపారులు కోట్లు సంపాదించారు. పాపులారిటీని, రాజకీయాల్లో పదవులు సంపాదించారు కానీ ఫాల్కే మాత్రం కఠిక దరిద్రంలో మరణించారు. ఆయన కుమారుడు ముంబై వీధుల్లో చిల్లర వ్యాపారిగా జీవితం గడిపారు. బాగున్న రోజుల్లో ఫాల్కే ఫోర్డ్ కారును ఉపయోగించేవారు. 1920 ప్రాంతంలో ఆ కారులోనే షూటింగ్‌కు వెళ్లేవారు. తిరిగి సినిమా తీయాలని నిర్ణయించుకున్న కాలంలో దాన్ని అమ్మేశారు. ఆ కారు పెళ్ళిళ్ల ఊరేగింపునకు ఉపయోగించారు. ఐదేళ్ల క్రితం ఈ కారు నాసిక్ డంప్ యార్డ్‌లో లభించింది. తొలి భారతీయ సినిమా కెమెరాను ఫాల్కే జర్మనీ నుంచి తెప్పించారు. అదేమైందో ఇప్పుడు ఎవరికీ తెలియదు. సినిమా నిర్మాణానికి ఎలాంటి ఏర్పాట్లు లేని కాలంలో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి ఫాల్కే తొలి సినిమా తీశారు. ఫాల్కే భార్య సరస్వతి భారతీయ తొలి సినిమా రాజా హరిశ్చంద్ర నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఆమెనే తొలి భారతీయ సినిమా టెక్నీషియన్. సరస్వతి షూటింగ్ సమయంలో వెలుతురు కెమెరాపై పడకుండా బెడ్ షీట్‌ను అడ్డుగా పట్టుకుని ఉండేవారట. షూటింగ్‌కు కావలసినవన్నీ సమకూర్చేవారు. రాత్రి పూట క్యాండిల్ వెలుగులోనే ఈ సినిమాకు సంబంధించిన సాంకేతిక పనులు నిర్వహించేవారు. సినిమా బృందం 60-70 మందికి ఆమెనే వంట చేసి పెట్టేవారు. రాజా హరిశ్చంద్రలో హరిశ్చంద్రుని కుమారునిగా ఫాల్కే కుమారుడు బాలచంద్ర నటించారు. తొలి భారతీయ బాలనటుడు అతనే. శ్రీకృష్ణ జననం, కాళీయ మర్దన్‌లో బాల శ్రీకృష్ణునిగా మందాకిని నటించారు. ఆమె ఫాల్కే పెద్ద కూతురు. ఆమెనే తొలి భారతీయ బాలనటి. భారతీయ సినిమా రజతోత్సవ వేడుకల్లో దాదాసాహెబ్ ఫాల్కే ఒక అనామకుడిగా కూర్చోవడం చూసిన శాంతారాం ఆయన్ని గుర్తించి వేదికపైకి తీసుకు పోయి 1938లో అప్పటికప్పుడు వేదికపై ఐదువేల రూపాయల పర్స్ అందజేశారు. ఆ డబ్బుతో ఫాల్కే తిరిగి సినిమా తీస్తాడేమోనని చాలా మంది భయపడ్డారు. ఎందుకంటే సినిమా అంటే ఆ మహనీయునికి అంత పిచ్చి. అందరూ ఒత్తిడి తెచ్చి ఆ డబ్బుతో నాసిక్‌లో ఒక ఇంటిని కొనిపించారు. అప్పటి వరకు ఫాల్కేకు సొంత ఇల్లు కూడా లేదు. ఆ ఇంటిలోనే తుది శ్వాస విడిచారు.బొంబాయిలో జూబ్లీ ఉత్సవాల సందర్భంగా బహుమతి పొందిన తర్వాత ఫాల్కే పేదరికంతోనే స్వగ్రామం చేరుకున్నాడు. దాదాపు అందరూ మర్చి పోయిన తరుణంలో 1944, ఫిబ్రవరి 16 న తుది శ్వాస విడిచాడు. 90 సినిమాలను నిర్మించిన భారతీయ సినిమా పితామహుడు దరిద్రంతోనే కన్నుమూసినా, ఈ నాటికీ అతని జీవన మూల్యాలు ఆదర్శంగా, స్ఫూర్తినిచ్చేవిగానే ఉన్నాయి. అతని పేరు మీద జాతీయ అవార్డుల సంరంభం ప్రతి యేటా జరుగుతున్నా, అతని జీవిత చరమాంకం ఎంతటి దైన్యావస్థలో గడిచిందో ఎవరూ తలచకపోవటం శోచనీయం.

=================చీచీ

# ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీశ్రీ -నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించి, తెలుగు కవిత్వాన్ని మలుపు తిప్పి శ్రీశ్రీగా ఎదిగి, మహాకవిగా గుర్తింపు పొందారు శ్రీరంగం శ్రీనివాసరావు, 1910 ఏప్రిల్ 30న పూడిపెద్ది వెంకటరమణయ్య, అప్పటకొండ దంపతులకు విశాఖపట్నంలో జన్మించాడు. శ్రీరంగం సూర్యనారాయణకు దత్తుడగుట వలన ఈయన ఇంటి పేరు శ్రీరంగం గా మారింది. శ్రీశ్రీ ప్రాథమిక విద్యాభ్యాసం మొత్తం విశాఖపట్నం లో జరిగింది. శ్రీశ్రీ తన రచనా వ్యాసంగాన్ని తన ఏడవ యేటనే ప్రారంభించాడు. తన మొదటి గేయాల పుస్తకం ఎనిమిదవ యేట ప్రచురింపబడింది. 1931లో మద్రాసు యూనివర్సిటీలో బి.ఏ పూర్తి చేశాడు. 1935లో విశాఖలోని మిసెస్ ఎవిఎస్ కాలేజీలో డిమాన్స్ట్రేటరుగా చేరాడు. 1938 లో మద్రాసు ఆంధ్రప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తర్వాత ఢిల్లీ ఆకాశవాణిలోను, నిజాం సంస్థానంలోను, ఆంధ్రవాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1933 నుంచి 1940 వరకు తాను రాసిన 'గర్జించు రష్యా', 'జగన్నాథ రథ చక్రాలు' వంటి గొప్ప కవితలను సంకలనం చేసి 'మహా ప్రస్థానం' అనే పుస్తకంగా ప్రచురించాడు శ్రీశ్రీ. తెలుగు సాహిత్యపు దశను, దిశను మార్చిన పుస్తకం గా శ్రీశ్రీ మహాప్రస్థానం మిగిలిపోయింది. ఈయన ప్రముఖ హాస్యనటుడు రాజబాబుకు తోడల్లుడు. శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీగా ప్రసిద్ధుడయ్యాడు. విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా ఆయన ప్రసిద్ధుడు. శ్రీశ్రీ హేతువాది మరియు నాస్తికుడు. మహాకవిగా శ్రీశ్రీ విస్తృతామోదం పొందాడు. వివిధ దేశాల్లో ఎన్నోమార్లు పర్యటించాడు. ఎన్నో పురస్కారాలు పొందాడు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, మొదటి "రాజా లక్ష్మీ ఫౌండేషను" అవార్డు వీటిలో కొన్ని. అభ్యుదయ రచయితల సంఘానికి (అరసం) అధ్యక్షుడిగా పనిచేసాడు. 1970లో అతని షష్టిపూర్తి ఉత్సవం విశాఖపట్నంలో జరిగింది. ఆ సందర్భంగానే అతను అధ్యక్షుడుగా విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది. కొంతకాలం క్యాన్సరు వ్యాధి బాధకు లోనై 1983 జూన్ 15 న శ్రీశ్రీ మరణించాడు. మహాప్రస్థానం ఆయన రచించిన కావ్యాల్లో ప్రసిద్ధమైనది... మరో ప్రపంచం,మరో ప్రపంచం,మరో ప్రపంచం పిలిచింది!పదండి ముందుకు,పదండి త్రోసుకు!పోదాం, పోదాం పైపైకి!కదం త్రొక్కుతూ,పదం పాడుతూ,హృదాంతరాళం గర్జిస్తూ-పదండి పోదాం,వినబడలేదామరో ప్రపంచపు జలపాతం?దారిపొడుగునా గుండె నెత్తురులుతర్పణ చేస్తూ పదండి ముందుకు!బాటలు నడచీ,పేటలు కడచీ,కోటలన్నిటిని దాటండి!నదీ నదాలూ,అడవులు, కొండలు,ఎడారులా మన కడ్డంకి?పదండి ముందుకు!పదండి త్రోసుకు!పోదాం, పోదాం, పైపైకి!ఎముకులు క్రుళ్ళిన,వయస్సు మళ్ళినసోమరులారా! చావండి!నెత్తురు మండే,శక్తులు నిండే,సైనికులారా! రారండి!"హరోం! హరోం హర!హర! హర! హర! హర!హరోం హరా!" అని కదలండి!మరో ప్రపంచం,మహా ప్రపంచంధరిత్రినిండా నిండింది!పదండి ముందుకు,పదండి త్రోసుకు!ప్రభంజనంవలె హోరెత్తండీ!భావ వేగమున ప్రసరించండీ!వర్షుకాభ్రముల ప్రళయఘోషవలెపెళ పెళ పెళ పెళ విరుచుకు పడండి!పదండి,పదండి,పదండి ముందుకు!కనబడలేదా మరో ప్రపంచపుకణకణమండే త్రేతాగ్ని?ఎగిరి, ఎగిరి, ఎగిరి పడుతున్నవిఎనభై లక్షల మేరువులు!తిరిగి, తిరిగి, తిరిగి సముద్రాల్జలప్రళయ నాట్యం చేస్తున్నవి!సలసలక్రాగే చమురా? కాదిదిఉష్ణరక్త కాసారం!శివసముద్రమూ,నయాగరావలెఉరకండీ! ఉరకండీ ముందుకు!పదండి ముందుకు!పదండి త్రోసుకు!మరో ప్రపంచపు కంచు నగారావిరామ మెరుగక మ్రోగింది!త్రాచులవలెనూ ,రేచులవలనూ,ధనంజయునిలా సాగండి!కనబడలేదా మరో ప్రపంచపుఅగ్ని కిరీటపు ధగధగలు,ఎర్రబావుటా నిగనిగలు,హోమజ్వాలల భుగభుగలు?

# రేవంత్, కేసీఆర్... ఒకటే మాట...

# ఆపరేషన్ కగార్ ను ఆపాలంటూ డిమాండ్



హైదరాబాద్, ఏప్రిల్ 29, (

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. పదేళ్లుగా వీరిమధ్య రాజకీయ వైరం కొనసాగుతోంది. అయితే రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు అంటారు. పార్టీ సిద్ధాంతం పరంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ ముఖ్యమైన మంత్రి కేటీఆర్ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తారు. కానీ, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో రేవంత్‌రెడ్డికి కేటీఆర్ మద్దతు తెలిపారు. ఇప్పుడు మావోయిస్టుల విషయంలో కేసీఆర్ మద్దతు తెలిపారు.

తెలంగాణ రాజకీయాల్లో అసాధారణ పరిణామం చోటుచేసుకుంది. రాజకీయ ప్రత్యర్థులైన సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ మావోయిస్టు సమస్యపై ఒకే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని ఇద్దరూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.తెలంగాణ?చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కేంద్ర బలగాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో మావోయిస్టుల ఏరివేత కార్యక్రమాన్ని తీవ్రతరం చేశాయి. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు దాదాపు 30 మంది నక్సలైట్లు హతమైనట్లు సమాచారం. అయితే, ఈ ఆపరేషన్ అమాయక గిరిజనులు, సామాన్య ప్రజలపై ప్రభావం చూపుతోందని రేవంత్, కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని తక్షణం నిలిపివేయాలని ఇద్దరూ డిమాండ్ చేశారు.మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నారని, కేంద్రం కూంబింగ్ ఆపరేషన్లు, కాల్పులను ఆపి చర్చలకు ముందుకు రావాలని కేసీఆర్ వరంగల్‌లోని ఎల్కతుర్తి బీఆర్ఎస్ సభలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ తరఫున కేంద్రానికి లేఖ రాస్తామని ఆయన ప్రకటించారు. మరోవైపు, శాంతి చర్చల కమిటీ నేతలు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి, కేంద్రాన్ని కాల్పుల విరమణకు ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను సామాజిక కోణంలో చూస్తామని, శాంతి?భద్రతల సమస్యగా కాదని రేవంత్ స్పష్టం చేశారు.నక్సలిజం సమస్యపై చర్చలకు అనుభవం ఉన్న మంత్రి జానారెడ్డి సలహాలు తీసుకుని, ఇతర మంత్రులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సునిశితంగా వ్యవహరిస్తూ, కేంద్రంతో సమన్వయం చేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. కేసీఆర్ కూడా ఈ అంశాన్ని బలంగా లేవనెత్తి, కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.సాధారణంగా ఒకరి విధానాలను మరొకరు తీవ్రంగా విమర్శించుకునే రేవంత్, కేసీఆర్ మావోయిస్టు సమస్య విషయంలో ఒకే గొంతుతో మాట్లాడటం తెలంగాణ రాజకీయాల్లో అరుదైన సంఘటన. ఈ ఏకాభిప్రాయం రాష్ట్రంలో శాంతి ప్రక్రియను బలోపేతం చేస్తుందా లేదా రాజకీయ లబ్ధికి ఉపయోగపడుతుందా అనేది చర్చనీయాంశం. ఈ అంశంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయో వేచి చూడాలిమావోయిస్టు సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలనే రేవంత్, కేసీఆర్ ఉద్దేశం తెలంగాణలో శాంతి ప్రక్రియకు కొత్త దిశను ఇవ్వవచ్చు. ఈ సమస్యకు హింసాత్మక పరిష్కారం కాకుండా, చర్చల ద్వారా మార్గం సుగమం చేయాలనే ఇద్దరి నేతల ఆలోచన రాష్ట్రంలో సామాజిక సమస్యల పరిష్కారానికి ఒక ముందడుగుగా పరిగణించబడుతోంది. ఈ ఏకాభిప్రాయం రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందో రాబోయే రోజులు తేల్చనున్నాయి.

## బుధవారం సింహగిరిపై చందనోత్సవం

విశాఖపట్నంబుధవారం సింహగిరిలో చందనోత్సవం జరగనుంది. అప్పన్న స్వామి నిజరూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. నిజరూప దర్శనానికి రెండు లక్షలు మంది భక్తులు వస్తారని అంచనా. సామాన్య భక్తుల దర్శనానికి అధిక ప్రాధాన్యతిస్తూ ఏర్పాట్లు చేసారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్వామివారికి రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. టీటీడీ నుంచి చైర్మన్ బి ఆర్ నాయుడు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. చందనోత్సవానికి రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసారు.

## అక్రమ ఇసుక డంపు పై కోహెడ పోలీసుల కొరడా

కోహెడ అక్రమంగా డంపు చేసిన 95 టన్నుల ఇసుకను కోహెడ పోలీసులు పట్టుకున్నారు. కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని తంగళ్ళపల్లి గ్రామ శివారులో రెండు చోట్లలో గుర్తు తెలియని కొంతమంది వ్యక్తులు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక డంపు చేసినారని నమ్మదగిన సమాచారం పై కోహెడ పోలీసులు వెళ్లి డంపును స్వాధీనం చేసుకొని తదుపరి చర్యలకోసం స్థానిక తహశీల్దార్కు అప్పగించారు.

## కాకినాడ ఐడిఎ ఆధ్వర్యంలో " అంతర్జాతీయ నృత్య దినోత్సవం"

కాకినాడస్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాల సమావేశ మందిరం లో కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యాన అంతర్జాతీయ నృత్య దినోత్సవం సంధర్భంగా

వాగ్దేవి నృత్య కళాశాల స్థాపకురాలుప్రముఖ కూచిపూడి నాట్య గురువులు కళ్యాణి తేజేశ్వరరావు ని డా అడ్డాల ఘనంగా సత్కరించారు.

ఈ సంధర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 29న జీన్-జార్జెస్ నోవెర్రే జన్మదినం సంధర్భంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం జరుపుకుంటామని, ఆయన ఆధునిక బ్యాలెట్ యొక్క "పితామహుడు" అని, ప్రపంచవ్యాప్తంగా ఈ తేదీన జరిగే కార్యక్రమాలు మరియు ఉత్సవాల ద్వారా నృత్య విద్యను ప్రోత్సహించడానికి ఈ రోజు కృషి చేస్తుందని అన్నారు.

చాలా రకాల నృత్యాలను ఏరోబిక్ వ్యాయామాలుగా పరిగణించవచ్చని అవి హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించగలవని,బరువు నియంత్రణలో సహాయపడతాయని, ఒత్తిడిని తగ్గించి శారీరక దృఢత్వంతో అనుబంధించబడిన ఇతర ప్రయోజనాలను తీసుకురాగలవని తెలిపారు. నృత్య సాధన లో మొత్తం శరీర కదలికలు ఉండటం వలన, శ్వాసక్రియ, రక్త ప్రసరణ మొదలైన శరీరంలోని వివిధ వ్యవస్థల మెరుగైన పనితీరును అందిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలను బాల్య దశ నుంచే శాస్త్రీయ నృత్యం లో శిక్షణ ఇప్పించినట్లయితే వారికి మంచి ఆరోగ్యం మరియు ఏకాగ్రత లభిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమం లో కాకినాడ ఐడిఎ సభ్యులు, డా శ్రీవల్లి, డా యేరూష, భవాని ,తేజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భారత శక్తి



# బీజేపీతో బీఆర్ ఎస్ పోత్తా...

## మోడీని పల్లెత్తుమాట అనని గులాబీ బాస్

## సభ సక్సెస్సా.. ఫెయిలా..

వరంగల్,, ఏప్రిల్ 29, లవెనకటికి ఎవడో కొండంత రాగం తీసి అదేదో పాట పాడాడంట. బి ఆర్ ఎస్ వరంగల్ రజతోత్సవ సభ చూస్తే అలాగే అనిపించింది. టిఆర్ఎస్ పాతికేళ్ల పండగ పేరిట రేవంత్ సర్కార్ మీద యుద్ధం ప్రకటించే వేదిక గా కెసిఆర్ కుటుంబం చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. చివరికి సభకు వచ్చిన జనం?. కెసిఆర్ స్పీచ్ చూశాక 200 కోట్లు బొందలో పోశారు కదరా అని మాట్లాడుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతని క్యాష్ చేసుకోవడానికి 200 కోట్లు ఖర్చుపెట్టి సిల్వర్ జూబ్లీ సభ చేస్తే?. వచ్చిన జనం లక్షన్నర దాటలేదు. జనం రాకపోతే పాయె? కెసిఆర్ సార్ స్పీచ్ ఇరగదీస్తాడేమో అనుకుంటే? పాడిందే పాట పాచిపల్ల దాసరి లాగా చెప్పిందే చెప్పి బోర్ కొట్టిచ్చాడు కేసీఆర్.రాబోయే రోజుల్లో బిజెపితో మాకు సంబంధాలు ఉంటాయి అని చెప్పడానికి అనుకుంటా ఒక్కచోట తప్ప మోడీని పల్లెత్తు మాట అనలేదు. బిజెపిని ఎక్కడ విమర్శించలేదు. ఈ విషయంలో కేసీఆర్ ముందుచూపునీ కచ్చితంగా మెచ్చుకోవాలి. ఏతవాతా కెసిఆర్ స్పీచ్ మాత్రం అట్టర్ ఫ్లాప్. ఈ ఒక్క విషయంలో కాంగ్రెస్ వాళ్ళు సంతోషించవచ్చు. వరంగల్ రజతోత్సవ సభకి పాతిక లక్షలు జనం వస్తారని బి ఆర్ ఎస్ అంచనా వేసింది. కాంగ్రెస్ పై ఉన్న వ్యతిరేకత మొత్తం సభలో కనిపించవచ్చని చాలా ఆశలు పెట్టుకుంది. బ్లాక్ అండ్ వైట్ కలిపి ఈ సభ కోసం 200 కోట్లు రూపాయలు ఖర్చుపెట్టి ఉంటారని ఒక అంచనా. పార్టీ సొమ్ము కాకుండా ప్రతి జిల్లాస్థాయి లీడర్ కి, ఎమ్మెల్యే కి టార్గెట్ పెట్టారు. దేశంలోనే అత్యధికంగా పార్టీ అకౌంట్లో 1450 కోట్లు ఉన్న బి ఆర్ఎస్ పార్టీ ఈ మీటింగ్ కోసం 30 కోట్లు అధికారికంగా చెల్లించింది.ఇది దేశంలోనే అతిపెద్ద బహిరంగ సభ కానుందని ఊదరగొట్టారు బిఆర్ఎస్ నేతలు. రైతుల దగ్గర రిలీజ్ తీసుకున్న 1200 ఎకరాల్లో చదును చేయడం ,బారికేడ్లు, రోడ్లు వేయడం, స్టేజి ,గెస్ట్ ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ?..వీటి కోసమే 25 కోట్లు ఖర్చు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ఆర్టిస్టులతో వాల్ రైటింగ్ ,గులాబీ జెండాలు ,ఫ్లెక్సీలు ,హోర్డింగులు, పేపర్లు ,టీవీలో ప్రకటనలు దీనికోసం మరో 25 కోట్లు ఖర్చు పెట్టారు. ఇక జన సమీకరణం కోసం అయితే ఆర్టీసీ కే 9 కోట్లు చెల్లించారు. ప్రైవేట్ వాహనాలు?? ప్రయాణం మధ్యలో వారికి భోజనాలు ,మందు షరా మామూలే. వీటన్నిటికీ మరో పాతిక కోట్లు ఖర్చు అయినట్లు సమాచారం. ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి జనం దగ్గర కొట్టేసిన సొమ్ము జనానికి ఖర్చు పెట్టడంలో కెసిఆర్ ఏ మాత్రం వెనకడుగు వేయరని మరోసారి నిరూపించారు.

బస్సుల్లో టిఆర్ఎస్ కార్యకర్తలు మందు బాటిల్స్ తాగుతూ విలాసంగా నినాదాలు చేస్తుంటే?. ఇది కదా గులాబీ పార్టీ హవా అనిపించింది. ఇదంతా బానే ఉంది. ఇన్ని వందల కోట్లు ఖర్చుపెట్టి రెండు నెలలు హంగామా చేస్తే మొత్తం వచ్చిన జనం లక్షన్నర. వేసిన కుర్చీలు 75 వేలు. నిలబడిన వాళ్లు మరో 75 వేలు. సరే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంది రాలేకపోయారు ?చాలామంది జనం అని అనుకుంటే వాళ్లు 50 వేలు ఉంటారు అనుకున్నా? మొత్తం కలిసి కూడా రెండు లక్షలు నిండలేదు. మనిషికి 500 ఇచ్చి, బిర్యానీ ప్యాకెట్లు, మందు బాటిల్స్ ఇన్ని సప్లై చేసినా కూడా జనాన్ని తీసుకురావడం కష్టం అయిపోయింది. ప్రతి బి ఆర్ఎస్ నాయకుడికి టార్గెట్లు పెట్టిన ఒకరిద్దరు మినహా మిగిలిన వాళ్ళు ఎవరు టార్గెట్ రీచ్ కాలేకపోయారు. ఈ మాత్రం దాని కోసమా రెండు నెలల నుంచి 200 కోట్లు ఖర్చుపెట్టి ఇంత హంగామా చేసింది అని అనిపించింది బి ఆర్ ఎస్ సభ చివరికిఇక కెసిఆర్ స్పీచ్ విషయానికొస్తే. అంతఅన్నాడు ఇంత అన్నాడు? గంగరాజు అయినాక వగ్గిస్తాడే గంగరాజు అన్నట్లు? అసలు కెసిఆర్ వస్తే భూకంపం పుట్టిస్తాడు అన్నట్టుగా బిల్డప్ ఇచ్చారు. ఇంకా బాధాకరమైన విషయం ఏంటంటే?. ఈ సభలో ఒక్క నాయకుడు కూడా మాట్లాడలేదు. కెసిఆర్ స్పీచ్ కి మళ్ళీ ఎక్కడ ఆటంకం కలుగుతుందో అన్నట్లు సభ మొత్తం వన్ అండ్ ఓన్లీ కెసిఆర్ స్పీచ్ తో అదిరిపోవాలి అనుకున్నారు. కెసిఆర్ హెలికాప్టర్ లో దిగి సభ పైకి రావడానికి చాలా సేపు వేచి ఉండాల్సి వచ్చింది. సరే వచ్చిన తర్వాత అయినా ఇరగదీసాడా అంటే మళ్లీ పాడిన పాటే పాడాడు. అవే పిల్లి శాపనార్థాలు? అవే తిట్లు. కెసిఆర్ స్పీచ్ లో కనీసం కొత్త తిట్లు కూడా లేవు. పోనీ ఏదైనా సంచలన ప్రకటన ఉంటదా అన్న అంటే అది లేదు. కాంగ్రెస్?. రేవంతు టార్గెట్ గానే కెసిఆర్ స్పీచ్ మొత్తం సాగిందిమొత్తం మీద రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ఇంత వ్యతిరేకత ఉంటే?. ఆ వ్యతిరేకతని క్యాష్ చేసుకోవడంలో బి ఆర్ఎస్ అట్టర్ ఫ్లాఫ్ అయింది.200 కోట్ల రూపాయలు వందలో పోసినట్లయింది. ఇంత చేసి పాపం హరీష్ రావు చివరికి సభలో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉద్యోగం కూడా చేశాడు. కానీ ఎక్కడ హరీష్ రావు బొమ్మ కనపడకుండా వేదిక మీద చాలా జాగ్రత్త పడ్డారు కేసీఆర్ కేటీఆర్. పాపం హరీష్ కి ఇదొక విషాదం. మొత్తం మీద కెసిఆర్ భూకంపం పుట్టించడం మాట నుంచి, టిఆర్ఎస్ భ్రమలో ఉంది అనే విషయం మాత్రం ఈ సభ ద్వారా అందరికీ తెలిసింది.

==============

# తెలంగాణ బ్రాండ్ తోనే మామిడి ఎగుమతులు

హైదరాబాద్, ఏప్రిల్ 29,

తెలంగాణ మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో పండించే మామిడి పండ్లను శుద్ధి చేసి, తెలంగాణ బ్రాండ్ పేరుతో రైతులే నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఉద్యానశాఖ రూ.35 కోట్లతో సమగ్ర ప్రతిపాదనలు రూపొందించింది. తెలంగాణ మామిడికి అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. రాష్ట్రంలో ఏటా సుమారు ఆరు వేల టన్నుల మామిడి ఉత్పత్తి అవుతుండగా.. అందులో వెయ్యి టన్నుల వరకు ప్రైవేటు కంపెనీల ద్వారా ముంబై, బెంగళూరుల మీదుగా విదేశాలకు ఎగుమతి అవుతోంది. ఈ క్రమంలో మధ్యవర్తులు లాభాలు గడిస్తుండటంతో, రైతులకు సరైన ఆదాయం అందడం లేదు. ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఎగుమతులకు అవసరమైన అత్యాధునిక శుద్ధి సౌకర్యాలను ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. దీనిలో భాగంగా, మామిడిపై ఉండే పురుగులను తొలగించే రేడియేషన్ ప్రక్రియ కోసం రూ.24 కోట్లతో అటామిక్ రీసెర్చ్ ఎనర్జీ యంత్రం, పండ్లను మెరిసేలా చేసే వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు రూ.5 కోట్లు, మామిడిని మగ్గబెట్టే హాట్‌వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు రూ.3 కోట్లు, నిల్వ కోసం కోల్డ్ రూమ్స్‌కు రూ.4 కోట్లు మరియు ఇంటిగ్రేటెడ్ ప్యాకింగ్ కోసం రూ.2 కోట్లు కేటాయించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా బాటసింగారం పండ్ల మార్కెట్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ ప్యాక్‌హౌస్‌లను ఏర్పాటు చేస్తారు. భవిష్యత్తులో కోహెడ అంతర్జాతీయ మార్కెట్ ప్రారంభమయ్యాక అక్కడ కూడా పదికి పైగా అత్యాధునిక ప్యాక్‌హౌస్‌లను నెలకొల్పాలని ఉద్యానశాఖ యోచిస్తోంది. ఈ చర్యల ద్వారా తెలంగాణ మామిడి రైతులు నేరుగా అంతర్జాతీయ మార్కెట్‌లోకి ప్రవేశించి అధిక లాభాలు పొందడానికి అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా, తెలంగాణ మామిడి బ్రాండ్‌కు అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుంది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని లక్షలాది మామిడి రైతులకు నిజంగా ఒక తీపి కబురుతెలంగాణలో ప్రధానంగా హిమాయత్, బంగినపల్లి, దశేరి వంటి రకాలు పండుతాయి. వీటికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతులకు అండగా నిలుస్తోంది. తాజాగా నిర్ణయం వారి ఆదాయాన్ని మరింత పెంచనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. ప్యాక్‌హౌస్‌లలో, ఎగుమతి ప్రక్రియలో అనేక మందికి ఉపాధి దొరకనుంది.

# ప్రధాని పర్యటన ఏర్పాట్లు ?

## అధికారులతో కలిసి పరిశీలించిన మంత్రి నారాయణ

## సభా వేదిక,పార్కింగ్ ప్రాంతాలు,వేదిక వద్దకు చేరుకునే మార్గాలు పరిశీలన

అమరావతి

ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఏర్పాట్లను మంత్రి నారాయణ మంగళవారం పరిశీలించారు. సభా వేదిక, పార్కింగ్ ప్రాంతాలు, ఇతర అంశాలను అయన అధికారులతో కలిసి పరిశీలించారు.

మంత్రి మాట్లాడుతూ మే 2 న సాయంత్రం 3.25 కి ప్రధాని అమరావతి వస్తారు. ప్రధాని పర్యటనకు సంబంధించి 90 శాతం పనులు పూర్తయ్యాయి. బుధవారం కల్లా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తాం. రాజధాని కోసం కేవలం 50 రోజుల్లో ఒక్క సమస్య కూడా లేకుండా రైతులు భూములు ఇచ్చారు. అంతర్జాతీయ రాజధాని కట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సింగపూర్ సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందించాం. 365 కిమీ ట్రంక్ రోడ్లు,లే ఔట్ రోడ్లు 1500 కి,మీ మేర నిర్మించేలా ప్లాన్ ఉంది. గతంలోనే 41 వేల కోట్లకు పనులు ప్రారంభం అయ్యాయి. 2019 కు ముందు 5 వేల కోట్ల బిల్లులు కూడా చెల్లించాం. గత ప్రభుత్వం రాజధానిపై మూడు ముక్కలాట ఆడింది. మళ్ళీ మా ప్రభుత్వం రాగానే అమరావతి పనులు ప్రారంభించాం. గత ప్రభుత్వం కాంట్రాక్టర్ల అగ్రిమెంట్ లు క్లోజ్ చేయలేదు. రివర్స్ టెండరింగ్,జ్యుడిషియల్ ప్రివ్యూ తీసుకొచ్చింది. న్యాయపరమైన సమస్యలు లేకుండా ముందుకెళ్లేందుకు ఇంత సమయం పట్టింది. 43 వేల కోట్ల పనులను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తారు. అమరావతి రాజధాని పునఃప్రారంభం ప్రధాని చేస్తారు. మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి చేస్తాం. నిన్న రైతులతో సీఎం రెండుగంటలపాటు మాట్లాడారు. 29 గ్రామాల రైతులను ప్రధాని సభకు రావాలని సీఎం స్వయంగా ఆహ్వానించారు. అమరావతిపై పార్లమెంట్ లో చట్టం చేయాలని రైతులు అడిగారు. చట్టబద్ధత అంశాన్ని పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారని అన్నారు.

# ప్రభుత్వ వైద్య కాళాశాలకు తాళాలు

రంగారెడ్డి

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలకు భారత్ కాలేజ్ యాజమాన్యం తాళం వేసింది. కళాశాల అద్దె చెల్లించకపోవడంతో కాలేజీ బోర్డ్ ను భారత్ కాలేజీ యాజమాన్యం తొలగించింది. మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాల కు కేటాయించాల్సిన భవనం సరైనా వసతులులేక ఇబ్బందులకు గురవుతున్నామని అధ్యాపకులు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల అద్దెను కాలేజ్ ప్రారంభం నుండి ఇవ్వకపోవడం వలనే కళాశాలకు తాళం వేసినట్లు భారత్ కాలేజ్ యాజమాన్యం వాదించింది.

# విద్యావిధానాలు మార్పు దిశగా అడుగులు

హైదరాబాద్, ఏప్రిల్ 29

తెలంగాణ రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం (2025-26)లో 1వ తరగతి నుంచి 10 తరగతుల వరకు పరీక్షా విధానంలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ప్రతీయేటా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగా అకడమిక్ క్యాలెండర్ ప్రకటించాల్సి ఉంది. అయితే, విద్యాశాఖ అధికారులు అకడమిక్ క్యాలెండర్ ను రూపొందించారు. ప్రతిపాదన క్యాలెండర్ ను ప్రభుత్వానికి పంపనున్నారు.ప్రతియేటా సమ్మేటివ్ అసెస్మెంట్ (ఎస్ఏ-1) పరీక్ష దసరా సెలవుల కంటే ముందే నిర్వహిస్తారు. అయితే, వచ్చే విద్యా సంవత్సరంలో దసరా సెలవుల తరువాత ఎస్ఏ-1 పరీక్ష నిర్వహించాలని ఎస్సీఈఆర్టీ నిర్ణయించింది. ఈసారి దసరా పండుగ ముందుగా వస్తున్నందున పండుగ సెలవుల తరువాత అక్టోబర్ చివరి వారంలో ఎస్ఏ-1 పరీక్ష జరపాలని నిర్ణయించారు.ప్రతీయేటా ఫార్మేటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ) పరీక్షలు నాలుగు దఫాలుగా జరుగుతాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి వాటిని రెండుకు తగ్గించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి సంకేతాలు రాకపోవటంతో ఎప్పటిలాగే నాలుగు సార్లు ఎఫ్ఏ పరీక్షలు ఉండేలా అకడమిక్ క్యాలెండర్ ను విద్యాశాఖ అధికారుల రూపొందించారు. ప్రతీయేటా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు జయశంకర్ బడిబాటను జూన్ 1 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ముందుగా నిర్వహించాలని తొలుత భావించినా.. అకడమిక్ క్యాలెండర్ లో మాత్రం యథావిధిగానే బడిబాట కార్యక్రమం నిర్వహించేలా పొందుపర్చినట్లు తెలిసింది.ప్రతిపాదన క్యాలెండర్ ను అధికారులు ప్రభుత్వానికి పంపించనున్నారు. అయితే, ప్రభుత్వం ఏమైనా మార్పులు చేస్తుందా..? ఎస్ఏ-1, ఎఫ్ఏలలో ఏమైనా మార్పులు చేస్తుందా.. యథావిధిగా అమోదం తెలుపుతుందా అనేది వేచి చూడాల్సిందే.

===============

# లబ్ధిదారుల్లో అయోమయం

నిజామాబాద్, ఏప్రిల్ 29,

పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఇళ్ల నిర్మాణం విషయంలో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపే ఇళ్లను నిర్మించాలని షరతు విధించడంతో ఈ పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో మొదటి విడతగా 70,122 ఇళ్లకు అనుమతులు ఇవ్వగా.. 2,830 మంది లబ్ధిదారులు ఇప్పటికే పునాది పనులు పూర్తి చేశారు. అయితే వీరిలో దాదాపు 280 మంది 600 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారని అధికారులు గుర్తించారు.దీంతో వారికి మొదటి విడత బిల్లు రూ.లక్షను విడుదల చేయడానికి అధికారులు నిరాకరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునాదిలో మార్పులు చేసుకుంటేనే బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. దీనిపై లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సొంత స్థలాలు ఉన్నవారు తమకు నచ్చిన విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకోవచ్చని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రభుత్వం అనేక సందర్భాల్లో చెప్పిందని వారు గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా, మోడల్ ఇళ్లను అందుబాటులో ఉంచి ఎలాంటి నిబంధనలు ఉండవని తెలిపిందంటున్నారు.ఇప్పుడు హఠాత్తుగా 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించాలని చెప్పడం సరికాదని అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో పాటు అదనంగా తాము కూడా డబ్బులు ఖర్చు చేసుకుంటున్నామని, ఇప్పుడు నిబంధనలు విధిస్తే ఎలా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. అయితే 600 చదరపు అడుగులు దాటితే బీపీఎల్ పరిధిలోకి రారని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి పేదల ఇళ్లను 400 చదరపు అడుగుల్లోనే నిర్మించాలని.. ప్రభుత్వం అదనంగా 200 చదరపు అడుగులకు పెంచిందని గృహ నిర్మాణ శాఖ పేర్కొంటోంది. ఈ మేరకు ఇండ్ల నిర్మాణాలు చేపడితేనే బిల్లులు వస్తాయని క్లారిటీ ఇచ్చారు.ఇక మే 5వ తేదీలోపు ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఈ మేరకు ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు ఉండాలనే నిబంధనను విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా యంత్రాంగాలకు గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ ఇంటి నిర్మాణాలను చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఏనుగుల కదలికలపై అధికారులు అప్రమత్తం

తిరుపతి

తిరుపతి ప్రాంతంలో ఇటీవల ఏనుగుల కదలికలను గమనించిన దృష్ట్యా మరియు ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, పిసిసిఎఫ్(హెచ్ఓఎఫ్ఎఫ్)స్పష్టమైన ఆదేశాల మేరకు, అటవీ శాఖ ప్రత్యేక ఏనుగుల టాస్క్ ఫోర్స్ను ఏర్పాటు చేసింది. ఈ ముందస్తు చర్య ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించడం, స్థానిక వన్యప్రాణులను రక్షించడానికి నివారణ వ్యూహాలను అమలు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.డిఎఫ్ఓ, తిరుపతి నేతృత్వంలోని ప్రత్యేక బృందంతో పాటు, డిఎఫ్ఓ, చిత్తూరు, స్క్వాడ్ డిఎఫ్ఓ, పిలేరు, స్క్వాడ్ డిఎఫ్ఓ, తిరుపతి మరియు సంబంధిత ఫారెస్ట్ రేంజ్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేస్తారు. పంట నష్టాన్ని నివారించడానికి, సంభావ్య ఘర్షణలను తగ్గించడానికి మరియు నివాసితులందరి భద్రత మరియు శ్రేయస్సును నిర్ధారించడానికి పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్ మరియు వైద్య శాఖలు సహా ఈ సమన్వయంతో కూడిన విధానాన్ని అనుసరిస్తారు.

# 30న టెన్త్ రిజల్ట్స్

హైదరాబాద్, ఏప్రిల్ 29

తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదలకు రంగం సిద్ధమైంది. ఒకటి రెండు రోజుల్లోనే రోజుల్లోనే రిజల్ట్స్‌ను విద్యాశాఖ ప్రకటించనున్నట్లు సమాచారం. విడుదల తేదీని ఖరారు చేయాలని కోరుతూ పరీక్షల విభాగం ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలుస్తోంది. అఓ రేవంత్ రెడ్డి ఆమోదం లభించగానే ఫలితాలను విడుదల చేస్తారు. త్వరలో అధికారికంగా ఫలితాల విడుదల తేదీ ఖరారు కానుంది. అనంతరం వెంటనే తెలంగాణ ట్రిపుల్ఐటీ నోటిఫికేషన్ 2025 విడుదల కానుంది. 10వ తరగతిలో మంచి మార్కులతో పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజల్ట్స్ చెక్ చేసుకోవడానికి డైరెక్ట్ లింక్ ఇదే.పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఎస్ఎస్‌సీ బోర్డు అధికారిక వెబ్‌సైట్ / ద్వారా తమ ఫలితాలు చెక్ చేసుకోవచ్చు. అంతే కాకుండా ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు. విద్యార్థి దశలో 10వ తరగతి పరీక్షలు భవిష్యత్తుకు ఎంత కీలకమైనవో మనందరికీ తెలిసిందే. కెరీర్‌కు పునాదులు వేసుకునే క్రమంలో పదో తరగతి అనేది ఎంతో కీలకమైంది. అందుకే విద్యార్థులు, తల్లిదండ్రులు టెన్త్ పబ్లిక్ పరీక్షలంటే ఎంతో శ్రద్ధ చూపెడతారు.ఫలితాల అనంతరం విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకుంటారు.. అందుకే.. పదో తరగతి ఫలితాలపై ఎప్పుడూ ఉత్కంఠ ఉంటూనే ఉంటుంది. ఈక్రమంలో తెలంగాణ పదో తరగతి ఫలితాలు ఎప్పుడు విడుదలవుతాయా అని విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫలితాలు విడుదల తర్వాత ఇంటర్మీడియట్, ట్రిపుల్ ఐటీ, డిప్లొమా తదితర కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్ణయం తీసుకుంటారు.తెలంగాణలో మార్చి 21వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 2 తో ముగిశాయి. మొత్తం 2,650 కేంద్రాల్లో రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు టీఎస్ ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలు రాసినట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో క్వశ్చన్ పేపర్ లీకేజీ ఘటనలు మినహా పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో.. తెలంగాణ ఎస్ఎస్‌సీ బోర్డు ము?ల్యాంకనం నిర్వహించి ఆ ప్రక్రియను సైతం విజయవంతంగా ముగించింది.10బిష్ట్ర పరీక్షలను నిర్వహించిన ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ ఏప్రిల్ 7వ తేదీ నుండి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 19 శిబిరాల్లో సమాధాన పత్రాల స్పాట్ మూల్యాంకనాన్ని నిర్వహించింది. అనంతరం మరోసారి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా రీచెక్ చేసి ఫలితాలు కంప్యూటరీకరణ ప్రక్రియ సైతం పూర్తి చేశారు. అయితే.. ప్రభుత్వ అనుమతి రాగానే టీఎస్ ఎస్ఎస్‌సీ ఫలితాలు విడుదల చేయనున్నట్లు సమాచారం.

# అద్భుత ఫలితాల పర్వదినం అక్షయ తృతీయ -హిందువులందరికీ అక్షయ తృతీయ శుభాకాంక్షలు

అక్షయ తృతీయ వైశాఖ శుద్ధ తదియనే అక్షయ తృతీయ గా వ్యవహరిస్తారు. అక్షయ అంటే తరగనిది, క్షయం లేనిది అని అర్థం. మహాభారతంల్లో అక్షయపాత్ర పేరు ప్రస్తావనకు వస్తుంది. ఈ పాత్ర ఉన్నవారి ఇంటికి ఎంతమంది అతిథులు వచ్చినా కావాల్సినంత ఆహారాన్ని ఇస్తుందని పురాణాలు చెబుతున్నాయి. వైశాఖ మాసం శుక్లపక్ష తదియను అక్షయ తృతీయగా పురాణాలు పేర్కొన్నాయి. త్రేతాయుగం ప్రారంభం, మహాభారత రచన ఈ రోజునే మొదలైంది. సంపదలకు అధిపతి కుబేరుడు శివుడ్ని ప్రార్థించగా లక్ష్మీ అనుగ్రహాన్ని ఈనాడే ఇచ్చినట్టు శివపురాణం తెలుపుతుంది. అక్షయ తృతీయ పండగ మన హిందువుల్లోనే కాకుండా జైనులలో కూడా చెపుకోతగ్గ పెద్ద పండగ. ఈరోజు ఏ పని ప్రారంభించినా విజయం సిద్ధిస్తుందని పండితుల మాట. ఈ పర్వదినాన ప్రజలు కొత్త పని ఏది ప్రారంభించినా అద్భుత ఫలితాలు దక్కుతాయని విశ్వాసం. అందుకే కొందరు ప్రజలు ఈ రోజు కొత్త ఆస్తులు, కొత్త వస్తువులు కొనుగోలు చెయ్యడం చేస్తారు. మహిళల్లో బంగారం కొంటె లక్ష్మీ దేవి తమతోనే ఉంటుందని నమ్మకం. అక్షయ తృతీయ నాడు ఎంతో కొంత బంగారం కొనేందుకు జనం ఎగబడతారు. ఈ రోజున బంగారాన్ని కొనుగోలు చేస్తే ఏడాది మొత్తం సంపద ఉంటుందన్న నమ్మకంతో బంగారాన్ని కొనుగోలు చేస్తారు. మహిళలకు బంగారం పట్ల ఉన్న సహజ ఆసక్తిని గుర్తించిన బంగారం షాపులు ఆకర్షణీయమైన ప్రకటనలతో , అక్షయ తృతీయరోజు అర్ధరాత్రి దాకా వ్యాపార్ని కొనసాగిస్తాయి. అయితే పండితులు మాత్రం అప్పుచేసి అక్షయ తృతీయనాడు బంగారం కొనవద్దని సలహానిస్తున్నారు. అక్షయ తృతీయ నాడు చేసిన ఏ పుణ్య కార్యానికైనా సరే నశించిపోవడం అన్నమాట ఉండదు. అక్షయ తృతీయ విశిష్టతలు×మన పురాణాలు, పండితులు చెబుతున్న అక్షయ తృతీయ విశిష్టతలు ఎన్నో ఉన్నాయి. వాటి వివరాలు క్లుప్తముగా?ఈ రోజే మహా విష్ణువు ఆరవ అవతారమైన పరశురాముని జననం.ఈ పవిత్ర దినానే త్రేతాయుగం ప్రారంభమైనదని పండితుల మాట.ఈరోజే సింహాచలం దివ్యక్షేత్రం లో సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం మరియు చందనోత్సవం ప్రారంభపు రోజు. ఆదిశంకరుల వారు ఓ పేద వృద్ధ జంట లబ్ది కోసం సృష్టిలో తొలిసారి "కనకధారాస్థవం" స్తుతించిన రోజు. ఈ పవిత్ర దినానే, దివ్య క్షేత్రం "బద్రీనాథ్" ఆలయ ద్వారాలు 4 నెలల దర్శన విరామం తర్వాత, పునః దర్శనార్థమై తెరుచుకోబడతాయి. ఏఏటికాఏడు ఒడిషా పూరి రథయాత్ర సంబరాల కొరకు నిర్మించే రథ నిర్మాణం ప్రారంబించే రోజు. గంగమ్మ భువి పై ఉద్భవించిన రోజు ఈ రోజే. అక్షయ తృతీయ నాడే వ్యాస మహర్షి "మహాభరతం" పవిత్ర గ్రంధాన్ని రచన ప్రారంబించిన రోజు. ఈ రోజే అమ్మ "అన్నపూర్ణ దేవి" అవతరించిన రోజు. అక్షయ తృతీయ పవిత్ర దినాన్నే కుబేరుడు శివానుగ్రహాన్ని పొంది మహలక్ష్మి ద్వారా అనంత సంపదను పొంది సంరక్షకుడిగా నియమింపబడ్డాడు. శ్రీకృష్ణుడు ద్రౌదపదిని దుశ్శాసునుడి నుండి కాపాడిన రోజు. శ్రీకృష్ణుడు తన బాల్యమిత్రుడైన కుచేలుడు తెచ్చిన అటుకులను ఆరగించి అపార సంపదను అనుగ్రహించిన రోజు. సూర్యభగవానుడు అజ్ఞాతవాసంలో పాండవులకు "అక్షయపాత్ర"ను ఇచ్చినరోజు. బృందావనంలోని బంకే బిహారి ఆలయంలో శ్రీకృష్ణుని పాదాలను దర్శించుకొనే అవకాశం ఒక్క అక్షయ తృతీయ రోజునే దక్కుతుంది.

# మందమర్రి సి.ఈ.ఆర్ క్లబ్ లో సింగరేణి క్వాటర్స్ కౌన్సిలింగ్



మందమర్రి, ఏప్రిల్ 29 (భారత శక్తి విలేకరి ): మంగళవారం సింగరేణి సూపర్వైజర్ కేటగిరి క్వార్టర్స్ కౌన్సిలింగ్ జరిగింది. ఈ కౌన్సిలింగ్ కు మందమర్రి ఏరియకు 20 క్వాటర్స్ ప్రకటించగా,10 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, సీనియార్టీ ప్రకారం 08 మందికి మందమర్రి ఏరియ సూపర్వైజర్ ఉద్యోగులకు పారదర్శకంగా సినియార్టీ ప్రకారం క్వార్టర్స్ కేటాయించడం జరిగిందని పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్ గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్,డి.వై.పి.ఎం మైత్రేయ బంధు,మేనేజ్మెంట్ ట్రైని ఐ.ఇ.డి శ్యామ్, పాల్గొన్నారు.

# స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ సందర్శించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) ఏప్రిల్ 29:హైదరాబాద్ పట్టణంలోని జూబ్లీహిల్స్ లో జరుగుతున్న స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఫోటో గ్యాలరీని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి , మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ , మాజీ ఎమ్మెల్యేలు డా.గాదరి కిశోర్ కుమార్ , ఆర్.రవీంద్ర కుమార్ , ఎన్.భాస్కర్ రావు, కంచర్ల భూపాల్ రెడ్డి రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి , రేగట్టే మల్లిఖార్జున రెడ్డి , ప్రసన్న రాజ్ , సంజీవ నాయక్ లతో కలిసి సందర్శించారు.

# క్షేత్రపాలకుడు శ్రీ ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకములు



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) ఏప్రిల్ 29:హుజూర్ నగర్ మండలంలోని బూరుగడ్డ శ్రీ ఆది వరాహ లక్ష్మి నరసింహ వేణుగోపాల స్వామి దివ్య క్షేత్రములో క్షేత్రపాలకుడు శ్రీ ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకము, 108 తమల పాకులచే ఆకుపూజ, గంధ సింధూరము, పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడమాల, ప్రసాద నివేదనలతో పూలదండ అలంకరణ సహిత పూజా కార్యక్రమములను మంగళవారం భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్య, ధర్మకర్తలు గంధం అంజయ్య, తిపిరిశెట్టి హరీష్ కుమార్. వేముల నరసింహారావు.కోలా కృష్ణ ప్రసాద్ పెనుబెల్లి హనుమంతరావు. మేరిగా కవిత, మరియు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణ రావు, ఆలయ అర్చకులు ముడుంబై హరీష్ కుమారా చార్యులు, మరియు యరగాని గురవయ్య. పవన్ కుమార్, ప్రదీప్, సురేష్, చంద్రయ్య, మరియు అనసూర్యమ్మ, లక్ష్మీ, పద్మ, కవిత, మరియుఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లా జర్నలిస్టులకు జ్యోతిరావు పూలే

## జాతీయ ఐకాన్ అవార్డు - 2025



మందమర్రి, ఏప్రిల్ 29 (భారత శక్తి): మంచిర్యాల జిల్లాకు చెందిన జర్నలిస్టులు రాష్ట్రస్థాయిలో విశేష గౌరవం పొందారు. రాజమండ్రి లో జరిగిన మహాత్మ జ్యోతిరావు పూలే జాతీయ అవార్డు కార్యక్రమంలో ఉ త్తమ జర్నలిస్టుల విభాగంలో, రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన పిల్లి రవికిరణ్, మందమర్రి పట్టణానికి చెందిన మహమ్మద్ ఖాసీం, జాడ క్రాంతి కుమార్ ను మహాత్మ జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ అవార్డు - 2025తో సత్కరించారు. ఈ అవార్డులు, ప్రజల సమస్యలను, సామాజిక అంశాలను స్పష్టంగా ప్రజల ముందుకు తీసుకురావడంలో వీరి నిరంతర కృషిని గుర్తించి ఇచ్చాయి. అవార్డు అందుకున్న రవికిరణ్, ఖాసీం, క్రాంతి కుమార్. ఈ గౌరవం తమకు మరింత బాధ్యతను పెంచిందని, "ప్రజల వాస్తవ పరిస్థితుల ను వెలికితీసేందుకు, న్యాయమైన సమాచారాన్ని అందించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని" తెలిపారు. ఈ అవార్డులతో, మంచిర్యాల జిల్లా జర్నలిస్టులకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు లభించిందని పలువురు అభిప్రా యపడ్డారు. ఈ సందర్భంగా, స్థానిక ప్రజలు, స్నేహితులు, జర్నలిస్టులు అవా ర్డు పొందిన వారిని అభినందించారు. "ఈ అవార్డులు మా పని ప్రాముఖ్యతను పెంచాయి. ప్రస్తుతం జరుగుతున్న సమస్యలు, సామాజిక అంశాలు ప్రస్తావి స్తూ, ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించడం మాకు కీలకమైన ధ్యేయం గా ఉంటుంది," అని అవార్డు పొందిన జర్నలిస్టులు తెలిపారు. ఈ కార్యక్రమం లో పలువురు ప్రముఖులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# నోరు అదుపులో ఉంచుకో,ఖబడ్దార్ నాగజ్యోతి:జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగ కళ్యాణి



గోవిందరావు పేట/ములుగు జిల్లా ప్రతినిధి,ఏప్రిల్29 (భారత శక్తి): మంత్రి సీతక్క ను విమర్శించే స్థాయి, అర్హత నీకు లేదు, ఖబడ్దార్ నాగజ్యోతి నోరు అదుపులో ఉంచుకుని మాట్లాడు, మేము మాట్లాడగలమని ములుగు జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగ కళ్యాణి అన్నారు. గోవిందరావు పేట మండల కేంద్రంలో మండల అధ్యక్షురాలు మద్దాలి నాగమణి ఆధ్వర్యాన మంగళవారం మహిళా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగ కళ్యాణి హాజరై మాట్లాడారు. ములుగు నియోజకవర్గ బి.ఆర్.ఎస్.పార్టీ ఇంచార్జి బడే నాగజ్యోతి సీతక్క ను విమర్శిస్తూ మాట్లాడే అర్హత కానీ స్థాయి కానీ లేదని హెచ్చరించారు. బడే నాగజ్యోతి సీతక్క ను విమర్శిస్తే పెద్ద నాయకురాలు అవుతారనే భ్రమలో ఉన్నారని, అధికారం కోల్పోయిన దగ్గరి నుండి కొందరు బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు మతి భ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. బడే నాగజ్యోతి కి రాజకీయ బిక్ష పెట్టిందే సీతక్క ఆ విషయంమర్చిపోయి.మాట్లాడుతున్నారని విమర్శించారు.పదేండ్ల బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలో ఐదేండ్లు ములుగు జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్, చైర్మన్ పదవుల్లో ఉన్న కూడా ములుగు జిల్లాను ఎంత మేర అభివృద్ధి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే పదేండ్ల పాలనలో బి.ఆర్.ఎస్. పాలనలో ములుగు ఎంతమేరకు అభివృద్ధి చేసిందో, ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. కావాలని కొందరు నాయకులు సీతక్క ను విమర్శిస్తే పెద్ద నాయకులు అవుతారనే భ్రమలో ఉన్నారని, ప్రజా సమస్యల పైన పోరాటం చేయాలనే ఆలోచన లేకుండా ఉన్నారని అన్నారు. బి.ఆర్.ఎస్.పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో 25 సంవత్సరాల నుండి బి.ఆర్.ఎస్. పార్టీ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలి కానీ అధికార పార్టీ గురించి మాట్లాడితే అది రజతోత్సవ సభ ఎలా అవుతుందని,అది రాజకీయ సభ అవుతుందని అన్నారు. సీతక్కను సీతమ్మ అని సంబోధించడం సరి కాదని, చిన్న, పెద్ద అనే తేడాలు కూడా పాటించాలని నాగజ్యోతి కి హితవు పలికారు.ములుగు నియోజకవర్గంలో నాలుగు వందల కోట్లతో అభివృద్ధి జరిగిందని, ఇంకా 5 వందల కోట్ల నిధులతో అభివృద్ధికి పనులు జరగాల్సి ఉందని అన్నారు. ఇకనైన సీతక్క ను విమర్శించడం మానేసి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు ప్రజా సమస్యలపై స్పందించని వాళ్లు నేడు ప్రజా సమస్యల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. సీతక్క కార్లలో తిరుగుతుందని మీరు అనడం వింతగా ఉందని, మీ బి.ఆర్.ఎస్.పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ల్యాండ్ క్రూజర్ కార్లు కొనుగోలు చేసిన సంగతి మరచిపోయినట్టు ఉన్నారని విమర్శించారు. అధికారం కోల్పోయాక మతి భ్రమించిందనీ ఎద్దేవ చేశారు. సీతక్క గురించి మాట్లాడే అర్హత నాగజ్యోతి కి లేదని, ఇంకోసారి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గోవిందరావు పేట మండల మహిళా నాయకులు సూదిరెడ్డి జయమ్మ, గుండెబోయిన నాగలక్ష్మి, చొప్పదండి వసంత, తోకల అహల్య, ల్యాగల అనిత, గురుకు మేరీల, గోపిదాసు వజ్రమ్మ, మిరియాల సోమలక్ష్మి, పుష్ప తదితర నాయకులు పాల్గొన్నారు.

# నూతన వధువు హేమ ను ఆశీర్వదించిన షేక్ సైదా వల్లపు దాసు కృష్ణ



సూర్యాపేట జిల్లా బ్యూరో(భారత శక్తి) ఏప్రిల్29:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలోని 19వ వార్డ్ శ్రీనగర్ కాలనీకి చెందిన రాయిరాల సుందరం కుమార్తె ప్రధానం వివాహ ఫంక్షన్ కార్యక్రమంలో హుజూర్ నగర్ నియోజకవర్గం మైనార్టీ ప్రెసిడెంట్ షైక్ సైదా మరియు గౌడ సొసైటీ ప్రెసిడెంట్ 19 వార్డ్ కాంటెస్టర్ కౌన్సిలర్ వల్లపు దాసు కృష్ణ గౌడ్ లు పాల్గొని నూతన వధువు రాయిరాల హేమ కు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో రాయిరాల చౌరి, రాయిరాల నారయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# చికాగో అమరవీరుల స్పూర్తితో పోరాడుదా%శీ%,139వ మేడే దినోత్సవాన్ని జరుపుకుందాం: బంటు శ్రీనివాస్.



మంచిర్యాల,ఏప్రిల్ 29 (భారతశక్తి):భారతదేశంలో ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో పనిచేసే సంఘటిత రంగ కార్మికులు ఐదు కోట్ల మంది ఉన్నారని బంటు శ్రీనివాస్తెలిపారు.40 కోట్ల మంది ప్రైవేటు రంగ పరిశ్రమల్లో పనిచేసే అసంఘటిత కార్మికులుగా వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. సంఘటిత రంగ కార్మికులకు ఉన్నా కార్మిక చట్టాలు, హక్కులు అమలు కావడం లేదు. అసంఘటిత కార్మికుల పరిస్థితి రోజురోజుకు మరింత దయనీయంగా మారుతున్నది. దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభానికి గురైన తర్వాత దేశవ్యాప్తంగా ప్రజలు బ్రతుకుదెరువు కోసం పల్లెల నుండి పట్టణాల బాట పట్టారు. నగరాల్లో భవన నిర్మాణ, ఇతర రంగాల్లో వలస కార్మికులుగా నిర్బంధ కార్మికులుగా పనిచేస్తున్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండానే కోట్లాదిమంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయలేదని వాపోయారు.మతోన్మాద ఫాసిస్ట్ బిజేపి కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పోరేట్ సంస్థలకు పెట్టుబడుదారులకు అనుకూల విధానాలకు తీసుకొచ్చింది. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాడు చేయకపోగా, అమ్మడం కోసం ప్రత్యేకంగా ఒక శాఖనే ఏర్పాటు చేసింది. ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మకానికి పెట్టింది. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకోవలసిన బాధ్యత కార్మిక వర్గంపై వున్నది. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను తొలగించి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ను తీసుకువచ్చింది. పోరాడి సాధించుకున్న హక్కులను చట్టాలను తుంగలో తొక్కి పార్లమెంట్లో చర్చలేకుండానే ఆమోదం చేసుకుంది. కార్మిక చట్టాలను తొలగించి కార్మికులకు ద్రోహం చేసింది. కార్మిక చట్టాలను, కార్మిక హక్కులను కాలరాసింది. కార్మికుల రక్తతర్పణతో హక్కుగా సాధించి పెట్టిన 8 గంటల పని విధానాన్ని కార్పోరేట్ సంస్థలు అమలు చేయడం లేదు. పెట్టుబడిదారులు కంపెనీల్లో 10 గంటలు 12 గంటలు పనిచేయిసస్తూ శ్రమ దోపిడికి గురిచేస్తున్నారు. మహిళ కార్మికులకు మౌళిక వసతులు కల్పించడం లేదు. పనిభద్రత లేదు. మహిళలకు రక్షణ లేదు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పును కూడా అమలు చేసే స్థితిలో లేదు. 1992లో కేంద్రంలో కాంగ్రెస్పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆనాటి ప్రధాని పి.వి.నర్సింహరావు నూతన ఆర్థిక విధానాలకు అమల్లోకితీసుకురావడం జరిగింది. నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా కొత్తగా రెగ్యులర్ ఉద్యోగాలకు అవకాశం కల్పించకుండా ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్దతుల్లో ఉద్యోగ నియామకాలను తీసుకువచ్చింది. ప్రభుత్వాలు అత్యవసర సేవలు ఔట్సోర్సింగ్ సిబ్బందిని నియమించి వారిని మధ్యలోనే తొలగిస్తున్నారు. ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు, ఉద్యోగ భద్రత లేదు. %ఖ్రాఫీ, జు×% కనీస పెన్షన్, చట్టభద్రత హక్కులు అమలు చేయాల్సి ఉంది. ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతన చట్టాన్ని తీసుకువచ్చాయి. కాని వాటిని అమలు చేసే పరిస్థితి లేదు.26 వేల రూపాయలు కనీస వేతనంగా గుర్తించాలి. కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పోరేట్ సంస్థలకు దోచిపెడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయి. కాకులను కొట్టి గద్దలకు వేసినట్టుగా, కార్మికుల పొట్ట కొట్టి పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారు. కార్మికులకు ద్రోహం చేస్తున్నారు. రేక్కాడితే కాని డొక్కాడనీ కార్మికులు ఐక్యం కావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కాపాడుకుందామని అన్నారు. కార్మికులకు న్యాయమైన వేతనం, సురక్షిత పని వాతావరణం, మరియు గౌరవం వేతనం కోసం పోరాడుదాం. చికాగో అమరవీరుల స్పూర్తితో కార్మికుల సమరశీల పోరాటాలకు సిద్ధం అవుదాం. కార్మికుల హక్కుల కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని. తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య %టూఖూ% రాష్ట్ర కమిటీ పిలుపు నిస్తుంది. మేడే దినోత్సవాన్ని గ్రామాల్లో, నగరాల్లో, వాడవాడలో జరపాలని పిలుపునిస్తున్నామని తెలిపారు.

డిమాండ్స్:1. అసంఘటిత కార్మిక రంగాలకు సమగ్రమైన చట్టం చేయాలి.

2. కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్ను రద్దు చేయాలి.

3. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి.

4. పని స్థలాల్లో మహిళలకు మౌలికమైన సౌకర్యాలు కల్పించాలి.

5. మూతపడిన పరిశ్రమలు తెరిపించి యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని బంటు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# మందమర్రి లో నూతన సేవాదళ్ కమిటీ



మందమర్రి, ఏప్రిల్ 29 (భారతశక్తి విలేఖరి ):మందమర్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చెన్నూరు శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు సేవాదళ్ కమిటీతో నూతన సేవాదళ్ కార్యవర్గ నియామకం నిర్వహించారు. మంచిర్యాల జిల్లా సేవాదళ్ అధ్యక్షులు హఫీస్, మందమర్రి పట్టణ సేవాదళ్ అధ్యక్షులు సాతుకు ఉదయ్ మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్ సీనియర్ నాయకులు సోతుకు సుదర్శన్ పుల్లూరి లక్ష్మణ్ ల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయడం జరిగింది. సేవాదళ్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ గా ఆలం శంకర్, సేవాదళ్ జనరల్ సెక్రెటరీ రామసాని సురేందర్, టౌన్ సెక్రటరీ భూకాల సంతోష్, టౌన్ సెక్రటరీ మాన్యాల శివకుమార్, టౌన్ జాయింట్ సెక్రెటరీ గులాం మహమ్మద్ దస్తగిరి పాషా లను నియమించడం జరిగింది. ఈ నియామక పత్రాలను పట్టణ కాంగ్రెస్ నూతన సేవాదళ్ సభ్యులు మాట్లాడుతూ మాకు ఈ అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం సేవాదళ్ సభ్యులుగా మా వంతు సహాయం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు నర్సోజి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నెరువట్ల శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు కనకం రాజు, బూడిద శంకర్, మంద తిరుమల్, రాచర్ల గణేష్, మాయా తిరుపతి రెడ్డి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్వేనెంబర్ 364 లో ప్రభుత్వ భూమి మాయం, భూమి కబ్జా అయ్యిందా?

## -అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితాలు శూన్యం.

## -అసలు రికార్డులు భద్రంగా ఉన్నాయా?

మంచిర్యాల, ఏప్రిల్ 29 (భారత శక్తి ప్రతినిధి):

ప్రభుత్వ భూములు దర్జాగా కబ్జా అవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం అందుగులపేట శివారులో సర్వే నంబర్ 364 లో 1బి30 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో రియల్ వ్యాపారుల కన్నులు ఈ భూమిపై పడ్డాయి. అదే అదునుగా భావించిన సదరు రియల్ వ్యాపారులు ప్రభుత్వ భూమిని ఆనుకుని ఉన్న సదరు భూమిని సాదా బైనామాలో నోటరీ ద్వారా కొనుగోలు చేసి సర్వే నంబర్ 364



భూమిని కబ్జా చేసినట్టు తెలుస్తుంది. దీనిపై బహుజన్ సమాజ్ పార్టీ ఇంచార్జ్ ముల్కల రాజేంద్రప్రసాద్ గతంలోనే కలెక్టర్ తదితరులకు వినతి పత్రాలు కూడా అందజేయడం జరిగింది. రోజులు గడుస్తున్న కూడా సదరు 364 సర్వేనెంబర్ లోని భూమిని రికవరీ చేసిన దాఖలాలు మాత్రం కనిపించడం లేదు. అసలు అక్కడ భూమి ఉందా? లేదనే సందేహాలు పట్టణ ప్రజల్లో నెలకొంది

ఎందుకంటే మందమర్రి, చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రభుత్వ భూమి యదేచ్చగా కబ్జా అవుతున్న అధికారులు దృష్టి పెట్టడం లేదనే భావన ప్రజల్లో నెలకొంది.

# భూ భారతి చట్టం పై ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 29: 14 ఏప్రిల్ 2025 నుండి మీ సేవా కేంద్రంలో భూ సమస్యలపై దరఖాస్తు సమర్పిస్తే భూ భారతి చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని,

భూ భారతి చట్టం పై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులను జిల్లాలో ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా మంగళవారం డోంగ్లీ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో , మద్నూర్ రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెక్షన్ 4 ప్రకారం హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉండి రికార్డుల్లో లేని వారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరంలో గా దరఖాస్తు చేసుకోవచ్చు.

సెక్షన్ 5 ప్రకారం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

సెక్షన్ 6 ప్రకారం సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని, 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామ ద్వారా కొనుగోలు చేసిన క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్ , స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. అట్టి వాటిని రికార్డు లలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్త ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ తరహాలో








రైతులకు భూదార్ కార్డుల జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉ ంటే నివృత్త చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ధరణీలో అప్పీలు కు ఆస్కారం లేనందున సివిల్ కోర్టుకు వెళ్ళవలసి ఉండేదని, ప్రస్తుతం తహసీల్దార్ ఇచ్చిన తీర్పులో అభ్యంతరం ఉంటే ఆర్డీఓ కు, ఆర్డీఓ తీర్పులో అభ్యంతరం ఉంటే కలెక్టర్ కు అప్పీలు. చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. హక్కుల రికార్డుల్లో ఉన్న వ్యక్తి లైసెన్సు గల సర్వేయర్ తో భూమి సర్వే చేయించుకొని మ్యాప్ తయారు చేయించుకున్నట్లయితే మండల సర్వేయర్ సరి చూసిన తర్వాత తహసీల్దార్ పాసుపుస్తమలో సర్వే మ్యాప్ ను ఉంచడం జరుగుతుందన్నారు. ఏ మైన భూ సమస్య ఉ ంటే సదరు పార్టీలకు నోటీసులు జారీ చేయాలని ఎవిడెన్స్ రికార్డు చేయాలనీ స్పీకింగ్ ఆర్డర్స్ స్పష్టమైన రీమార్కులతో నమోదు చేయాలని తెలిపారు. ప్రస్తుతం మీ సేవలో దరఖాస్తు పెడితే భూ భారతి చట్ట ప్రకారం విచారణ చేపట్టి నిర్ణీత సమయంలోగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలపై విచారణ చేసి స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టం లింగంపేట్ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుచున్నదని తెలిపారు. ప్రజలందరూ భూ భారతి పై అవగాహన కల్పించుకోవాలని అన్నారు.

సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, భూములకు సంబంధించిన సమస్యలకు చట్టం వచ్చిన ఒక సంవత్సరంగా దరఖాస్తు సమర్పించాలని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిల్లో పరిష్కారం చేసుకోవచ్చు అని తెలిపారు. సాదాబైనామా, మ్యుటేషన్, సక్సెషన్, వంటి అంశాలపై వివరించారు.

ఆయా అవగాహన సదస్సులలో పలువురు రైతులు ప్రసంగించారు.

అంతకుముందు చట్టం పై రూపొందించిన వివరాలను ఆయా తహసీల్దార్లు వివరించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు భూ భారతి పై రూపొందించిన వీడియో ప్రదర్శించారు.

ఈ సదస్సులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, పాక్స్ చైర్మన్లు, ఆయా మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు, పలువురు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## జైలు నుండి బయటకు వచ్చే దొంగలపై నిఘా పెట్టాలి: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఏప్రిల్29:దొంగతనాలను కట్టడి చేసేందుకు చోరీ కేసుల్లో శిక్ష అనుభవించి జైలునుండి బయటకు వచ్చే దొంగలపై నిఘా పెట్టాలని కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చారు. మార్చ్ నెల సంబంధించి




నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయములో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గోన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో వున్న కేసులను సమీక్ష జరిపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోని, కేసుల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్ పిలిపించడం కాకుండా, అధికారులు రౌడీ షీటర్లను వ్యక్తిగతం కలుసుకోవడం లేదా పరిసరాల్లో వుండే వారి నుండి రౌడీ షీటర్ ప్రస్తుత స్థితిగతులను అరా తీయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో సిసి కెమెరాలు కీలకంగా నిలుస్తున్నాని, ఇందుకు గాను పోలీస్ స్టేషన్ పరిధిలో కెమెరా పనితీరుపై అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని.కొత్త సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, పోలీస్ స్టేషన్ ల్లో పని చేసే మహిళా సిబ్బందితో అన్ని రకాల విధుల్లో రాణించే విధంగా వారిని ప్రోత్సహించడంతోపాటు మహిళా సిబ్బందిలో స్టేషన్ అధికారులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని. జాతీయస్థాయిలో గుర్తింపు, అవార్డులు తీసుకొచ్చే విధంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ ఉండాలని, రేయి పగలు ప్రజల కోసం పనిచేయాల్సి ఉంటుందని పోలీస్ శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చే పోలీసు అధికారులకు రివార్డులు అవార్డులు ఉంటాయని పోలీస్ కమిషనర్ అధికారులకు తెలిపారు.

ఈ సమావేశంలో డీసీపీలు రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనార్దన్, జనగాం ఏఎస్పీ చ్కెతన్య, ఏ.ఎస్పీ మనాన్‌భట్, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

## గంజాయి అమ్ముతున్న వ్యక్తి పట్టివేత రిమాండ్ పట్టణ సీఐ గోపీనాథ్.

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 29:నిర్మల్ జిల్లా భైంసా టౌన్ సీఐ గోపీనాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.భైంసా ఎస్సై కే. గణేష్, మరియు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ అహ్మద్, పోలీస్ కానిస్టేబుల్ ఎస్. ప్రమోద్, శరత్, హరిబాబు, బాలాజీ, రెవెన్యూ సిబ్బంది మరియు నిర్మల్ జిల్లా క్లూస్ టీం లు సంయుక్తంగా నిర్వహించిన రైడ్ లో భాగంగా నిషేదిత గంజాయి అమ్ముతున్న ముజామ్మిల్ హుస్సేన్,వయసు: 33 సం.లు, నివాసం: ఒవైసీనగర్, భైంసా టౌన్, అని ఇంతకు మునుపు పవార్ వాడి, మలేగామ్, నాసిక్ జిల్లా, మహారాష్ట్ర .ఒక వ్యక్తిని పట్టుకోవడం జరిగిందని . అతను తన చేతిలో ఒక తెల్లటి కవర్ కలిగి ఉన్న ఒక వ్యక్తి పోలీస్ వాహనాలను చూసి పారిపోతుండగా పోలీస్ వారు అతన్ని వెంబడించి పట్టుకొని అదుపులోకి తీసుకున్న మన్నారు. అతని వద్ద నుండి సుమారు 1 కేజీ 140 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనపరచుకొని అతడిని జుడీష్యల్ రిమాండుకు పంపినట్లు పైసా పట్టణ సీఐ గోపీనాథ్ తెలిపారు.



## మాకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలి: సారంగపల్లి గ్రామస్తులు

మందమర్రి రూరల్, ఏప్రిల్ 29, (భారతశక్తి):

పేదవారికి సొంతింటి కలను నిజం చేయాలనే తపనతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇందిరమ్మఇండ్ల పథకాన్ని అమలు చేస్తుంది. దీనిలో భాగంగా మొదటి విడతలో కొన్ని ఇండ్లను నిరుపేదలకు కేటాయించేందుకు సిద్ధంగా ఉంది. అయితే మండల అధికారులు సిద్ధం చేసిన జాబితాలో మా పేర్లు లేవని మందమర్రి మండలంలోని సారంగపల్లి గ్రామస్తులు తమ బాధను వ్యక్తపరిచారు. వేము పూర్తిగా నిరుపేదలమని తప్పకుండా మాకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో మా పేర్లు చేర్చి మాకు కూడా ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చేయాలని అధికారులను వేడుకుంటున్నారు.



## గుండె పోటుతో హెడ్ పోస్ట్ మాన్ వెంకట రామారావు మృతి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 29:

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రధాన తపాలా కార్యాలయంలో హెడ్ పోస్ట్ మాన్ గా పని చేస్తున్న పోస్టల్ ఉద్యోగి వి. వెంకట రామారావు మంగళవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మాత్తుగా మృతి చెందినాడు. ఇప్పటికీ కుటుంబసభ్యులు, మిత్రులు, తోటి ఉద్యోగులు ప్రతి ఒక్కరూ వెంకట రామారావు పంతులు లేడనే విషయాని జీర్ణించుకోలేకపోతున్నారు. అందరితో కలిసి పోయే మనస్తత్వం, క్రమశిక్షణకు మారుపేరు గల హెడ్ పోస్ట్ మాన్ రామారావు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ప్రతి ఒక్కరిని ఈ సంఘటన తీవ్రంగా కలిసి వేసింది. వెంకట రామారావు స్వస్థలం హత్నూర గ్రామం. ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె కలదు. పోస్టల్ డిపార్ట్మెంట్ లో బ్రాంచ్ పోస్ట్మాస్టర్ గా, పోస్ట్మాన్ గా, హెడ్ పోస్ట్ మాన్ స్థాయికి ఎదిగారు. తపాల శాఖలో మంచి పేరు తెచ్చుకున్నారు. అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడంతో పోస్టల్ డిపార్ట్మెంట్ ఒక మంచి ఉద్యోగిని కోల్పోయింది. ఈ విషయం తెలుసుకున్న తపాలా ఉద్యోగులు చాలా మంది ఆయన ఇంటికి వెళ్ళి నివాళులర్పించారు.

ఈ క్రమంలో సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎల్.వి మురళి కుమార్ ఆయన నివాసానికి వెళ్లి విచారం వ్యక్తపరిచారు. అందరితో కలిసి మెలసి ఉంటూ, నిన్నటి వరకు మన మధ్య తిరుగుతూ ఉన్న



వెంకట రామారావు ఇంత అకస్మాత్తుగా మననుండి దూరం కావడం చాలా బాధాకరమని ఎస్పీ పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను అని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు.

హెడ్ పోస్ట్మాన్ రామారావు పెద్ద కుమారుడు లండన్ నుండి రావాల్సి ఉండడంతో బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు సంగారెడ్డిలో అంతక్రియలు నిర్వహించనున్నారు.

## భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై తాడ్వాయి మండలంలో అవగాహన సదస్సు

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 29: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుంది. ఇట్టి అవగాహన సదస్సు తేదీ 30/04/2025 మధ్యాహ్నం 1.00 గంటలకు తాడ్వాయి గ్రామము లోనీ రైతువేదికలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. కావున సంబంధిత మండలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులకు, రైతులకు మరియు ప్రజలకు ఈ సమావేశానికి ఆహ్వానించనైనది. కావున తాడ్వాయి మండల ప్రజలందరూ, పాత్రికేయ మిత్రులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులందరూ, ముఖ్యంగా రైతు శ్రేయోభిలాషులందరూ కలిసి ఇట్టి సమావేశాన్ని విజయవంతం చేయాల్సిందిగా తాడ్వాయి మండలాధికారులు కోరనైనది.

# ఐపీఎల్‌లో వైభవ్ రికార్డు.. కొడుకు క్రికెట్ కల కోసం పొలం అమ్మేసిన తండ్రి

: 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ( ఐపీఎల్ లో చరిత్ర సృష్టించాడు. అత్యంత పిన్నవయసులో శతకం బాదిన క్రికెటర్‌గా అవతరించాడు. కేవలం మూడో ఇన్నింగ్స్‌లోనే ఈ ఘనత సాధించడం విశేషం. నెట్స్‌లో ఒక రోజుకు 600 బంతులను ప్రాక్టీస్ చేసేవాడు. అయితే, అతడి క్రికెట్ కెరీర్ వెనక వైభవ్ తండ్రి శ్రమ ఉందనేది కాదనలేని సత్యం. వైభవ్ క్రికెట్ కలను నెరవేర్చేందుకు తనకున్న పొలాన్ని కూడా అమ్మేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ప్రపంచ రికార్డు సృష్టించడంతో వైభవ్ తల్లిదండ్రులకు ఇంతకుమించిన ఆనందం మరేదీ ఉండదు.




బిహార్‌కు చెందిన సంజీవ్ సూర్యవంశీ క్రికెటర్ కావాలని అనుకొనేవాడు. అయితే, కుటుంబ బాధ్యతల కోసం ఆటకు దూరం కావాల్సి వచ్చింది. అందుకే తన కొడుకు వైభవ్‌ను ప్రోత్సహించాడు. 2011లో జన్మించిన వైభవ్ 12 ఏళ్లకే అండర్-19 యూత్ టెస్టు మ్యాచులో సెంచరీ సాధించాడు. దీంతో రాహుల్ ద్రవిడ్ దృష్టిలో పడటంతో ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ.1.1 కోట్లకు దక్కించుకున్నారు. ఆడిన తొలి మ్యాచ్‌లో మొదటి బంతినే సిక్స్‌గా మలిచిన అతడు తన ఉద్దేశం ఏంటో బలంగా చాటిచెప్పాడు. ఇప్పుడు సెంచరీ సాధించిన వైభవ్ క్రికెట్ జర్నీ గురించి కోచ్ మనీశ్ ఓజా ఆసక్తికర విశేషాలను వెల్లడించారు.

తొమ్మిదేళ్ల వయసు నుంచి..

బిహార్‌లోని సమస్తిపుర్ నుంచి పట్నా వరకు దాదాపు 100 కి.మీ. ప్రయాణించి మరీ ప్రాక్టీస్‌కు వచ్చేవాడు. అప్పుడు అతడి వయసు తొమ్మిదేళ్లు మాత్రమే. "నా దగ్గరకు వచ్చేటప్పటికి వైభవ్ వయసు తొమ్మిదేళ్లు. రోజు మార్చి రోజు వంద కి.మీ.లు ప్రయాణించి మరీ వచ్చేవాడు. ఉదయం 7.30 గంటలకు మొదలుపెట్టి సాయంత్రం వరకు ప్రాక్టీస్ చేసేవాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్లేవాడు. ఇదే షెడ్యూల్‌ను దాదాపు నాలుగేళ్లపాటు పాటించేవాడు. బిహార్‌లో అతడికి మంచి పేరు వచ్చింది. దీని వెనక వైభవ్ తల్లిదండ్రులదే కీలక పాత్ర. అతడి తల్లి వేకువజామున 4 గంటలకు లేచి ఆహారం సిద్ధం చేసేవారు. వైభవ్‌ను తండ్రి సంజీవ్ ట్రైనింగ్‌లు, మ్యాచుల కోసం తీసుకొచ్చేవారు. మేం కేవలం కోచ్‌లుగా ఉన్నామంతే. ప్రతి విషయంలోనూ తల్లిదండ్రుల ప్రోత్సాహం అతడిని ముందుండి నడిపించింది. అండర్ -19 మ్యాచుల్లో ఓసారి రనౌట్ అయిన తర్వాత ఏడుస్తూ ఉన్న వైభవ్‌ను వీవీఎస్ లక్ష్మణ్ ఓదార్చాడు. పరుగులు ఎక్కువ చేయనందుకు బాధపడక్కర్లేదని.. తాము నైపుణ్యాలను మాత్రమే చూస్తామని భరోసా ఇచ్చాడు. ఆ తర్వాత ద్రవిడ్‌కు వైభవ్ గురించి వీవీఎస్ చెప్పడంతో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇవ్వగలిగాడు" అని తెలిపారు.

చాలా సంతోషంగా ఉంది: వైభవ్ అంకుల్ రాజీవ్ కుమార్

"మా గ్రామస్థులంతా చాలా సంతోషంగా ఉన్నారు. ఇది మా జిల్లా, మా రాష్ట్రంతోపాటు దేశమంతా గర్వపడుతోంది. వైభవ్ తండ్రి కూడా క్రికెట్ ప్లేయర్. కాబట్టి, అతడి కుమారుడిని కూడా మైదానంలో చూడాలనేదే కోరిక. అందుకోసం చాలా కష్టపడ్డాడు" అని సంజీవ్ సోదరుడు రాజీవ్ వెల్లడించారు. 'నేను ఇప్పటికే వైభవ్‌తో మాట్లాడా. కంగ్రాట్స్ చెప్పా. అతడికి మూడేళ్లు ఉన్నప్పటినుంచే ఆటపై ఆసక్తి ఉండేది. అతడు మరిన్ని విజయాలు సాధించాలని దేవుడిని ప్రార్థిస్తున్నా" అని వైభవ్ బామ్మ ఉషా సింగ్ తెలిపారు.

ధోనీ-వైభవ్ వ్యక్తిత్వంలో కొన్ని పోలికలు ఉంటాయి: ఆర్ఆర్ మేనేజర్

పరిణతి కలిగిన ప్లేయర్ల మాదిరిగా వైభవ్ ఆడటం అద్భుతమని రాజస్థాన్ రాయల్స్ మేనేజర్ రోమి బిందర్ వెల్లడించాడు. ధోనీ తనతో ఓసారి మాట్లాడుతూ రాజస్థాన్‌కు మంచి ఆటగాడు దొరికాడని ప్రశంసించాడు. "గువాహటి వేదికగా చెన్నైతో మ్యాచ్ జరిగింది. ఆ సమయంలో ధోనీని వైభవ్ కలిశాడు. తర్వాత మళ్లీ చెన్నైలోనూ భేటీ అయ్యాడు. వీరిద్దరి తీరును చూస్తుంటే కొన్ని పోలికలు ఉన్నాయనిపిస్తుంది. చాలా ప్రశాంతంగా ఉంటూ దూకుడైన షాట్లు ఆడతారు. వైభవ్‌ను ధోనీ చాలా పొగిడాడు. 'మీ జట్టులో ఓ బేబీ ఉన్నాడు. అతడు గొప్ప షాట్లు ఆడుతున్నాడు. చాలా మెచ్యూర్‌గా షాట్లు కొట్టడం బాగుంది' అని అన్నాడు. కోహ్లీని వైభవ్ కలిసినప్పుడు చాలా టిప్స్ చెప్పాడు. ఎలా కష్టపడాలి.. ఎలా స్థిరంగా ఉండాలనే విషయాలపై సూచనలిచ్చాడు" అని బిందర్ వెల్లడించాడు.

# మా అమ్మ నిద్ర మూడు గంటలే: వైభవ్ సూర్యవంశీ

"నేను ఇప్పటివరకు సాధించిన ప్రతి విజయం వెనక నా తల్లిదండ్రుల కష్టం ఉంది''.. ఇదీ ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన భారత క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ( ) చెప్పిన మాటలు. గుజరాత్‌పై సంచలన ఇన్నింగ్స్‌తో రాజస్థాన్‌ను గెలిపించాడు. కేవలం 35 బంతుల్లోనే సెంచరీ చేసిన అతడు.. 101 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరాడు. వైభవ్ ఇన్నింగ్స్‌పై సర్వత్రా ప్రశంసలు వచ్చాయి. ఈ అభినందనలు నా కంటే మా అమ్మానాన్నలకే ఎక్కువ భాగం చెందుతాయని వైభవ్ వ్యాఖ్యానించాడు.




"ఇప్పుడు నేను ఇలా ఉన్నానంటే.. దానికి కారణం నా తల్లిదండ్రులే. నా కోసం మా అమ్మ వేకువజామునే నిద్ర లేచేవారు. నా ప్రాక్టీస్ కోసం ఆహారం సిద్ధం చేసి పంపించేవారు. ఆమె కేవలం మూడు గంటలు మాత్రమే నిద్ర పోయేవారు. నా కోసం మా నాన్న తన ఉద్యోగాన్ని వదిలేశారు. కుటుంబం కోసం మా అన్నయ్య పని చేయడం ప్రారంభించాడు. చాలా కష్టాలు పడ్డాం. ఎలాంటి సందర్భమైనా మా నాన్న మద్దతుగా నిలిచేవారు. ఎప్పటికైనా సాధించాలని చెప్పారు. ఇప్పుడు మీరందరూ చూస్తున్న ఫలితం, విజయం కేవలం మా అమ్మానాన్న వల్లే వచ్చింది" అని వైభవ్ వెల్లడించాడు. ఈ వీడియోను ఐపీఎల్ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది.






# కార్గిల్‌లో ఓడించాం.. మర్చిపోయారా?: అఫ్రిదీకి ధావన్ స్ట్రాంగ్ కౌంటర్

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాల వేళ భారత సైన్యాన్ని ఉద్దేశిస్తూ పాక్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిదీ () అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీనికి భారత క్రికెటర్ శిఖర్ ధావన్ (తీవ్రంగా స్పందించాడు. ఇంకెంతగా దిగజారుతారంటూ దాయాది ఆటగాడికి గట్టి కౌంటర్ ఇచ్చాడు.

"మేం మీ దేశాన్ని కార్గిల్ యుద్ధంలో ఓడించాం. అది మర్చిపోయారా? ఇప్పటికే మీరు దారుణంగా పతనమయ్యారు. ఇంకా ఎంతకు దిగజారుతారు? ఇలాంటి చెత్త వ్యాఖ్యలు చేయడం మాని.. మీ దేశ పరిస్థితిని మెరుగుపర్చుకోవడంపై దృష్టిపెట్టండి. భారత సైన్యంపై మేమంతా గర్వపడుతున్నాం'' అని ధావన్ 'ఎక్స్' వేదికగా అఫ్రిదీపై మండిపడ్డాడు.

ఇటీవల పహల్గాం ఉగ్రదాడి )పై అఫ్రిదీ మాట్లాడుతూ.. భారత సైన్యాన్ని కించపర్చేలా వ్యాఖ్యానించాడు. "ఈ దాడిని వారి సైన్యం ఎందుకు అడ్డుకోలేకపోయింది?" అంటూ అనుచిత పదజాలంతో భారత్‌పై అక్కసు వెళ్లగక్కాడు. అఫ్రిదీ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

పహల్గాం దాడికి పాక్ సీమాంతర ఉగ్రవాదమే కారణమన్న భారత్.. దాయాదితో దౌత్య సంబంధాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. అప్పటినుంచి పాక్ మంత్రులు, నేతలతో పాటు అక్కడి మీడియా కూడా మనపై అక్కసు వెళ్లగక్కుతోంది. భారత సైన్యానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే పాక్‌కు చెందిన పలు యూట్యూబ్ ఛానళ్లపై కేంద్రం నిషేధం విధించింది.



# సూర్యవంశీ.. భవిష్యత్తు సూపర్ స్టార్: యువ బ్యాటర్‌పై ప్రశంసల వర్షం

కేవలం 35 బంతుల్లోనే సెంచరీ సాధించిన 14 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ (%ఎఖఅఎష్ట్రఖజ ాబతీఎఖజఖఅంష్ట్రఅ%)పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. గుజరాత్ టైటాన్స్‌పై రాజస్థాన్ రాయల్స్ (%=ఖయిఖర్ఖఅ =శీఖశ్రీం%) అద్భుత విజయం సాధించడంలో వైభవ్ కీలక పాత్ర పోషించాడు. జీటీ నిర్దేశించిన 210 పరుగుల టార్గెట్‌ను రాజస్థాన్ 16 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి విజయం సాధించింది.

"వైభవ్.. నీ ఫియర్‌లెస్ ఆటతీరు సూపర్. బ్యాట్‌ను కదిపే వేగం, బంతిని అంచనా వేసే విధానం, బౌండరీకి పంపే ఎనర్జీ బాగుంది. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడావు" - సచిన్ తెందూల్కర్

"మనం 14 ఏళ్ల వయసులో ఏం చేస్తున్నాం? కానీ, ఈ కుర్రాడు మాత్రం ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. కన్ను ఆర్పకుండా అతడి ఆటను చూసేలా చేశాడు. వైభవ్ సూర్యవంశీ ఈ పేరు గుర్తుండిపోతుంది. భవిష్యత్తు తరం వెలిగిపోతుందని గర్వంగా చెప్పగలను" - యువరాజ్ సింగ్

"పద్నాలుగేళ్ల వయసులో చాలామంది తమకిష్టమైన ఐస్‌క్రీమ్ తినేందుకు ఆసక్తి చూపిస్తారు. వైభవ్ మాత్రం ఐపీఎల్‌లో సూపర్ సెంచరీ సాధించాడు. భారత క్రికెట్ తర్వాత జనరేషన్ సూపర్ స్టార్ వచ్చేశాడు" - కృష్ణమాచారి శ్రీకాంత్

"వైభవ్ ఆటను చూడటం చరిత్రలో నిలిచిపోయే అద్భుతం. 200ం టార్గెట్ ఉన్నా సరే ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా ఆటడం బాగుంది. అదీనూ 14 ఏళ్ల వయసులో ఇలాంటి ఆటతీరు ప్రదర్శించడం అభినందనీయం. చాలా బాగా ఆడావు ఛాంపియన్" - మిథాలీ రాజ్

"సూపర్ స్టార్ వైభవ్ సూర్యవంశీ.. మరింత పవర్ రావాలని కోరుకుంటున్నా" - హర్భజన్ సింగ్

"కేవలం ఐపీఎల్ చరిత్రలోనే కాదు.. క్రికెటింగ్ హిస్టరీలోనే రికార్డు. ఇంతటితో ఆపేయకుండా ఇదే సామర్థ్యంతో ముందుకు సాగుతాడని ఆశిస్తున్నా. అప్పుడు వైభవ్ మరింత ఉన్నత స్థానాలకు చేరతాడు" - ఆనంద్ మహీంద్రా

# భారత్‌కు చావోరేవో

షియామెన్ (చైనా): బీడబ్ల్యూఎఫ్ సుదిర్మన్ కప్ ఫైనల్స్‌లో చావోరేవో పోరుకు భారత్ సిద్ధమైంది. నాకౌట్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితుల్లో మంగళవారం ఇండోనేసియాతో భారత్ తలపడనుంది. ఆదివారం గ్రూపు-డి తొలి పోరులో భారత్ 1-4తో డెన్మార్క్ చేతిలో పరాజయం పాలైంది. ఇండోనేసియా చేతిలో ఇంగ్లాండ్ ఓడింది. గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ నేపథ్యంలో నాకౌట్ రేసులో నివాలంటే ఇండోనేసియాతో మ్యాచ్‌లో భారత్‌కు విజయం తప్పనిసరి. స్టార్ క్రీడాకారులు పి.వి.సింధు, హెచ్.ఎస్.ప్రణయ్, లక్ష్యసేన్ ఫామ్‌లో లేకపోవడం భారత్‌కు ప్రతికూలాంశమే. అగ్రశ్రేణి డబుల్స్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి, గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ టోర్నీకి దూరంగా ఉండటం కూడా భారత్ ప్రదర్శనపై ప్రభావం చూపుతోంది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్- రుబన్ కుమార్, మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో- శ్రుతి మిశ్రా, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో జోడీలు ఏమేరకు రాణిస్తాయో చూడాలి.



# ఇన్ఫోసిస్‌లో నాలుగోసారి.. 195 మంది ట్రైనీల తొలగింపు




ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో ట్రైనీల తొలగింపుల పర్వం కొనసాగుతోంది. తుది ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో విఫలమైన కారణంగా మరో 195 మందిని ఆ సంస్థ పక్కన పెట్టింది. ఈ ఏడాది ట్రైనీలను తొలగింపు చేపట్టడం వరుసగా ఇది నాలుగోసారి. పరీక్షలో ఫెయిల్ అయిన ట్రైనీలకు ఇ-మెయిల్ ద్వారా ఇన్ఫోసిస్ సమాచారం ఇచ్చినట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

తొలగించిన ట్రైనీలకు ఇన్ఫోసిస్ ఉచితంగా శిక్షణ అందిస్తోంది. ఎన్ఐఐటీ, అప్‌గ్రాడ్ ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 800 మందిని ట్రైనీలను ఇన్ఫోసిస్ తొలగించింది. అందులో 250 మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. మరో 150 మంది ఇన్ఫోసిస్ అందిస్తున్న ఔట్ ప్లేస్‌మెంట్ సేవల కోసం రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిసింది.

ఇన్ఫోసిస్ తొలుత ఫిబ్రవరి నెలలో 300 మంది ట్రైనీలను తొలగించింది. మార్చిలో 30-35 మందిని, ఏప్రిల్‌లో 240 మందిని తొలగించింది. తాజాగా ఇది నాలుగోసారి. తొలగించిన ట్రైనీలకు ఒక నెల ఎక్స్‌గ్రేషియాతో పాటు రిలీవింగ్ లెటర్‌ను కూడా ఇస్తోంది. ప్రస్తుతం తొలగించిన ట్రైనీలు 2022లో ఇన్ఫోసిస్ నియమించుకుంది. వీరిని 2024 అక్టోబర్‌లో ఆన్‌బోర్డ్ చేసుకున్నట్లు 'బిజినెస్ స్టాండర్డ్' పేర్కొంది. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇన్ఫోసిస్ 15 వేల మంది ట్రైనీలను నియమించుకుంది.

# అమెజాన్ గ్రేట్ సమ్మర్ సేల్.. ఐఫోన్ 15, శాంసంగ్ S24 అల్ట్రాపై బిగ్ డిస్కౌంట్స్




: ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ 'గ్రేట్ సమ్మర్ సేల్'కు సిద్ధమైంది. మే1 మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ సేల్ ప్రారంభం కానుంది. అమెజాన్ ప్రైమ్ సభ్యులకు 12 గంటల ముందునుంచి అంటే మే 1వ తేదీ అర్ధరాత్రి నుంచే అందుబాటులోకి రానుంది. ఈ సేల్‌లో స్మార్ట్‌ఫోన్లపై అందించనున్న ఆఫర్లను అమెజాన్ తాజాగా రివీల్ చేసింది. యాపిల్, శాంసంగ్, షావోమీ లేటెస్ట్ మొబైల్స్ ఈ జాబితాలో ఉన్నాయి.

శాంసంగ్ గెలాక్సీ ఎస్24 5జీ లిస్టింగ్ ధర రూ.1,34,999గా ఉండగా.. సేల్ సమయంలో ఈ మొబైల్‌ను రూ.84,999కే కొనుగోలు చేయొచ్చు. ఇక ఐఫోన్ 15 ధర రూ. 69,900కాగా.. ఆఫర్‌లో భాగంగా రూ.57,749కే లభిస్తుంది. వన్ ప్లస్ 13ఆర్ 5జీని రూ.39,999కే అందించనుంది. ఐకూ నియో 10ఆర్ 5జీ లిస్టింగ్ ధర రూ.31,999 కాగా.. ఈ ఫోన్‌ను రూ.24,999కే విక్రయించనుంది. ఇక షావోమీ 14 సివిని రూ.32,999, వన్ ప్లస్ నార్డ్ సీఈ4 లైట్ 5జీ రూ.15,999కే ఈ సేల్‌లో లభించనున్నాయి. శాంసంగ్ గెలాక్సీ ఎం35 5జీ రూ.13,999, రియల్‌మీ నార్జో 80ఎక్స్ 5జీ రూ.11,999, టెక్నో పాప్9 రూ.5,490కే కొనుగోలు చేయొచ్చు.

గ్రేట్ సమ్మర్ సేల్‌లో బ్యాంక్ ఆఫర్లను కూడా అమెజాన్ ప్రకటించింది. సేల్‌లో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్, ఈఎంఐ లావాదేవీలపై 10 శాతం డిస్కౌంట్ పొందొచ్చు. అమెజాన్ పే- ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డుదారులకు 5 శాతం వరకు క్యాష్‌బ్యాక్ అందిస్తోంది. దీంతోపాటు ఎక్స్ఛేంజ్ ఆఫర్స్, నో-కాస్ట్ ఈఎంఐ వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌టీవీలు, ఎయిర్ కండీషన్లపైనా ఆఫర్లు ఉండబోతున్నాయి. సేల్ ప్రారంభం కాబోయే కొన్ని గంటల ముందు మరిన్ని ఆఫర్లు వివరాలు వెల్లడి కానున్నాయి.

# చిత్తవకుండా.. పుత్తడి కొనండి.. ఈ జాగ్రత్తలు తప్పనిసరి



రూ.లక్ష సమీపాన ఉంది. అరగ్రాము కూడా అపురూపంగా మారిన తరుణంలో బంగారం కొనుగోలు చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు...

పసిడి నాణ్యతను నిర్ణయించడంలో హాల్‌మార్క్ కీలకమైంది. ఈ మార్కింగ్ నంబరును కేటాయించడంలో కొన్ని అసైనింగ్ సెంటర్లు మోసాలు చేస్తుండడంతో, ప్రతి ఆభరణానికీ ప్రత్యేక హెచ్‌యూఐడీ (హాల్‌మార్క్ యునిక్ ఐడెంటిఫికేషన్) ముద్రించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిని పరిశీలించేందుకు బీఐఎస్ కేర్ యాప్‌ను విడుదల చేసింది. మన మొబైల్‌లో ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, ఆభరణంపై ఉండే హెచ్‌యూఐడీ నంబరు అసలుదో, కాదో ధ్రువీకరించుకోవచ్చు. దీంతో ఆభరణాన్ని ఎవరు, ఏ సంవత్సరం, ఏ నెలలో రూపొందించారనే వివరాలన్నీ వచ్చేస్తాయి. హెచ్‌యూఐడీని కేంద్రీకృత సాఫ్ట్‌వేర్‌తో రూపొందించారు.

హాల్‌మార్క్‌ను లేజర్ యంత్రంతో ముద్రిస్తారు. అదే హెచ్‌యూఐడీ వేయాలంటే ఆభరణాన్ని కాల్చడంతో పాటు, స్క్రాప్ తీస్తారు. దీనివల్ల బంగారంలో ఇరిడియం, పల్లేడియం వంటి శరీరానికి హాని కలిగించే, క్యాన్సర్ వ్యాధికి కారణమయ్యే పదార్థాలను కలిపితే పసిగట్టవచ్చు. దీంతో వినియోగదారుల ఆరోగ్యానికీ భరోసా ఉంటుంది. నగ తయారీలో బంగారానికి జింక్, రాగి, వెండి తప్ప మరేదీ కలపకూడదు. వెండిలో కూడా జెన్ అనే పదార్థం కలిపి మోసగించే అవకాశం ఉంది. హెచ్‌యూఐడీతో స్వచ్ఛత నిర్ధారణ అవుతుంది. మన ఇళ్లలో ఉన్న పాత బిస్కెట్‌ను కూడా తీసుకెళ్లి, హాల్‌మార్కింగ్ చేయించుకోవచ్చు.

బిల్లు తప్పనిసరి...

పెద్ద విక్రయశాలలన్నిటిలో ఆభరణాలను బిల్లుతోనే విక్రయిస్తారు. వీరు రూ.2 లక్షల కంటే నగదు తీసుకోరు. బిల్లుపై 3 శాతం జీఎస్టీ కూడా చెల్లించాలి. బిల్లు వద్దనుకుంటే ఆ మొత్తం మిగులుతుందనే భావనతో కొందరుంటారు. అలా చేస్తే బంగారం నాణ్యత తక్కువ ఉన్నా, అడగలేమని గుర్తించాలి.

డిజిటల్ పెట్టుబడులూ మేలే!

బంగారంపై లోహ రూపేణ కాకుండా, డిజిటల్ మార్గంలోనూ పెట్టుబడులు పెట్టొచ్చు. రోజులో ఏ సమయంలో అయినా పెట్టుబడులు, నచ్చిన సమయంలో విక్రయించే వీలు ఈ పద్ధతిలో ఉంది. యూపీఐ సేవలకు వినియోగిస్తున్న పేటీఎం, ఫోన్‌పే, జీపే, అమెజాన్ పే వంటి ఫిన్‌టెక్ యాప్‌లతో పాటు తనిష్క్, జోస్ అలుక్కాస్ వంటి విక్రయశాలలు, ఆదిత్య బిర్లా క్యాపిటల్ వంటి ఆర్థిక సేవల సంస్థల వెబ్‌సైట్లలోనూ క్రమానుగతంగా కొనుగోలు చేయొచ్చు. రోజువారీగా రూ.9 నుంచి రూ.1001 వరకు పెట్టుబడి పెట్టే పథకాన్ని పేటీఎం అందుబాటులోకి తెస్తే, రూ.100 అంతకుమించి డబ్బులున్నప్పుడల్లా కొనుగోలు చేసుకునే వీలును మిగిలిన సంస్థలు కల్పిస్తున్నాయి. ఇందుకోసం ప్రభుత్వరంగ ఎంఎంటీసీ-పాంప్‌తో ఒప్పందం చేసుకున్నాయి.

లావాదేవీలు ఇలా...

మన పాన్ నంబరు వంటి కేవైసీ పూర్తి చేసి, సులభంగానే పెట్టుబడులు ప్రారంభించొచ్చు. మనం పెట్టుబడి పెడుతున్న సమయంలో బంగారం ధరకు అనుగుణంగా, మనం జమ చేసిన నగదుకు సరిపడా బంగారాన్ని మన ఖాతాలో వేస్తాయి. ఇది ఎంఎంటీసీ-పాంప్ వాల్ట్‌లో సురక్షితంగా ఉంటుందని ప్రకటిస్తున్నాయి. మనం అనుకున్న మేర కొన్ని గ్రాముల మేర బంగారం సమకూరాక, లోహం రూపేణ డెలివరీ తీసుకోవచ్చు. లేదా ధర పెరిగింది.. లాభం స్వీకరించొచ్చు అనుకుంటే ఆన్‌లైన్‌లోనే విక్రయించొచ్చు. కొనుగోలు సమయంలో 3 శాతం జీఎస్టీ విధించినా, విక్రయ సమయంలో ఎటువంటి పన్ను ఉండదు. బంగారాన్ని విక్రయించగా వచ్చిన మొత్తాన్ని మన బ్యాంక్ ఖాతాలోకి 48-96 గంటల వ్యవధిలో ఆయా సంస్థలు జమచేస్తాయి. బంగారాన్ని ఇంట్లో ఉంచుకుంటే, దొంగతనానికి గురవుతుందనే భయం ఉంటుంది. పెట్టుబడి కోసమే అయితే ఈ రూపేణా కొనుగోలు చేసుకుంటే మంచిది. ఇది కాకుండా గోల్డ్ ఫండ్లలోనూ పెట్టుబడులు పెట్టొచ్చు.

విదేశాల నుంచి తెస్తున్నారా..?

విదేశాల్లో ఏడాదికి పైగా నివసించి వచ్చేవారు బంగారాన్ని ఆభరణాల రూపంలో పరిమితుల మేరకు వెంట తెచ్చుకోవచ్చు. పురుషుడు 20 గ్రాములు లేదా రూ.50 వేల వరకు... మహిళ 40 గ్రాములు లేదా రూ.1 లక్ష విలువైన ఆభరణాలు తెచ్చుకునేందుకు అనుమతిస్తారు. 6 నెలలకు మించి విదేశాల్లో నివసిస్తూ, 1000 గ్రాముల వరకు ఆభరణాలు తెచ్చుకునేవారు 16 శాతం సుంకాన్ని చెల్లించాల్సి వస్తుంది. ఈ కాలావధుల మేరకు నివసించకపోయినా, కిలో కన్నా ఎక్కువ బంగారాన్ని తెచ్చినా ఏకంగా 44 శాతాన్ని సుంకాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

పాత బంగారం విలువెంత..?

పాత బంగారం మార్చుకుని, అంతే బరువైన కొత్త బంగారం తీసుకుంటే జీఎస్టీ చెల్లించాల్సిన పనిలేదు. ఇది కాకుండా పసిడి ఏ రూపంలో కొన్నా 3 శాతం జీఎస్టీ చెల్లించాలి. పాత బంగారం తెచ్చి, అదే బరువుకు సమానమైన కొత్త ఆభరణాలు తీసుకెళ్లండి అంటూ విక్రయసంస్థలు ప్రకటిస్తుంటాయి. మన పాత ఆభరణంలో 10 గ్రాముల బంగారం 22 క్యారెట్లది ఉంటే, అంతే బరువు-నాణ్యత ఉన్న కొత్త ఆభరణం తీసుకోమంటారు. అయితే కొత్త ఆభరణానికి తరుగు, మజూరీ ఛార్జీలు వసూలు చేస్తారు. కొన్ని విక్రయశాలల్లో ఈ రెండూ కలిపి జతచేరిన విలువ (వీఏ) కింద అదనంగా చూపుతారు.

నాణేలకు కూడా మజూరీ, తరుగు వంటి ఛార్జీలు వర్తిస్తాయి. బిస్కెట్ రూపంలో కొనుగోలు చేసే మేలిమి బంగారానికి మాత్రమే ఇలాంటివి ఉండవు.




# వాట్సప్ వెబ్ నుంచి నేరుగా కాల్స్.. యాప్‌తో పనిలేదిక

యూజర్ల అవసరానికి తగ్గట్లు కొత్త కొత్త ఫీచర్లను అందించడంలో ప్రముఖ మెసేజ్ యాప్ వాట్సప్ ఎప్పుడూ ముందుంటుంది. తాజాగా మరో కొత్త సదుపాయంతో యూజర్ల ముందుకురానుంది. వాట్సప్ వెబ్ వినియోగదారుల యాప్‌తో పని లేకుండా వాయిస్, వీడియో కాల్స్ చేసే ఫీచర్‌ను అందుబాటులోకి తేనుంది.

వాట్సప్ మొబైల్ యాప్, డెస్క్‌టాప్ వెర్షన్లకు చాలా కాలం నుంచే కాలింగ్ ఫీచర్ అందుబాటులో ఉంది. అయితే వాట్సప్ వెబ్ యూజర్లు ఈ సదుపాయం వినియోగించాలంటే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం తప్పనిసరి. ఇకపై ఆ సమస్య ఉండదు. యాప్‌తో పని లేకుండా నేరుగా కాల్స్ చేయొచ్చన్నమాట. అంతే త్వరలో వాట్సప్ వెబ్ చాట్స్‌లోనూ ఫోన్, వీడియో కాల్ ఐకాన్‌లు కనిపించనున్నాయి. ప్రస్తుతం ఈ ఫీచర్ ఇంకా పరీక్ష దశలోనే ఉందని వాట్సప్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ అందించే 'వాబీటా ఇన్ఫో' తన బ్లాగ్‌లో పంచుకుంది. త్వరలోనే యూజర్లకు అందుబాటులోకి తేనుందని తెలిపింది.

# ఓలా అక్షయ తృతీయ సేల్.. జెన్2, 3 మోడళ్లపై 40 వేల వరకు రాయితీ

అక్షయ తృతీయ సందర్భంగా విద్యుత్ వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ (%ూజీుౌ జుత్రీవజీత్రీఱష%) ప్రత్యేక సేల్‌ను ప్రకటించింది. తన ఎస్1 పోర్ట్‌ఫోలియోపై పెద్దఎత్తున రాయితీ అందిస్తోంది. జెన్2, జెన్3 మోడళ్లపై రూ.40వేల వరకు తగ్గింపుతో పాటు ఉచిత వారెంటీని అందిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ప్రారంభమైన ఈ ఆఫర్లు రేపటి వరకు (ఏప్రిల్ 30) వరకు అందుబాటులో ఉంటాయి. దీంతో పాటు ఎంపిక చేసిన ప్రాంతాల్లో తమ స్కూటర్లపై హైపర్ డెలివరీ (ఒకే రోజు డెలివరీ) అందించనుంది.

ఆఫర్లు ఇవే..

ఓలా జెన్2 ఎస్1 ఎక్స్ 2%ఎజౌష్ట్ర% బ్యాటరీ సామర్థ్యం కలిగిన స్కూటర్ ధర ఆఫర్లతో కలుపుకుంటే ప్రస్తుతం రూ.67,499గా ఉంది. ఇక 3%ఎజౌష్ట్ర% బ్యాటరీ స్కూటర్ ధర రూ.83,999, 4%ఎజౌష్ట్ర% బ్యాటరీ ధర రూ.90,999, ఎస్1 ప్రో ధర రూ.1,11,999 నుంచి ప్రారంభమవుతుంది.

ఇక కంపెనీ జెన్3 పోర్ట్‌ఫోలియోలో ఎస్1 ఎక్స్ రేంజ్‌లో తీసుకొచ్చిన స్కూటర్లలో 2%ఎజౌష్ట్ర% బ్యాటరీ వేరియంట్ ధర రూ.73,999, 3%ఎజౌష్ట్ర% ధర రూ.92,999, 4%ఎజౌష్ట్ర% ధర రూ.1,04,999 నుంచి ప్రారంభమవుతుంది. ఎస్1 ఎక్స్+ 4%ఎజౌష్ట్ర% బ్యాటరీతో తీసుకొచ్చిన స్కూటర్ ధర రూ.1,09,999.

ఫ్లాగ్‌షిప్ ఎస్1 ప్రో 4%ఎజౌష్ట్ర% స్కూటర్ ధర రూ.1,48,999, 5.3%ఎజౌష్ట్ర% బ్యాటరీ సామర్థ్యం ఉన్న స్కూటర్ ధర రూ.1,88,200గా ఉంది. ఎస్1 ప్రో 3%ఎజౌష్ట్ర% బ్యాటరీ వేరియంట్ ధర రూ.1,12,999, 4%ఎజౌష్ట్ర% బ్యాటరీ వేరియంట్ ధర రూ.1,29,999గా ఉంది.

మరోవైపు ఓలా తన సేవల్ని మెరుగుపరుస్తోంది. హైపర్ డెలివరీ కింద వాహనాలను కొనుగోలు చేసిన రోజే రిజిస్ట్రేషన్, డెలివరీలను ప్రారంభించింది. తొలుత ఈ హైపర్ డెలివరీ సేవలు బెంగళూరులో ప్రారంభం కాగా.. క్రమంగా దేశవ్యాప్తంగా ఈ సేవలను విస్తరించనుంది. ఓలా ఎలక్ట్రిక్ వాహనాలను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ స్టోర్లలో కొనుగోలు చేసినవారు కొన్ని గంటల వ్యవధిలోనే పూర్తిగా రిజిస్ట్రేషన్ చేసుకొని వాహనాన్ని తీసుకెళ్లొచ్చు.



# సౌత్ ఆడియన్స్‌పై సల్మాన్ వ్యాఖ్యలు.. స్పందించిన నాని

సౌత్ ఆడియన్స్‌ను ఉద్దేశించి ఇటీవల సల్మాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. 'సికందర్' ప్రచారంలో పాల్గొన్న ఆయన "దక్షిణాది అభిమానులు... నేను రోడ్లపై కనిపిస్తే 'భాయ్.. భాయ్' అంటూ ప్రేమ చూపిస్తారు కానీ.. ఆ అభిమానం థియేటర్లలో ఉండదు'' అని అన్నారు. తాజాగా ఈ వ్యాఖ్యలను నానితోసిపుచ్చారు. దక్షిణాది చిత్ర పరిశ్రమ తరతరాల నుంచి హిందీ చిత్రాలను ఆదరిస్తుందని అన్నారు.

"సౌత్ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటున్నాయి. వీటికంటే ముందే హిందీ చిత్రాలను మనం ఆదరిస్తున్నాం. ఎన్నో దశాబ్దాల నుంచి బాలీవుడ్ సినిమాలపై ఆదరాభిమానాలు చూపిస్తున్నాం. అమితాబ్ నటించిన ఎన్నో సినిమాలు ఇక్కడ సూపర్ హిట్‌గా నిలిచాయి. అలాగే 'కుచ్ కుచ్ హోతా హై', 'దిల్ తో పాగల్ హై' వంటి చిత్రాలు ఇక్కడి వారికి ఎన్నో మంచి జ్ఞాపకాలు అందించాయి. దేశమంతటా హిందీ సినిమాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. సల్మాన్ విషయానికొస్తే అతడికి ఇక్కడ ఎంతోమంది అభిమానులు ఉన్నారు. ఆయన చిత్రాలు కూడా ఇక్కడ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. 'హమ్ ఆప్‌కే హై కౌన్' చిత్రం నాకు ఎంతో ఇష్టం. 'దీదీ తేరా దీవానా' పాట ఇక్కడి పెళ్లిళ్లలో ఎన్నోసార్లు విన్నాం. బహుశా సల్మాన్ వ్యాఖ్యలను మనం తప్పుగా అర్థం చేసుకున్నామేమో" అని అన్నారు.

"దక్షిణాది హీరోలు రజనీకాంత్, చిరంజీవి, సూర్య, రామ్‌చరణ్ లాంటి కథానాయకుల చిత్రాలు బాలీవుడ్‌లో మంచి ఆదరణను దక్కించుకుంటున్నాయి. బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లను సాధిస్తున్నాయి. ఎందుకంటే మేము థియేటర్‌కు వెళ్లి వారి సినిమాల్ని చూస్తుంటాం. కానీ వారి అభిమానులు మాత్రం హిందీ సినిమాల్ని వీక్షించడానికి అంతగా ఆసక్తి చూపించరు. దక్షిణాది అభిమానులు మాపై చూపిస్తున్న ప్రేమను థియేటర్ వరకు తీసుకెళ్లరు" అని సల్మాన్ ఇటీవల చేసిన కామెంట్స్ తెలిసినవే.

# సరికొత్త సీజన్.. సరికొత్త ఎలిమెంట్స్.. 'క్రైమ్ థ్రిల్లర్ లీగల్ డ్రామా' వచ్చేస్తోంది

: లాయర్ మాధవ్ మిశ్రాగా ప్రేక్షకులను మరోసారి అలరించడానికి సిద్ధమయ్యారు పంకజ్ త్రిపాఠి ఆయన కీలక పాత్రలో రూపొందిన వెబ్‌సిరీస్ 'క్రిమినల్ జస్టిస్' . ఇప్పటివరకూ మూడు సీజన్లు అలరించిన ఈ సిరీస్ నాలుగోసారి వినోదాన్ని పంచడానికి సిద్ధమైంది. ఈవిషయాన్ని తెలియజేస్తూ 'క్రిమినల్ జస్టిస్ సీజన్4: ఫ్యామిలీ మ్యాటర్' టీజర్ విడుదలైంది. మరో సరికొత్త, ఆసక్తికర కేసుతో మాధవ్ మిశ్రా సిద్ధమయ్యారు. బీబీసీ స్టూడియోస్‌తో కలిసి రోషన్ సిప్పీ దర్శకత్వం వహించిన ఈ సిరీస్ మే 22వ తేదీ నుంచి జియో హాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది.

పంకజ్ త్రిపాఠితో కలిసి జీషన్ ఆయూబ్, సుర్వీన్ చావ్లా, మిత వశిష్ఠ, ఆశా నేగి, శ్వేతబసు తదితరులు ఇందులో కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈసందర్భంగా పంకజ్ త్రిపాఠి మాట్లాడుతూ.. "క్రిమినల్ జస్టిస్' సిరీస్‌లో నటించడం నాకెంతో సంతోషంగా ఉంది. మాధవ్ మిశ్రాగా కనిపిస్తుంటే, నా పాత స్నేహితుడిని కలిసిన భావన కలుగుతుంది. ప్రతిసారీ ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకుంటున్నా. ప్రేక్షకులు కూడా నా పాత్రను ఆదరిస్తున్నారు. మాధవ్ కేవలం పాత్ర మాత్రమే కాదు. ప్రతి చాప్టర్ నాతో మరొకరు ఉన్న భావన కలుగుతుంది. ఆ బంధం మరింత బలపడుతోంది. ఈ సీజన్‌లో నటించడం నాకు థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఈసారి సరికొత్త ఎలిమెంట్స్ కోర్ట్‌రూమ్ డ్రామాను ప్రేక్షకులకు అందించడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం' అని అన్నారు.

'క్రిమినల్ జస్టిస్' మొదటి మూడు సీజన్‌లలో కథ, కథనాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆధారాలు లేకుండానే జైలు శిక్ష అనుభవిస్తున్న బాధితుల తరఫున పోరాడే న్యాయవాది మాధవ్ మిశ్రా పాత్రలో పంకజ్ త్రిపాఠి నటించి మెప్పించాడు. మరి సీజన్ 4లో ఎలాంటి కథాంశంతో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారో చూడాలి.

# థియేటర్లు దద్దరిల్లేది ఆ రోజే ఎన్టీఆర్-నీల్ మూవీ కొత్త రిలీజ్ డేట్

ఎన్టీఆర్ (కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రం కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ మంగళవారం ప్రకటించింది. 2026 జూన్25న 'ఎన్టీఆర్-నీల్' మూవీని విడుదల చేయనున్నట్లు తెలిపింది.

''ఇద్దరు డైనమిక్ వ్యక్తుల కాంబినేషన్‌లో బాక్సాఫీస్ విధ్వంసమయ్యే అనుభూతికి సిద్ధకండి. 25 జూన్ 2026న థియేటర్లు దద్దరిల్లే సౌండ్స్ మీరు వింటారు. మాన్‌లకే మాన్ అయిన ఎన్టీఆర్ పుట్టినరోజున ప్రత్యేక గ్లింప్స్‌తో వస్తాం" - మైత్రీ మూవీ మేకర్స్



తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్ర బృందం ప్రకటించింది. అయితే, కథకు ఉన్న డిమాండ్ దృష్ట్యా చిత్రీకరణకు మరి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. అలాగే పోస్ట్ ప్రొడక్షన్స్ పనులు సైతం ఆలస్యమయ్యేలా కనిపిస్తుండటంతో కొత్త విడుదల తేదీని ప్రకటించారు. 'కేజీయఫ్', 'సలార్' చిత్రాలతో ప్రశాంత్ నీల్ టేకింగ్ ఏంటో ప్రేక్షకులు చూశారు. దీంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. వాటికి దీటుగా మూవీ ఉండాలంటే టేకింగ్/మేకింగ్ విషయంలో అస్సలు రాజీపడకూడదని ప్రశాంత్‌నీల్ భావిస్తున్నారు. దీంతో సినిమా విడుదల కాస్త ఆలస్యమైనా అభిమానులు కోరుకునే అన్ని అంశాలతో మూవీని తీసుకురావాలని భావించారు. అందుకే కొత్త విడుదల తేదీని ప్రకటించినట్లు టాలీవుడ్ టాక్. ఇప్పటికే ఈ మూవీ చిత్రీకరణ మొదలు కాగా, ఇటీవల ఎన్టీఆర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాల చిత్రీకరణ కూడా జరిగింది.

# 'వెండితెర' ఎరుపెక్కుతోంది

హీరో ఒక్కడే ఒంటి చేత్తో పది మందిని తుక్కు తుక్కుగా కొట్టడాలు.. భారీ మిషన్ గన్‌లను భుజాన వేసుకొచ్చి ఎడాపెడా కాల్చేయడాలు.. ఈతరహా పోరాటాలు ఇప్పుడు బొత్తిగా ఆనడం లేదు. అంతకు మించిన యాక్షన్ చూపించాల్సిందే. హీరో నరకడం మొదలు పెడితే వందల సంఖ్యలో తలలు తెగిపడాలి.. కాళ్లు, చేతులు గాల్లోకి ఎగిరి పడాలి.. శత్రు మూకల నెత్తుటి వరదతో వెండితెర ఎరుపెక్కాలి... అప్పుడే థియేటర్లో హీరోయిజం మీసం మెలేస్తుంది. నిజానికి ఈస్థాయి హింసను తెరపై చూడాలంటే ఒకప్పుడు ప్రేక్షకులు నొసలు చిట్లించేవాళ్లు. అందుకే హీరోలు.. దర్శకులు కూడా అలాంటి ప్రయత్నాలకు దూరంగానే ఉండేవాళ్లు. కానీ, ఇప్పుడిలాంటి హింసాత్మక యాక్షన్‌తో సాగే చిత్రాలు ఓ ట్రెండ్‌గా మారిపోయాయి. 'యానిమల్', 'కిల్', 'మార్కో' చిత్ర విజయాలు ఈ ట్రెండ్‌కు కొత్త ఊపిరిలూదాయి. ఇప్పుడీ తరహా కథలతోనే వెండితెరను ఎరుపెక్కించేందుకు తెలుగులో పలువురు కథానాయకులు సిద్ధమవుతున్నారు. సినీప్రియులకు 'అంతకు మించిన యాక్షన్'ను రుచి చూపిస్తామంటూ ఊరిస్తున్నారు.



ప్రేక్షకులు ఇప్పుడు సినిమాల్ని ఆస్వాదించే తీరు చాలా మారిపోయింది. ముఖ్యంగా హీరోయిజం, యాక్షన్ లాంటి విషయాల్లో సాధారణ విషయాలు బొత్తిగా ఆనడం లేదు. ఏం చేసినా సరే అంతకు మించి అనేట్లుగా ఉండాల్సిందే. 'యానిమల్'లో హీరో ఒక్కడే ఒంటి చేత్తో వందలాది మంది శత్రువుల్ని ఎడాపెడా నరికి పారేస్తాడు. తెరపై నెత్తుటి వరద పారిస్తాడు. 'కిల్'లోనూ అంతే.. హీరో ఒక్కడే అడొచ్చిన విలన్లందర్నీ ఊచకోత కోసేస్తాడు. రైల్లో రుధిర వర్షం కురిపిస్తాడు. ఈస్థాయి హింస ఓ వర్గం ప్రేక్షకులకు అంతగా రుచించకపోవచ్చు. కానీ, యాక్షన్ సినీప్రియులు ఆ హింసాత్మక యాక్షన్‌ను మనసారా ఆస్వాదించారు. ఆ చిత్రాలకు వసూళ్ల వర్షం కురిపించి.. భారీ విజయాల్ని అందించారు. నిజానికి ఇది వరకు తెలుగులో ఈస్థాయి ఓవర్ ది బోర్డ్ యాక్షన్ చిత్రాలు అరుదుగానే కనిపించేవి. కానీ, ఇప్పుడీ ట్రెండ్‌ను తెలుగు చిత్రసీమ కూడా అనుసరించే ప్రయత్నం చేస్తోంది.

గతేడాది అల్లు అర్జున్) నుంచి వచ్చిన 'పుష్ప 2: ది రూల్' బాక్సాఫీస్ ముందు భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. అందులో పతాక ఘట్టాల్లో మహాకాళి అవతారంలో బన్నీ విజృంభించిన తీరు.. శత్రువుల్ని కత్తితో కండగా చీల్చిచెండాడిన విధానం మాస్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. ఆ ఎపిసోడ్ చిత్ర విజయంలో కీలక పాత్ర పోషించింది.

అంతకుముందు కథానాయకుడు ప్రభాస్ 'సలార్'తో వెండితెరను ఎరుపెక్కించారు. అందులో కాటేరమ్మ కొడుకులా ప్రభాస్ సృష్టించిన రక్తపాతం.. చేసిన యాక్షన్ హంగామా యాక్షన్ ప్రియుల్ని మురిపించింది. ఇప్పుడీ సినిమాకి కొనసాగింపుగా 'సలార్ 2' రావాల్సి ఉంది. మరి దాంట్లో ప్రభాస్‌తో ప్రశాంత్ నీల్ ఇంకెంతటి రక్తపాతం సృష్టిస్తాడో తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు. ఇక ప్రభాస్ ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' చేయనున్న సంగతి తెలిసిందే. పవర్‌ఫుల్ పోలీస్ కథాంశంతో ముస్తాబు కానున్న ఈ చిత్రం కూడా 'యానిమల్' (%ూఅఱఎaశ్రీ%) తరహాలోనే వైల్డ్ యాక్షన్‌తో నిండి ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఈ ఏడాది ద్వితీయార్ధంలో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.

'దసరా' సినిమాతో తనలోని వైల్డ్ యాక్షన్ కోణాన్ని సినీప్రియులకు రుచి చూపించారు కథానాయకుడు నాని ఇప్పుడాయన అంతకు మించిన హింసాత్మక యాక్షన్ చిత్రాన్ని 'హిట్: ది థర్డ్ కేస్' 3) రూపంలో ప్రేక్షకులకు చూపించేందుకు సిద్ధమవుతున్నారు. విజయవంతమైన 'హిట్' ఫ్రాంఛైజీలో భాగంగా శైలేశ్ కొలను తెరకెక్కించిన ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లరిది. నాని ఇందులో అర్జున్ సర్కార్ అనే శక్తిమంతమైన పోలీసు పాత్రలో మునుపెన్నడూ చూడని రీతిలో కనిపించనున్నారు. దీంట్లో ఆయన శత్రువుల్ని వేటాడే తీరు.. ఈ క్రమంలో సృష్టించే హింస, రక్తపాతం ఏస్థాయిలో ఉండనున్నాయో ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్లతో అందరికీ అర్థమైపోయింది. ఇందుకు తగ్గట్లుగానే సెన్సార్ బోర్డ్ దీనికి 'ఏ' సర్టిఫికెట్ అందించిన సంగతి తెలిసిందే. చిత్ర బృందం కూడా పిల్లలు, సున్నిత మనస్కుల్ని ఈ సినిమాకి దూరంగా ఉండాలని కోరుతోంది. మరి ఈ చిత్రంలో నాని చేసే హింసాకాండ ఇంకే స్థాయిలో ఉండనుందో తెలియాలంటే మే 1 వరకు వేచి చూడక తప్పదు. ఈ సినిమా తర్వాత నాని - శ్రీకాంత్ ఓదెల కలయికలో 'ది ప్యారడైజ్'అనే ఓ భారీ పీరియాడిక్ డ్రామా చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ఇది కూడా 'దసరా'కు మించిన వైల్డ్ యాక్షన్‌తోనే సినీప్రియుల్ని అలరించనున్నట్లు సమాచారం.

వీళ్లూ అదే బాటలో..

అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. దీని తర్వాత ఆయన శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ చేయనున్నారు. దీన్ని హీరో నాని నిర్మిస్తున్నారు. ఇదీ హింస, రక్తపాతంతో నిండిన యాక్షన్ కథతోనే ముస్తాబు కానున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. చిరు ఇందులో హింసలో శాంతిని వెతుక్కునే శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నట్లు గతంలో ఇచ్చిన ప్రీలుక్‌తో స్పష్టత ఇచ్చేశారు. ఇది వచ్చే ఏడాది చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.

ప్రస్తుతం కథానాయకుడు ఎన్టీఆర్.. దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో ఓ బహుభాషా చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులోనూ హింస, రక్తపాతం అంతకు మించి అనే స్థాయిలో ఉండనున్నట్లు తెలుస్తోంది. "ఇది అతని నేల. తన పాలనలో రక్తంతో తడిసిన నేల ఒక్కటే గుర్తుకొస్తుంది. కానీ, అది కచ్చితంగా అతని రక్తమైతే కాదు" అంటూ గతంలో ఇచ్చిన ఈ చిత్ర ప్రీలుక్‌తోనే దీంట్లో ఎన్టీఆర్ ఎంత వైల్డ్‌గా కనిపించనున్నారన్నది స్పష్టత ఇచ్చేసింది చిత్రబృందం. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది.

శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ పీరియాడిక్ యాక్షన్ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. దీన్ని కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇదీ రక్తపాతంతో నిండిన కథాంశంగానే ఉండనున్నట్లు తెలుస్తోంది. అందుకే దీన్ని 'శర్వా-సంపత్ బ్లడ్‌ఫీస్ట్' హ్యాష్‌ట్యాగ్‌తో సామాజిక మాధ్యమాల్లో ప్రమోట్ చేసుకుంటోంది చిత్ర బృందం. ఈ సినిమాలో శర్వాకు జోడీగా అనుపమ పరమేశ్వరన్ కనిపించనుంది. డింపుల్ హయాతి కీలక పాత్రలో కనువిందు చేయనుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సోమవారం ప్రకటించింది.

# ఓటీటీలోకి కొత్త చిత్రం.. నెలలోపే స్ట్రీమింగ్

: 'పొలిమేర' సిరీస్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు డాక్టర్ అనిల్ విశ్వనాథ్. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన థ్రిల్లర్ చిత్రం '28 డిగ్రీస్ సెల్సియస్' . నవీన్ చంద్ర హీరోగా నటించగా ప్రియదర్శి, వైవా హర్ష, షాలిని తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఏప్రిల్ 4న ప్రేక్షకుల ముందుకువచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుందీ చిత్రం. ఇప్పుడీ సినిమా సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో (%ూఝఓశీఅ ూతీఱఎవ ఎఱసవశీ%) వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.



కథేంటంటే: కార్తిక్ (నవీన్ చంద్ర) మెడికల్ చదివే సమయంలో అంజలి (షాలిని)తో ప్రేమలో పడతాడు. అనాథ అయిన కార్తిక్‌ను పెళ్లి చేసుకోవడానికి అంజలి ఇంట్లో వారు అంగీకరించకపోవడంతో ఇంట్లో నుంచి వచ్చేసి పెళ్లి చేసుకుంటారు. పెళ్లి అయిన తర్వాత ఆమెకు ఆరోగ్య సమస్య వస్తుంది. 28 డిగ్రీల సెల్సియస్ వద్ద మాత్రమే ఆమె ఆరోగ్యంగా ఉంటుంది. అనుకోకుండా ఒకరోజు ఆమె చనిపోతుంది.

# క్యాన్సర్ రాకకు చెక్

క్యాన్సర్‌ను ఒకప్పుడు తలరాతగా భావించేవారు. ఆ తర్వాత కాలంలో జన్యువులే ఇందుకు ముఖ్యకారణం అనుకున్నారు. కానీ ఇప్పుడు%ా% క్యాన్సర్ రావాలా వద్దా అన్నది మన చేతిలో కూడా



ఉంటుందని గుర్తిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాలైన ఆహారంతో ఈ ప్రాణాంతక వ్యాధిని వీలైనంత దూరం పెట్టవచ్చన్నది నిపుణుల అభిప్రాయం. వాటిలో కొన్ని సూచనలు%ా

ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండే సాల్మన్ చేపలు, వాల్‌నట్స్, అవిసె గింజల్లాంటివి తీసుకోవడం వల్ల క్యాన్సర్ కారకాల ప్రభావం తక్కువగా ఉంటుంది.

ఆకు కూరలు, తాజా పండ్లలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. క్యాన్సర్‌ను దూరంగా ఉంచుతాయి.

ద్రాక్ష, బొప్పాయి, క్యాబేజ్%ా% ఇలా ఆకుపచ్చ రంగులో ఉండే కాయలు, పండ్లను తీసుకోవడం సమతుల ఆహారానికి సూచన. ఈ తరహా సంపూర్ణ ఆహారం క్యాన్సర్‌ను నిరోధిస్తుంది.

యోగర్ట్, పెరుగు, మజ్జిగ మన జీర్ణాశయంలోని మంచి బ్యాక్టీరియాను పెంపొందిస్తాయి. దానివల్ల జీర్ణాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయి.

మాంసంలో పీచు పదార్థం తక్కువగానూ,కొవ్వు శాతం ఎక్కువగానూ ఉంటుంది. దాన్ని ప్రాసెస్ చేయడంలో కొన్ని క్యాన్సర్ కారక రసాయనాలు కూడా కలిసే అవకాశం ఉంది. కాబట్టి మాంసం వాడకాన్ని కాస్త తగ్గించుకుంటే మేలని నిపుణుల మాట.

ఉల్లి, అల్లం, వెల్లుల్లి, పసుపు, కరివేపాకు%ా% లాంటి పదార్థాలకు క్యాన్సర్ వ్యతిరేక లక్షణాలు ఉంటాయి. అలాంటివాటిని ఆహారంలో భాగంగా మార్చుకోవాలి. వీటితో పాటుగా ఎక్కువ నీరు, ఎత్తుకు తగిన బరువు కొనసాగించడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ దరికి రాదు.

# మద్యం తాగాక కాఫీ తాగితే మత్తు తగ్గుతుందా?

మనలో చాలామందికి కాఫీ అంటే మహాచెడ్డ ప్రేమ. ఇంకొంతమంది మాత్రం దీన్నో చెడ్డ పానీయంగా భావిస్తారు. కాఫీని ఓ (దుర్)వ్యసనంగా పరిగణిస్తారు. కానీ, ఇదంత నిజమైన విషయం కాదు. కాఫీ చుట్టూ సమాజంలో కొన్ని అపోహలు అల్లుకుని ఉన్నాయి. వాటిలో నిజమెంతో తెలుసుకుందాం.

నిజం: మనకు వ్యసనం అనగానే మద్యం, సిగరెట్లు, డ్రగ్స్ గుర్తుకువస్తాయి. కెఫీన్ లేదా కాఫీ సేవనం విషయంలో మాత్రం వ్యసనం అనేది పెద్ద అంశంగా భావించరు. అంతేకాదు%ా%



కెఫీన్ వినియోగం వల్ల తలెత్తే శారీరక, సామాజిక సమస్యలను అంతగా పట్టించుకోరు. మోతాదు మించిన కాఫీ కూడా ఓ వ్యసనమే. అయితే, ఇతర ఉత్ప్రేరకాల (స్టిమ్యులెంట్స్)తో పోలిస్తే ఫీల్‌గుడ్ హార్మోన్ డోపమైన్ స్థాయిలు కాఫీతో నెమ్మదిగా పెరుగుతాయి. కాబట్టి కాఫీ వ్యసనాన్ని వదిలించుకోవడం సులభమే. ఎంతగానో అలవాటుపడిన కాఫీ మానేసే క్రమంలో మగత, తలనొప్పి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి, ఉన్నపళంగా కాఫీ మానేయడం ఇబ్బందైతే%ా% తాగే పరిమాణం తగ్గిస్తూ ప్రయత్నించాలి. కొన్ని రోజులకు ఆ వ్యసనం నుంచి బయటపడతాం.

అపోహ: కాఫీతో డీహైడ్రేషన్ వస్తుంది.

నిజం: కెఫీన్ డైయూరిటిక్. అంటే%ా% కాఫీ ఎక్కువగా తాగితే మూత్ర విసర్జన ఎక్కువవుతుంది. కాకపోతే రోజుకు ఓ నాలుగు కప్పుల కాఫీ అంత ప్రమాదకరం ఏమీకాదు. మూత్రం పసుపు రంగులో వస్తుంటే మాత్రం నీళ్లు ఎక్కువగా తాగాలి.

అపోహ: కాఫీ చెడ్డది.

నిజం: కాఫీ చెడ్డది కాదు. రోజుకు రెండు నుంచి ఐదు కప్పుల కాఫీ నిక్షేపంగా తాగొచ్చు. దీనివల్ల టైప్ 2 డయాబెటిస్, గుండెజబ్బులు, పార్కిన్సన్స్ డిసీజ్, కాలేయ క్యాన్సర్, కుంగుబాటు లాంటివాటి ముప్పు తగ్గుతుందట. కాఫీ తాగడం వల్ల%ా% ఏ ఆరోగ్య సమస్యతోనైనా సరే మరణం ముప్పు కూడా తగ్గుతుందంటున్నారు నిపుణులు. మొత్తంగా చూస్తే రోజూ మితంగా కాఫీ తాగడం వల్ల చెడు కంటే మంచే ఎక్కువ. అయితే కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండే తియ్యటి కాఫీ పానీయాలు, వెనిలా ఓట్ మిల్క్ లాటే లాంటివాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

అపోహ: మద్యం తాగాక కాఫీ తాగితే మత్తు తగ్గుతుంది.

నిజం: అంటే మద్యం తీసుకుని కాఫీ తాగితే వాహనాలు నడపేయవచ్చని అర్థం కాదు. మరో ముచ్చట ఆల్కహాల్ ప్రభావాన్ని కెఫీన్ ఏ మాత్రం తగ్గించలేదని పరిశోధనల్లో తేలింది. సాధారణంగా కెఫీన్ ఉత్తేజాన్ని ఇస్తుందనేది నిజం. అయితే మద్యం తాగినవాళ్లకు ఈ చిట్కా పనిచేయదు. ఇకపోతే మద్యం తాగినవాళ్లు కాఫీ తాగితే నిద్రమత్తు వదిలిపోతుంది%ా% కాబట్టి మళ్లీ మద్యం మీదికి మనసు మళ్లేందుకు ఆస్కారం ఉంది

అపోహ: బాగా వేయించిన కాఫీ గింజల్లో కెఫీన్ ఎక్కువ.

నిజం: బాగా వేయించినంత మాత్రాన కెఫీన్ పెరగదు. కాకపోతే బాగా వేయించడం వల్ల కాఫీ గింజలు పేలాల్లా మారతాయి. ఇక కాఫీ దుకాణాల్లో మామూలుగా వేయించినవాటిలానే, బాగా వేయించినవాటినీ తూస్తారు. దీంతో బాగా వేయించినవి ఎక్కువ పరిమాణంలో అవసరమవుతాయి. అలా కెఫీన్ కొంచెం ఎక్కువ పరిమాణంలో తీసుకుంటాం. అందువల్ల కాఫీ తాగేటప్పుడు%ా% ఏ రకం గింజలు, కాఫీ ఎలా తయారు చేశారన్న దానిపైనా దృష్టిపెట్టాలి. రోబస్టా కాఫీ గింజల్లో అరబికా రకం గింజల కంటే రెట్టింపు కెఫీన్ ఉంటుంది. ఇక పొట్టలో ఎసిడిటీ తలెత్తకూడదంటే మాత్రం మామూలు వాటికంటే బాగా వేయించినవే మంచివి.

# సమ్మర్ డ్రింక్స్‌లో బెస్ట్ ఆప్షన్స్ ఇవే..!

వేసవిలో భానుడి భగభగలకు సేద తీరేందుకు సమ్మర్‌లో చల్లటి పానీయాలు ఆస్వాదిస్తుంటారు. అయితే మండు వేసవిలో ఎండ వేడిమిని తట్టుకునేందుకు శీతల పానీయాలు తీసుకునే క్రమంలో ఆరోగ్యకర సమ్మర్ డ్రింక్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. వర్కవుట్స్, డైట్, స్విమ్మింగ్ వంటివి ఈ సీజన్‌లో ఉపశమనం ఇవ్వడంతో పాటు బరువు తగ్గేందుకూ ఉపకరిస్తాయి, వీటితో పాటు సమ్మర్ హీట్ను బీట్ చేసేందుకు డ్రింక్స్ తీసుకునే క్రమంలో ఆరోగ్యకర ఆప్షన్స్‌ను ఎంచుకోవాలి.



ఇక ఈ డ్రింక్స్ తయారుచేసుకునే క్రమంలో పండ్లు, హెర్బ్స్ విషయంలో తాజాగా ఉండే వాటినే ఉపయోగించాలి. తాజా పండ్లతో మీరు తీసుకునే డ్రింక్స్‌లో పోషక విలువలు మెండుగా ఉంటాయి. కృత్రిమ రుచులు, రంగులు వాడే బదులు పండ్ల రసాలు కలపడం లేదా నిమ్ రసం, జోడించవచ్చు. తాజా నీటిలో బెర్రీస్, కీరా దోశ, మింట్ వంటివి కలిపి తీసుకుంటే అదనపు క్యాలరీలు, షుగర్ లేకుండా జాగ్రత్త పడవచ్చు.

ఇక సమ్మర్ డ్రింక్స్‌లో అతిగా షుగర్ వాడితే పలు అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నట్టు అవుతుంది. ఈ పానీయాల్లో చక్కెర తక్కువగా వాడటం మేలు. ఇక వేసవిలో డీహైడ్రేషన్ బారినపడకుండా మీరు తీసుకునే పానీయాల్లో హైడ్రేటింగ్ ఎలిమెంట్స్ ఉండేలా చూసుకోవాలి.

వాటర్‌మెలన్, కుకుంబర్ పీస్‌లను కలిపితే టేస్ట్‌తో పాటు శరీరం డీహైడ్రేషన్ బారినపడకుండా చూసుకోవచ్చు. ఇక హెర్బల్ టీలను తీసుకుంటే పలు ఆరోగ్య ప్రయోజనాలను దక్కించుకోవచ్చు. కాక్‌టైల్స్, మాక్‌టైల్స్ తీసుకునే సమయంలో తాజా పండ్ల ప్యూరీలను కలుపుకుంటే రుచితో పాటు ఆరోగ్యానికి మేలు కలుగుతుంది.

# వెజిటబుల్ వయాగ్రాలా 'బీట్‌రూట్'?

ప్రచారం: బీట్‌రూట్.. వెజిటబుల్ వయాగ్రాలా పని చేస్తుందని నెట్టింట ప్రచారం జరుగుతున్నది. స్త్రీ, పురుషుల లైంగిక సామర్థ్యాన్ని ఇది పెంపొందిస్తుందన్న వార్త వైరల్ కావడంతో ఆస్ట్రేలియా సూపర్ మార్కెట్లలో బీట్‌రూట్ కొరత ఏర్పడిందట. యూకేలో టీవీ డాక్టర్ మేఖెల్ మోస్లా బీట్‌రూట్ వయాగ్రాలా పనిచేస్తుందని చెప్పాడంటూ ఓ వార్త వైరల్‌గా మారింది.



వాస్తవం: బీట్‌రూట్ వయాగ్రాలా పనిచేస్తుందని డాక్టర్ మోస్లా చెప్పినట్టు కానీ, శాస్త్రీయంగా ఆ విషయం రుజువైనట్లు కానీ ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. బీట్‌రూట్‌లో విటమిన్ బీ, సీ, మినరల్స్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. రక్త ప్రసరణకు ఇవి బాగా దోహదపడతాయి. బీట్‌రూట్ కామోద్దీపనగా పనిచేస్తుందని రోమన్లు నమ్మేవారు. అక్కడ వారు అందుకోసమే బీట్‌రూట్ రసాన్ని సేవిస్తారట. అయితే మనం బీట్‌రూట్ తిన్నప్పుడు, బ్యాక్టీరియా, ఎంజైమ్‌లతో కూడిన రసాయన ప్రతి చర్యలు బీట్‌రూట్‌లోని నైట్రేట్‌ను నైట్రేట్‌గా, తర్వాత నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుస్తాయి. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలను విస్తరించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది లైంగిక సామర్థ్యంపై సానుకూల ప్రభావం చూపొచ్చు.

# ఈ గింజలు రోజూ తింటే ఒంట్లో కొవ్వు కరిగిపోతుంది తెలుసా..?

ఈ మధ్య హై కొలెస్టరాల్ సమస్య ఎక్కువవుతోంది. చాలామంది ఈ అధిక కొవ్వు సమస్యతో బాధపడుతున్నారు. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లే ఇందుకు కారణమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక కొలెస్ట్రాల్ కారణంగా గుండె



జబ్బుల బారినపడే ప్రమాదం ఉంది. కొలెస్టరాల్ తగ్గడానికి కొన్ని రకాల గింజలు మేలు చేస్తాయి. వాటిలో ఫైబర్‌తోపాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. ఆ గింజలను ఆహారంగా తీసుకోవడంవల్ల కొవ్వు సమస్య నుంచి ఈజీగా బయటపడొచ్చు. మరి ఆ గింజలు ఏమిటో తెలుసుకుందాం..

అవిసె గింజలు గుండె ఆరోగ్యానికి చాలా ఉపయుక్తం. వీటినే లీన్ సీడ్స్ అని కూడా అంటారు. ఈ గింజలల్లో ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి తోడ్పడుతాయి. కొలెస్ట్రాల్ సమస్యను తగ్గించడంలో చియా విత్తనాలు కూడా దోహదపడతాయి. వీటిలో కూడా ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. చెడుకొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి దోహదపడతాయి.

అదేవిధంగా జనపనార విత్తనాలను తీసుకోవడంవల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ప్రోటీన్‌తో పాటు గామా లినోలెనిక్ యాసిడ్ ఉంటుంది. కొలెస్టరాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి చక్కగా పనిచేస్తాయి. గుమ్మడి గింజలు కూడా కొవ్వును తగ్గించడంలో బాగా పనిచేస్తాయి. ఈ గింజలల్లో ఒమెగా-6 ఫ్యాటీ యాసిడ్స్, మోనో శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. నువ్వులకు కూడా కొవ్వును తగ్గించే గుణం ఉంది. వీటిలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. కడుపులో మంటను తగ్గించడంలో, కొవ్వును కరిగించడంలో ఇవి సాయపడతాయి.

రక్తంలో కొవ్వు సమస్యతో బాధపడేవారు పొద్దుతిరుగుడు గింజలను తీసుకోవడంవల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో విటమిన్ 'ఇ' తోపాటు మోనో శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి సాయపడుతాయి. నల్ల నువ్వులను తీసుకోవడం వల్ల కూడా చెడు కొవ్వు తగ్గుతుంది. వీటితో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు క్యాన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది.

# ఒకేసారి లీటరు కొబ్బరి నీళ్లు తాగొచ్చా?

ఎండాకాలం దాహం కోసమో, ఆరోగ్యానికి మంచిదనో కొబ్బరి నీళ్లు తాగుతుంటాం. అయితే ఇటీవల బోండాలతోపాటు బాటిళ్లలోనూ కొబ్బరి నీళ్లను అమ్ముతున్నారు. ఇలా ఒకేసారి లీటరు కొబ్బరి నీళ్లు తాగొచ్చా? దీనివల్ల కిడ్నీల మీద ఏమైనా భారం పడుతుందా! అసలు ఒక రోజులో, లేదా వారంలో ఎన్ని కొబ్బరి నీళ్లు తాగొచ్చు తెలియజేయండి?

శరీరంలో ద్రవాల స్థాయిని నియంత్రణలో ఉంచేందుకు, ఎలక్ట్రోలైట్లను సమతౌల్యం చేసేందుకు కొబ్బరి నీళ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. సోడియం, పొటాషియం, మాంగనీసులాంటివి ఇందులో ఎక్కువగా ఉంటాయి. వడదెబ్బకు, డయేరియాకు కొబ్బరినీళ్లు మంచి మందు. పొటాషియం ఎక్కువగా ఉంటుంది కాబట్టి గుండె జబ్బులు, బీపీ ఉన్నవాళ్లకు మంచిది. ఇందులో ఉండే మీడియం చెయిన్ ట్రై గ్లిజరైడ్లు చర్మానికి, జుట్టుకి మేలు చేస్తాయి. జీర్ణశక్తికి కూడా ఉపయోగపడతాయి.

పొటాషియం శరీరంలోని విషతుల్యాలను బయటికి నెట్టేసేందుకు ఉపయోగపడుతుంది. కాబట్టి కిడ్నీలకు కూడా మంచివి. అంతేకాదు కొబ్బరినీళ్లలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక వ్యవస్థకు మేలు చేస్తుంది. ఇందులో విటమిన్లు, మినరళ్లు పోను 95 శాతం మంచి నీళ్లే ఉంటాయి. 20-40 ఏండ్ల మధ్య వయసున్న వాళ్లు రోజుకు లీటరు కొబ్బరినీళు తాగొచ్చు. యాభై ఏండ్లు పైబడిన వాళ్లు ఏ ఇతర ఆరోగ్య సమస్యలు లేకపోతే చక్కగా వీటిని తాగొచ్చు. అయితే డయాబెటిస్ ఉన్న వాళు మాత్రం రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను బట్టి తీసుకోవాలి. కాబట్టి, న్యూట్రీషనిస్టులను సంప్రదించి దానికి తగ్గట్టు తీసుకోవడం మంచిది.



**పొటాషియం శరీరంలోని విషతుల్యాలను బయటికి నెట్టేసేందుకు ఉపయోగపడుతుంది. కాబట్టి కిడ్నీలకు కూడా మంచివి. అంతేకాదు కొబ్బరినీళ్లలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక వ్యవస్థకు మేలు చేస్తుంది. ఇందులో విటమిన్లు, మినరళ్లు పోను 95 శాతం మంచి నీళ్లే ఉంటాయి.**

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy